విశాలాంధ్ర
చందా వివరాలు

	ఏజెంటుద్వారా	పోస్టుద్వారా
సంవత్సరం	రు. 38 00	రు. 45 00
ఆరు మాసాలు	19 00	22 50
మూడు మాసాలు	9 75	11 25
ఒక మాసం	3 25	3 75

VISALAANDHRA Phone 6376
ఉదయం
* * Regd No. H. 203

విశాలాంధ్ర

702420

సంపుటి 16, సంచిక 208] విజయవాడ 20—10—1966 గురువారం [6 పేజీలు 10 పై.

కుష్టు సమస్త మహా వ్యాధులకు
బొల్లి మొదటి నెలలో 40% నివారణ!!! 10% నివారణ!!
మా లెప్రసిన్ అమోఘ ఔషధము!!!
వివరములకు గ్రంధే రఘురామ గుప్త
అమర జ్యోతి ప్రొడక్ట్స్ మార్కాపురం, కర్నూలు జిల్లా.

ఆహార సమస్యపై గుంటూరులో నిరాహార దీక్షకు సన్నాహం

ఈనెల 24వ తేదీనుండి కమ్యూనిస్టునాయకులు శ్రీ కనపర్తి నాగయ్య ప్రభృతులచే ప్రారంభం

ఆందోళనోద్యమానికిసర్వులూ అండదండలందించాలని విజ్ఞప్తి

(విశాలాంధ్ర విలేకరి)

గుంటూరు, అక్టోబరు 19

ప్రభుత్వం ప్రకటించిన ధరలకంటే హెచ్చుధరలకు బియ్యం అమ్ముతున్నందుకు, అక్కుళ్ల బియ్యాన్ని సన్నాలుగా మార్కెట్లో, చెలామణి చేస్తున్నందుకు నిరసనగాను, తక్కువ ధరలకు బియ్యం అమ్మించాలని కోరుతూను, ఈనెల 24 వ తేదీనుండి కమ్యూనిస్టు పార్టీ శాసనసభ్యులు, ప్రదేశ్ ట్రేడ్‌యూనియన్ ఉపాధ్యక్షులు అయిన శ్రీ కనపర్తి నాగయ్య ప్రభృతులు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరాహారదీక్ష ప్రారంభించడానికి నిర్ణయించుకొన్నారు.

నిరాహార దీక్ష సాగించునున్న వారిలో మునిసిపల్ కౌన్సిల్ ప్రతిపక్ష నాయకులు శ్రీ కోట వెంకటేశ్వర్లు, పట్టణ కమ్యూనిస్టు కమిటీ కార్యవర్గ సభ్యులు శ్రీ గోగినేని సూర్యనారాయణ, పట్టణ కార్మిక నాయకులు శ్రీ జి.వి.కృష్ణారావు, రిక్షా డ్రైవర్సు అండ్ వర్కర్సు యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ కామశ్న రామచంద్రరావు గార్లున్నారు. వీరు కలెక్టరాఫీసుముందు 24 వ తేదీ నుండి నిరాహారదీక్ష సాగిస్తారని పట్టణ కమ్యూనిస్టు సమితి ప్రకటిస్తూ ఈ ఆందోళనోద్యమాన్ని అన్ని పక్షాలవారు బలపరచాలని విజ్ఞప్తి చేసింది.

తూర్పు యూరప్ దేశాలతో వాణిజ్యానికి అమెరికా విముఖత

వాషింగ్టన్, అక్టోబర్ 18

సోవియట్ యూనియన్ తవితర తూర్పు యూరప్ దేశాలతో, వర్తకంచేసే సంస్థలకు అమెరికా ఎగుమతి, దిగుమతుల బ్యాంక్ పరపతి సౌకర్యం కల్పించరాదని అమెరికా ప్రతినిధుల సభ ఆంక్ష పెట్టింది.

తూర్పు యూరప్ దేశాలతో వాణిజ్యం అభివృద్ధి చేసుకోవాలని తన ప్రభుత్వం భావిస్తున్నదని జాన్సన్ ఇటీవలే ప్రకటించిన సంగతి పాఠకులకు విదితమే.

జాన్సన్ యత్నాలను అడ్డుకొట్టడానికే సెనేట్ ఈ నిర్ణయం చేసి దని పరిశీలకులు భావిస్తున్నారు.

ఉత్తర వియత్నాంకు సహాయపడే ఏ దేశానికైనా అమెరికా సహాయం చేయరాదని ఈ బిల్లును బలపర్చినవారన్నారు.

ఈ బిల్లు యిక సెనేట్ పరిశీలనకు వెళుతుంది.

'యుద్ధ విస్తరణ కార్యక్రమం'

పసిఫిక్ ప్రాంతంలో జాన్సన్ పర్యటనపై చైనా వ్యాఖ్య

హాంకాంగ్, అక్టోబరు 17

ఒక ప్రక్క శాంతిజెండా ఎగురవేస్తూ మరో ప్రక్క వియత్నాంలో యుద్ధ విస్తరణకు పాల్పడటానికే జాన్సన్ పసిఫిక్ ప్రాంత రాజ్యాలలో పర్యటనకు బయలుదేరాడని చైనా విమర్శించింది.

జాన్సన్ పసిఫిక్ దేశాల పర్యటనపై చైనా వ్యాఖ్య చేయటం యిదే ప్రథమం.

జాన్సన్ ప్రభుత్వం దావు ద్రోహుల మధ్య కొట్టుమిట్టాడుతూ, ఏలాగయినా వియత్నాంలో నిలవేందుకుగాను ఈ యత్నం చేస్తున్నదని చైనా విమర్శించింది.

ఆర్. టి. సి. తాత్కాలికోద్యోగుల నిరాహారదీక్ష

అక్టోబరు 26 నుంచి ప్రారంభం

హైదరాబాద్, అక్టోబరు 17

ఆర్.టి.సి తాత్కాలికోద్యోగులుగాపున్న కండక్టర్లు, డ్రైవర్లు హైదరాబాద్‌లో ప్రతి రోజు బట్టువారీగా 26 వ తేదీ నుంచి 24 గంటల పాటు వరుసగా నిరాహారదీక్ష కొనసాగించాలని ఆర్. టి. సి. ఎంప్లాయీస్ యూనియన్ కార్యవర్గ సర్వం నిన్న సమావేశమై నిర్ణయించింది.

సోషలిస్టు రాజ్యాల శిఖరాగ్రసభ

మాస్కోలో ప్రారంభం

మాస్కో, అక్టోబరు 18

మాస్కోలో తొమ్మిది సోషలిస్టు రాజ్యాల శిఖరాగ్ర సమావేశం నేడు ప్రారంభమైనట్లు తెలుస్తున్నది. అయితే ఈ సమావేశం గురించిన అధికార ప్రకటన ఏదీ వెలువడలేదు. ఈ శిఖరాగ్ర సభముగిసిన తరువాతనే అధికార ప్రకటన సంభవమని సోవియట్ వర్గాలవారు వెల్లడించారు.

ఈ సమావేశంలో వియత్నామ్ సమస్య, చైనా సమస్యలు చర్చకు రాగలవని తెలుస్తున్నది. ఆరు తూర్పుయూరప్ రాజ్యాల నాయకులు క్యూబా అధ్యక్షులు డార్టికస్, మంగోలియా ప్రధాని సెడెన్‌బల్, సోవియట్ నాయకులు ఈ శిఖరాగ్రచర్చలలో పాల్గొంటున్నారు.

రూపాయిమారకానికి నేపాల్‌కు చైనా సహాయం

రూకవిలువతగ్గింపుకుపూర్వం గల విలువమేరకు స్టెర్లింగ్‌లలోకి మార్చడానికి సమ్మతి

ఖాట్మాండు, అక్టోబరు 19

భారతదేశం నేపాల్‌కు ఆర్థిక సహాయం రూపంలో యిచ్చిన 16 కోట్ల రూపాయలను రూక విలువ తగ్గింపుకు పూర్వమున్న విలువ మేరకు స్టెర్లింగులలోకి మార్చి పెట్టడానికి చైనా సమ్మతించింది.

భారతదేశం రూక విలువ తగ్గించినందున నేపాల్ నష్టపోకుండా వుండేందుకై చైనా ఈ చర్యకు సమ్మతించిందని నేడిక్కడ అధికారికంగా ప్రకటించారు.

ఈ మొత్తాన్ని నేపాల్ ఇంతవరకూ ఉపయోగించుకోలేదు

ఈ విషయాన్ని తెలిపే పత్రాలను నేపాల్‌లోని చైనా రాయబారి, నేపాల్ ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి పరస్పరం నిన్న ఇక్కడ మార్చి చేసుకొన్నారు. నేపాల్ అనుసరిస్తున్న నూతన ద్రవ్య విధానాన్ని బాహాటంగా సమర్థించిన మొదటి దేశం చైనా అని చెపుతూ, దీనికై చైనాకు కృతజ్ఞత తెలుపుతూ నేపాల్ ప్రభుత్వం నేడిక్కడ ఒక పత్రికా ప్రకటన విడుదలచేసింది

ఇదే సందర్భంలో నేపాల్ చైనాకు 15 కోట్ల మేరకు ఆర్థిక సహాయంచేయడానికి చేసిన హామీని సైతం వినియోగించుకొనడానికి సంప్రతింపులు కొనసాగుతున్నాయి.

నేపాల్ యువరాజు బిరేంద్ర ఈ సంవత్సరం పెకింగ్‌లో పర్యటించిన సందర్భంగా చైనా ఈ వాగ్దానం చేసింది.

పెకింగ్ వీధులలో మావో ఊరేగింపు

పెకింగ్, అక్టోబరు 18

చైనా కమ్యూనిస్టుపార్టీ అధ్యక్షులు మావో సేటుంగ్, రక్షణ మంత్రి లిన్‌పియావో నేడు పెకింగ్ వీధులలో ఊరేగారు. ఈ ఊరేగింపు ఎందుకు ఏర్పాటు చేయబడిందో అధికారరీత్యా వెల్లడించలేదు.

పెకింగ్ పౌరులు తెల్లవారు ఝామున మూడు గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మొత్తం పది గంటలపాటు తమ నాయకులను దర్శించడానికి వీథుల కిరువైపుల బారులు తీరి కూర్చున్నారు.

సుమారు డజను జీపులలో చైనా నాయకులు ఆసీనులై వున్నారు. ఈ జీపులలో అగ్రశ్రేణి జీపులలోమావోఆసీనులై వున్నారు. ఈ జీపులు గంటకు 20 మైళ్ళ వేగంతో ప్రయాణించాయి.

నాయకులంతా సైనిక దుస్తులు ధరించి వున్నారు.

సహకారశాఖకు 10 కోట్లకోత

మంత్రి వెల్లడి

కాకినాడ అక్టోబరు 19

రాష్ట్ర సహకారశాఖకు నాల్గవ ప్రణాళికలో కేవలం 6 కోట్లు మాత్రమే ప్రభుత్వం కేటాయించినదని, మూడవ ప్రణాళికలో ఈ శాఖకు కేటాయించిన మొత్తం 16 కోట్లు అని సహకారశాఖమంత్రి శ్రీ తోట రామస్వామి నేడిక్కడ ప్రకటించారు.

జమ్మూలో తిరిగి పోలీసు కాల్పులు

ఒక నిండు ప్రాణం బలి

కల్లోలప్రాంతం సైన్యం అధీనం

జమ్మూ, అక్టోబరు 18

జమ్మూ నగరంలో తిరిగి నేడు రెండవ నాడు సిటీ చౌక్ ప్రాంతంలో పోలీసులు కాల్పులు జరిపిన ఫలితంగా ఒక వ్యక్తి మరణించాడు.

జమ్మూనగరంలో కల్లోల ప్రాంత మంతటినీ సైన్యం తన అజమాయిషీ క్రిందికి తీసుకొని పహరా కాస్తున్నది.

అంతకుముందు పోలీసులు ప్రజానీకంపై నాలుగువందల బాష్పవాయువు తూటాలు కాల్చారు

ఉద్రిక్తులైన ప్రజానీకం పోలీసులపై రాళ్ళు రువ్విన ఫలితంగా ఈ కాల్పులు జరపవలసి వచ్చిందని పోలీసువర్గాలవారు సమర్థించుకుంటున్నారు.

సైన్యం అజమాయిషీ

జమ్మూ నగరంలోని కల్లోల ప్రాంతం రఘునాథబజార్, కనకమండి, రాజేంద్ర బజార్, రెసిడెన్సీ రోడ్డు ప్రాంతాలను సైన్యం అజమాయిషీక్రిందికి తీసుకొన్నదని ఇన్‌స్పెక్టరు జనరల్ నేడిక్కడ అన్నారు.

30 వేల ప్రజల సమక్షంలో మృతుల అంత్యక్రియలు

నిన్నటి పోలీసు కాల్పుల్లో మరణించిన ముగ్గురు విద్యార్థులకు నేడు 30 వేల మంది ప్రజానీకంసమక్షంలో అంత్యక్రియ జరిపారు

నిన్నటి కాల్పుల్లో గాయపడిన మరొక విద్యార్థి సైతం మరణించాడనీ, అయితే పోలీసులు ఆ శవాన్ని ఇంతవరకూ తమకు స్వాధీనం చేయుట లేదనీ విద్యార్థులు చెప్పారు.

నిరాహారవ్రతుని మృతి ?

నిరాహారదీక్ష కొనసాగిస్తున్న ప్రభుత్వ వ్యవసాయ కళాశాల విద్యార్థి సైతం జైలులో మరణించాడని విద్యార్థులు చెపుతున్నారు. అయితే ఈ విషయాన్ని అధికారులు యింతవరకూ ధృవీకరించలేదు.

ఇక్కడికి సమీపంలో రణబీర్‌సింగ్ పురాలోగల ప్రభుత్వ వ్యవసాయ కళాశాల విద్యార్థి జరుపుతున్న నిరాహార వ్రతానికి సానుభూతిగా నిన్న జమ్మూలో విద్యార్థులు ప్రదర్శనలు జరపనారంభించడంతో పోలీసులు హత్యాకాండకు దిగి ముగ్గురు విద్యార్థులను పొట్టపెట్టుకొన్న విషయం పాఠకులకువిదితమే అనంతరం నిరాహార దీక్ష కొనసాగిస్తున్న విద్యార్థిని పోలీసులు జైలుకు తరలించారు.

జమ్మూలో 2 వ రోజు హర్తాళ్

జమ్మూ, అక్టోబరు 19

జమ్మూ పట్టణంలో పోలీసులు విద్యార్థులపై జరిపిన కాల్పుల్లో నలుగురు విద్యార్థులు చనిపోయినందుకు నిరసనగా పట్టణంలో నేడు రెండవరోజుకూడా పూర్తి హర్తాళ్ జరిగింది

నిన్నటి నుండి బస్సులు, టాంగాలు, ప్రయివేటు కార్లుకూడా పూర్తిగా ఆపివేయబడ్డాయి.

పట్టణంలో శాంతిభద్రతల బాధ్యతను పోలీసులనుండి సైనికులు స్వీకరించడంతో, పరిస్థితి అదుపులోకి వచ్చింది. సైనికులు వెళుతుండగే, ప్రజలు మేడలపై నుండి "భారత సైన్యం వర్ధిల్లాలి" అంటూ నినాదాలు చేశారు.

స్థానిక పత్రికలు పోలీసు కాల్పులను ఖండిస్తూ విచారసూచకంగా నల్లగీతలతో ప్రకటించబడ్డాయి.

ఎట్టిహెచ్చరికలు చేయకుండానే విద్యార్థులపైన పోలీసులు కాల్పులు జరిపారనీ, కాల్పులకు బాధ్యులైన అధికార్లను వెంటనే బర్తరఫు చెయ్యాలనీ నిన్న విద్యార్థి కాంగ్రెసు ఆధ్వర్యానజరిగిన బహిరంగసభ ఒక తీర్మానంలో కోరింది.

నిన్న పోలీసు కాల్పుల్లో చనిపోయిన విద్యార్థులకు సానుభూతిగా పట్టణంలో

(మిగతా 5 వ పేజీలో)

ఉస్మానియా విశ్వ విద్యాలయ విద్యార్థుల సమ్మె

చనిపోయిన విద్యార్థులకు సానుభూతిగా

హైదరాబాదు, అక్టోబరు 18

ఇటీవల దేశంలోని వివిధ ప్రాంతాలలో పోలీసు కాల్పుల్లో చనిపోయిన విద్యార్థులకు సానుభూతిగా అక్టోబరు 23 న సమ్మె చేయాలని ఉస్మానియా విశ్వ విద్యాలయ విద్యార్థుల సంఘ సమావేశం నిర్ణయించింది.

అన్ని అనుబంధ కళాశాలల విద్యార్థులు కూడా యీ సానుభూతి సమ్మె జరుపుతారు.

వివిధ ప్రదేశాల్లో విద్యార్థులపై పోలీసులు జరిపిన అత్యాచారాలను ప్రత్యేకించి నిన్న జమ్మూలో జరిగిన ఘటనలను సమావేశంలో పాల్గొన్న వివిధ విద్యార్థి నాయకులు ఖండించారు.

సెంట్రల్ కేఫ్ యజమానుల అక్రమ చర్యలకు నిరసనగా 13—10—66 నుండి నేటివరకూ నిరాహారదీక్షను కొనసాగించిన శ్రీ కె. రామారావు.

గుంటూరు హోటల్ వర్కర్ల విజయం

శ్రీ రామారావు దీక్ష విరమణ

[విశాలాంధ్ర విలేకరి]

గుంటూరు అక్టోబరు 19

ఏప్రిల్ నెలకు ముందు అసలులో వున్న వేతనాలను కార్మికులకు యివ్వటానికి సెంట్రల్ కేఫ్ యజమానులు అంగీకరించిన ఫలితంగా 13 వ తేదీనుంచి నిరాహారదీక్ష చేస్తున్న గుంటూరు హోటల్ కార్మిక నాయకులు శ్రీ రామారావు యీరోజు 11 గంటలకు తన దీక్షను విరమించారు.

ఈ వార్తవిన్న పట్టణంలోని హోటల్ కార్మికులు 200 మంది ఉత్సాహంతో ఊరేగింపు జరిపారు.

హోటల్ వర్కర్స్ యూనియన్ వర్ధిల్లాలి కార్మిక ఐక్యత వర్ధిల్లాలి అనే నినాదాలతో వందలాది కార్మికులు, శ్రీ రామారావును రిక్షాపై కూర్చుండబెట్టుకుని ప్రధాన వీధులగుండా సాగిపోయారు.

ఉదయం 9 గంటలకు డి యస్. పి.

(మిగతా 5 వ పేజీలో)

పెద్దాపురం రిక్షా కార్మికుల సమ్మె

రిక్షా అద్దె పెంచినందుకు నిరసనగా ఈనెల 15 వ తేదీనుండి కొనసాగింపు

పెద్దాపురం, అక్టోబరు 17

రిక్షాల అద్దెను రు 1.25 నుంచి 1.50 కి పెంచినందుకు నిరసనగా తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురం రిక్షా పనివారు ఈ నెల 15 నుండి సమ్మె చేస్తున్నారు.

పెద్దాపురంలో ఒక్క సిరిసూనూల మాత్రమే వున్నది. రైలు మార్గం లేదు. వ్యాపార కేంద్రమూ కాదు పల్లెటూరూకాదు. పట్టణమూ కాక మధ్యరకంగా వున్నది కాకినాడ-రాజమండ్రికి వున్న సదుపాయం ఇక్కడ లేదు. రోజూ రిక్షా తొక్కినా మొత్తంపైన రెండు రూపాయలు కూలి గారకక రిక్షా పనివారు, రోజువారీ అద్దెకు 10 రు. 20 బకాయి పడి వుంటున్నారు. ఏ ఆధారమూ లేక రెక్కలు ముక్కలు చేసుకొని, రక్తాన్ని చెమటగా మార్చి రిక్షాలు త్రొక్కుతున్నారు. ఆహారధాన్యాల ధరలు విపరీతంగా పెరిగిపోయినందున ఎక్కువతో పోల్చాలని తిండితిని శ్రమపడుతున్నారు ఈ పరిస్థితిలో పెద్దాపురం రిక్షా యజమానులు 15.10.66 నుండి రోజుకు రు. 1.50 అద్దె చొప్పునఅయితేనే రిక్షాలు తీసుకెళ్ళండి. లేదా మానివేయండి పాత అద్దె 1.25 మాత్రం బహ్నయివ్వం అని 14.10.66 న రాత్రి పనివారికి చెప్పారు. పనివారు ఎవరి బస్సువారికి అప్పగించారు. కరువు పరిస్థితిలో ఎక్కువ అద్దె యివ్వలేమని సభ జరిపి తీర్మానించారు.

రిక్షాకార్మికులు 15వ తేదీన పూరేగింపుగా శ్రీ బళ్ళఅప్పారావు నాయకత్వమున డిప్యూటీ కలక్టరు వద్దకు, పోలీసు సూపరింటెండెంటు వద్దకు రాయబారం వెళ్ళారు. కలక్టరు, సూపరింటెండెంటు గ్రామంలో లేరని తెలుసుకొని పెద్దాపురం పోలీసు సర్కిల్ ఇనస్పెక్టర్‌ను కలుసుకొని ఎక్కువ అద్దె కట్టలేని పరిస్థితులు చెప్పి ఒక మెమోరాండం యిచ్చారు. పనివారు చెప్పిన విషయాలు విని రిక్షా యజమానులను పిలిచి మీ సమక్షంలో పరిష్కరించుతాను అని కారులు చెప్పినారు.

సుమారు 16 వ తేదీన కొల్లి పెద్దయ్య అనే ఒక రిక్షాయజమాని వర్కరుని గద్దిసూర్య రాజును, బకాయికొట్టారు. ఈ విషయం గురించి సూర్యరాజు పోలీసులకు రిపోర్టు యిచ్చినారు. పెద్దాపురం డిప్యూటీ కలక్టరు వద్దకుఆరోజున రిక్షా వర్కర్సుతోసహా వారి ప్రతినిధులు వెళ్లి విజ్ఞప్తి చేశారు. (ప.ప.)

ఇప్పటికి 1500 అమెరికావిమానాల కూల్చివేత

హాంకాంగ్, అక్టోబరు 18

తమ దేశంపై దాడికి వచ్చిన 1500 అమెరికన్ యుద్ధ విమానాలను ఇప్పటికి ఉత్తర వియత్నాం భద్రతా దళాలు నేల కూల్చాయి.

గతవారం శుక్రవారంతోనే ఈ సంఖ్య పూర్తయ్యిందని ఆ తర్వాత మరో 3 విమానాలను, హనోయ్ సైన్యాలు నేలకూల్చాయని ఉత్తర వియత్నాం వార్తాసంస్థ ఈ రోజు ప్రకటించింది.

నిస్సైనిక మండలంపై అమెరికా దాడులు

ఉత్తర, దక్షిణ వియత్నాంల మధ్యగల నిస్సైనిక మండలం తూర్పు ప్రాంతంపై అమెరికా విమానాలు తిరిగి అగ్నివర్షం కురిపించడం ప్రారంభించాయి.

ఈ రోజు అమెరికా విమానాలు యీ

హనోయ్ సైన్యాల పోరాట పటిమ

ప్రాంతంపై తొమ్మిదిసార్లు దాడులు జరిపాయి.

సైగాన్‌లో వియత్‌కాంగ్ గెరిల్లాలు ప్రయోగించిన గ్రెనేడ్ దెబ్బకు అయిదుగురు అమెరికన్లు గాయపడ్డారు.

సైగాన్ గానే మరొకచోట ఒక సాయుధ పోలీసును కాల్చివేసి గెరిల్లాలు అతని దగ్గర వున్న ఆయుధాలను ఎత్తుకుపోయారు.

నిన్న సైగాన్‌లో గ్రేనేడ్ ప్రేలుడు అనంతరం, అమెరికన్ సైనికాధికారులలో కలవరం బయలుదేరింది. మరొక సారి గెరిల్లాల మెరుపుదాడులు తీవ్రం కావచ్చునని భయపడుతున్నారు.

అమెరికా సైనికులు కడు జాగరూకులై వుండాలని హెచ్చరికలు చేయబడినాయి.

చైనా కార్మికవర్గానికి సోవియట్ శుభాకాంక్షలు

అక్టోబరు విప్లవ వార్షికోత్సవ నినాదం

మాస్కో, అక్టోబరు 18

సోషలిజాన్ని నిర్మిస్తూ, సోవియట్-చైనా ప్రజలమధ్య మైత్రీ సహకారాలకు కృషి చేస్తున్న చైనా కార్మికవర్గానికి సౌహార్ద శుభాకాంక్షలు తెలుపుతూ సోవియట్ యూనియన్ అక్టోబరు విప్లవం 49వ వార్షికోత్సవం సందర్భంగా ఒక నినాదం రూపొందించింది.

ఈవిప్లవవార్షికోత్సవం సందర్భంలోసోవియట్ యూనియన్ ఏభైనినాదాలను రూపొందించింది. వీటిని టాస్ వార్తాసంస్థ నేడు ప్రకటించింది.

ఎరువులబ్లాక్ కేసులో 3 ఏండ్ల జైలు శిక్ష

వినుకొండ తాలూకాలో కాంగ్రెస్ నాయకులకు

వినుకొండ, అక్టోబరు 18

ఎరువుల బ్లాక్‌మార్కెట్ చేసిన నేరానికి గుంటూరుజిల్లా వినుకొండ తాలూకా నరిపల్లి గ్రామ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు శ్రీ గంగయ్యకు నరసరావుపేట సబార్డినేట్ కోర్టులో మూడు సంవత్సరాల శిక్ష, 2 వేల రూపాయిల జరిమానా విధించబడింది.

ఈ తాలూకాలోని ఇనుమెళ్ళ, కొండ్రముట్ల, రేమిడిచర్ల, వడ్డిగుంట్ల సహకార సంఘాల అధ్యక్షులు మీదకూడా యిలాంటి కేసులే ప్రస్తుతం కోర్టు విచారణలో వున్నవి. వీరంతా ఈ ప్రాంతంలో కాంగ్రెస్ నాయకులే. (వి. వి.)

దేశ ప్రజలకు ప్రధాన మంత్రి నీతి బోధలు

రేడియోలో వివరణ

న్యూఢిల్లీ, అక్టోబరు 19

జాతీయ సంఘీభావ దినోత్సవ సందర్భములో ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధి నేటిరాత్రి రేడియోలో ప్రసంగిస్తూ, దేశ ప్రజలు దేశ రక్షణకు, దేశాభివృద్ధి సాధనకు నడుం బిగించాలని ఉద్బోధించారు.

యువకులకు త్వరలోనే జాతీయ సేవా కార్యక్రమం రూపొందించబడుతుందని, విద్యార్థులు ఈకార్యక్రమంలో స్వచ్ఛందంగా ఉత్సాహంతో పాల్గొనాలని ఆమె కోరారు.

ఇప్పుడు 7 కోట్లుగా వున్న విద్యార్థులు 1985 నాటికి 17 కోట్లు కాగలరని ఆమె అంచనా వేశారు. జనరల్ విద్య విస్తరణ అవసరమైన మాట నిజమే అయినప్పటికీ, వృత్తివిద్య ప్రాధాన్యం మరింత అధికమని ఆమె అన్నారు.

ఖమ్మంలో అఖిలపక్ష సదస్సు

ఈ నెల 21 న ఏర్పాటు

ఖమ్మం, అక్టోబరు 19

ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఖమ్మంలో 21.10.66న అఖిలపక్ష సదస్సు జరుపుటకు ఖమ్మంజిల్లా అఖిలపక్ష సన్నాహక సంఘం నిర్ణయించినది. ఈ సదస్సులో మార్క్సిస్టుకమ్యూనిస్టు పార్టీ నాయకులు శ్రీ తరిమెల నాగిరెడ్డి కమ్యూనిస్టు పార్టీనాయకులుశ్రీ నల్లమల గిరిప్రసాదరావు పాల్గొంటారు.

సదస్సు ఉదయం గం॥ 11 లకు ఖమ్మం పట్టణంలో శ్రీ సర్వదేవభట్ల రామనాథం అధ్యక్షతన జరుగుతుంది. రాత్రికి బహిరంగసభ ఏర్పాటు చేశారు.

బహిరంగసభకు ఖమ్మం మున్సిపల్ ఛైర్మన్ శ్రీ చిర్రావూరి లక్ష్మీనరసయ్య అధ్యక్షత వహిస్తారు.

సభలో శ్రీయుతులు తరిమెల నాగిరెడ్డి, నల్లమలగిరి ప్రసాదరావు, డా॥ జి. ఉపేంద్రరావు (ఖమ్మంజిల్లా ప్రజా సోషలిస్టుపార్టీ నాయకులు). సర్వదేవభట్ల రామనాథం, బోడేపూడి వెంకటేశ్వరరావులు ప్రసంగిస్తారు.

తాజా వార్త

న్యూఢిల్లీ, అక్టోబరు 19

కేంద్ర ప్రభుత్వోద్యోగులకు అదనంగా యివ్వవలసిన కరువు భత్యం సమస్యపై గజేంద్రగడ్కర్ కమిషన్ చేసిన సిఫారసులను నేడు ప్రభుత్వం అంగీకరించింది.

ప్రదేశ్ వైద్య ఉద్యోగుల యూనియన్ 4వ మహాసభ

అక్టోబరు 20, 21 తేదీలలో గుంటూరులో
ఏకా దండయ్య పంతులు హాలులో ప్రారంభం :

అధ్యక్షులు : శ్రీ యం వి భద్రం (యం. పి)
ప్రారంభకులు : శ్రీమతి ఉషాగుప్త
(అఖిల భారత మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి)

అఖిల భారత మహాసభలు
(ఇదే సందర్భంలో ఈ నెల 22, 23 తేదీలలో అఖిలభారత మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ మహాసభలు సైతం జరుగుతాయి.)

అధ్యక్షులు : డా॥ రాజబహదూర్‌గౌడ్ (కార్మికనాయకులు)
ప్రారంభకులు : మహమ్మద్ ఇలియాస్ ఎమ్ పి.
సోవియట్ తూర్పు దేశాలనుండి సౌహార్ద ప్రతినిధివర్గం ఈ మహాసభలకు హాజరౌతారు.

ప్రతినిధులకు సూచన: రాష్ట్ర మహాసభలకు హాజరయ్యే ప్రతినిధులు 20వ తేదీ ఉదయం 8 గంటలలోను, అఖిలభారత మహాసభలకు హాజరయ్యే వారు 22వ తేదీ ఉదయానికి గుంటూరు చేరుకోవాలి.

విశాలాంధ్ర

అలీన రాజ్యాత్రయసభ

రేపు ఢిల్లీలో అలీనరాజ్యత్రయసభ ప్రారంభం కానున్నది. యుగోస్లావియా అధ్యక్షులు టిటో, ఐక్యఅరబ్ రిపబ్లిక్ అధ్యక్షులు నాజర్‌లు, భారత్‌కు బయలుదేరారు.

ఆగ్నేయాసియాలో అమెరికా దురాక్రమణ నానాటికి తీవ్రమౌతున్నదశలో జరుగుతున్న ఈ సభకు ప్రత్యేక ప్రాధాన్యమున్నది.

సరిగ్గా ఇదే సమయంలో అమెరికా అధ్యక్షులుగా జాన్సన్, ఆగ్నేయాసియాదేశాల పర్యటన ప్రారంభించాడు. అమెరికా తొత్తుదేశాలన్నీ ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో ఈనెల 24 న సమావేశం కానున్నాయి. వియత్నాంలో దురాక్రమణ యుద్ధాన్ని తీవ్రతరం చేయటానికే ఈసభను జాన్సన్ తలపెట్టినట్లు స్పష్టమౌతున్నది.

ఆగ్నేయాసియాలో యుద్ధజ్వాలలను తీవ్రతరంచేసి, ఆదేశాల స్వాతంత్ర్యాన్ని హరించి, నయావలసవాదాన్ని విస్తరింపచేయటం జాన్సన్ లక్ష్యం. వియత్నాం యుద్ధం అందుకొక సాధన. కమ్యూనిజంప్రమాదంనుండిఆగ్నేసియాను రక్షించటానికి ఈ యుద్ధం సాగిస్తున్నట్లు అమెరికా చేసే ప్రచారం అందుకొక ముసుగు.

అమెరికా దురాక్రమణ ధోరణులను సర్వవిధాలా ఎదిరించటం ప్రపంచ శాంతి ప్రియుల ప్రథమ కర్తవ్యం. అలీన రాజ్యాలసభ బాధ్యతకూడా అదే కనుకనే ఢిల్లీ సభకు నేడు ప్రత్యేక ప్రాధాన్యమున్నది.

భారతదేశం అలీన విధానానికి కట్టుబడిన దేశం. 1955 లో బాండుంగ్‌సభలో భారత వాణి శక్తివంతంగా వినిపించింది, ఆ తర్వాత క్రమంగా ఆ వాణి నీరసించ సాగింది,

1962 లో భారత్‌పై చైనాదాడి జరిగిన పిమ్మట భారత అలీన విధానంమరింతబలహీనపడ్డది. గత నాలుగేండ్లుగా, అనేక సందర్భాలలో ఈ బలహీనత వ్యక్తమౌతూవచ్చింది, తత్ఫలితంగా, ఆసియా స్వాతంత్ర్య రాజ్యాలలో భారత ప్రతిష్ఠ సన్నగిల్లటమేకాదు. భారతదేశ స్వతంత్ర ప్రతిపత్తికే భంగం కలుగుతున్నది.

చైనా ప్రమాదాన్ని ఎదుర్కోవాలంటే, అమెరికా పంచన చేరక తప్పదనే అభివృద్ధి నిరోధకధోరణి కొన్నివర్గాలలోప్రబలింది ప్రభుత్వ వర్గాలలోనూ ఇది వ్యక్తంకా సాగింది వియత్నాంలో అమెరికా దురాక్రమణను నోరారా ఖండించడానికైనా భారతప్రభుత్వం వెనకాడుతూ వచ్చింది.

ఈ విధమైన మితవాదమొగ్గ వ్యక్తమైనా స్థూలంగా అలీనవిధాన పరిధిలోనే భారతప్రభుత్వ వైదేశిక విధానం కొనసాగుతున్నది

ఇటీవల కాలంలో వెనుకటి కంటె, మరికొంచెం ఖచ్చితంగా, భారతప్రభుత్వం వియత్నాంలో అమెరికా దురాక్రమణను నిరసించ సాగింది,

ఉత్తరవియత్నాంలో అమెరికా విమానదాడులు వెన్వెంటనే బేషరతుగా నిలచిపోవాలనీ, అది జరగనిదే శాంతిసంభాషణల ప్రస్తావనే అర్థరహితమని విదేశాంగమంత్రి స్వరణ్‌సింగ్ పదేపదే ప్రకటిస్తున్నారు. జెనీవా మహాసభ జరిగి అందులో వియత్నాం సమస్యతో సంబంధమున్న అన్నిపక్షాలకు అనగా వియత్కాంగ్‌కునైతం ప్రాతినిధ్యం ఉండాలనికూడా సూచించారు

పై రెండు సూచనలు, ఇదివరకటి భారతప్రభుత్వ వైఖరి కంటే మెరుగైనవే కాగా అదేసమయంలో వియత్నాంలో అమెరికా దురాక్రమణయుద్ధాన్ని, వియత్కాంగ్ జరిపే విముక్తి పోరాటాన్ని ఒకే గాటన కట్టి రెండూ ఒకేసారి ఆగిపోవాలంటూ శ్రీ స్వరణ్‌సింగ్ సూచించటం మాత్రం పూర్తిగా అభ్యంతరకరం.

ఇట్టిపరిస్థితులలో టిటో, నాజర్, ఇందిరాగాంధీలు సమావేశమై ప్రపంచ పరిస్థితిని, అలీనరాజ్యాలు నిర్వర్తించవలసిన పాత్రను సమీక్షించనున్నారు.

సామ్రాజ్యవాద యుద్ధకూటములలో చేరక, స్వతంత్ర రాజ్యాలుగా ఉన్న దేశాలు అలీన రాజ్యాలుగా వ్యవహరించబడుతున్నాయి కాగా, సామ్రాజ్యవాద దురాక్రమణను వ్యతిరేకించటంలో, ప్రపంచ శాంతికి భంగకరమైన అమెరికా చర్యలను ఖండించటంలో, అలీన రాజ్యాలు, మధ్యేమార్గం పేరుతో, అరకొరగా ప్రవర్తించ రాదు.

సోవియట్ పార్టీ నాయకులతో సహా తూర్పు యూరప్ సోషలిస్టు దేశాలన్నీసమావేశమైవియత్నాంకు ఇతోధిక సహాయం అందజేసే విషయమై ప్రస్తుతం చర్చలు జరుపుతున్నారు. దాదాపు అదే సమయంలో సమావేశమౌతున్న అలీన రాజ్యత్రయ సభలో కూడా వియత్నాం ప్రధాన సమస్య కాగలదు

అటు సోషలిస్టు రాజ్యాలు, ఇటు అలీనరాజ్యాలు కలిసికట్టుగా, ఏకోన్ముఖంగా తమ దురాక్రమణ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాయని గుర్తించినపుడే, అమెరికా దురాక్రమణ విధానాలకు అవరోధం ఏర్పడగలదు. మనీలా సభలో జాన్సన్ తలపెడుతున్న యుద్ధ విస్తరణ పథకాలను భగ్నం చేయటానికి అదే మార్గం.

ఇట్టి సమైక్యత, నేడు మరొక కారణంవల్లకూడా అత్యవసరం.

సోషలిస్టు శిబిరానికిచెందిన ఒక పెద్ద దేశమైన చైనా, వియత్నాంకు సమైక్యంగా అందరూ తోడ్పడే కృషికి విఘాతం కలిగిస్తున్నది సోవియట్, తదితర సోషలిస్టు దేశాలపై అదే పనిగా వ్యతిరేక ప్రచారం చేస్తూ, పరోక్షంగా వియత్నాములో అమెరికా దురాక్రమణకు సాయపడుతున్నది. ఈ అనైక్యతను అవకాశంగా తీసుకొని అమెరికా తన దురాక్రమణ విధానాన్ని తీవ్రతరం చేయగలుగుతున్నది.

ప్రపంచ రాజకీయాలలో శాంతి శక్తులదే, యుద్ధోన్మాద శక్తులకంటే పై చేయిగా ఉండటం ఆధునిక యుగ లక్షణం. కాని చైనా విద్రోహ చర్య ఫలితంగా సోషలిస్టు శిబిరం బలహీనపడుతున్నది. శాంతి శక్తులలో చీలిక ఏర్పడుతున్నది ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని అమెరికా యుద్ధోన్మాద శక్తులు పెచ్చరిల్లుతున్నాయి యుద్ధ జ్వాలలు విస్తరింపచేస్తున్నారు.

అటు అమెరికా దురాక్రమణ ధోరణి, చైనా వేర్పాటు వైఖరి, ఇవే ప్రపంచ భవిష్యత్తును నిర్ణయించే శక్తులు కాప్ప కాజాలవు చిటచివరకు శాంతి శక్తులదే పైచేయి అయితీరుతుంది

కనుక చైనా కల్పిస్తున్న అవరోధాలను, చీలికను, పూడ్చుకొని, సోషలిస్టు రాజ్యాలు, అలీన రాజ్యాలు, కలిసికట్టుగా అమెరికా దురాక్రమణను ప్రతిఘటించినప్పుడే వియత్నాంలో అమెరికా దురాక్రమణ అంతంకాగలదు

ఇట్టి పరిణామానికి దోహదకరమైన చర్చలను, నిర్ణయాలను, అలీనరాజ్యత్రయసభ చేయగలదనే ఆశించుదాము.

ఐక్యఅరబ్ రిపబ్లిక్ అధినేత గామెల్ అబ్దుల్ నాజర్

నైల్ మహానది తటినలాల్లో రెండున్నర వేల సంవత్సరాలకు ముందే అభివృద్ధిచెందిన ప్రాచీన నాగరికత గలదేశం ఈజిప్టు. భారతీయ ఇతిహాసాల్లో మిత్రదేశంగా పేర్కొనబడింది. ఐతే రోమన్ సామ్రాజ్యనేతలు సీజర్, ఆంటోనీలు జయించిన తరువాత క్రమక్రమంగా వెనుకబడిన ప్రాచీనదేశాల్లో ఒకటిగా ఈజిప్టు మారిపోయింది.

పెట్టుబడిదారీ శకంగా చరిత్రకారులు పేర్కొంటున్న 19 వ శతాబ్దంలో ఫ్యూడల్ రాజుల పరిపాలన క్రిందవున్న ఈజిప్టును బ్రిటిష్ సామ్రాజ్యవాదులు తమ అధీన దేశంగా చేసుకున్నారు. భారత ప్రజలవలెనే ఈజిప్టు ప్రజలు కూడ బ్రిటిష్ దోపిడి ఫలితంగా నానాఅగచాట్లు పడ్డారు. పేదరికం, నిరక్షరాస్యత, నిరంకుశత్వానికిగురయ్యారు. బ్రిటిష్‌తొత్తుగా పనిచేసినవారిలో ఆఖరివాడైన ఫరూక్‌రాజు పాలకుడుగా వుండగా ఈజిప్టు రెండున్నరకోట్ల జనాభామాత్రమే కలిగిన చిన్న వలస దేశం మాత్రమే.

ఫరూక్ రాజును పదునాలుగేండ్ల క్రితం 1952 లో పదవీచ్యుతుణ్ణి చేసి ఈజిప్టు దేశ జాతీయ నాయకుడుగా, సమస్త అరబ్ ప్రజలకు మార్గదర్శిగా రూపొందిన గామెల్ అబ్దుల్ నాజర్ తన దేశానికి అత్యంత కీర్తిప్రతిష్ఠలు తెచ్చారు. ఆర్థికంగా వెనుకబడిన తమదేశాన్ని, ప్రజలను అభివృద్ధిచేయడంలో, పెట్టుబడిదారేతర పంథాలో ఆర్థిక పురోగమనాన్ని సాధించడంలోను సోషలిస్టు ఆర్థిక విధానంవైపు పురోగమించడంలో వలస దాసికత్వాన్నుండి విముక్తిచెందిన వర్ధమాన దేశాలన్నింటికీ ఆదర్శప్రాయుడయ్యాడు.

1956 లో సూయజ్ కాలువను జాతీయం చేసిన సందర్భంలో బ్రిటిష్, ఫ్రెంచి సామ్రాజ్యవాదులు ఇజ్రాయిల్‌తో కుమ్మక్కైదాడి చేసినపుడు, వీరోచితంగా ఎదుర్కొని సోవియట్ యూనియన్ తదితర సోషలిస్టు దేశాల మద్దతుతో దురాక్రమణ దాడులను పరాభూతులను చేయడంలో నాజర్ పేరు ప్రతిష్ఠలు వ్యాప్తి చెందాయి. ప్రపంచ రాజకీయవేత్తలలో ప్రముఖ స్థానాన్ని సంపాదించగలిగాడు.

నేటికి ఈజిప్టు మూడు కోట్లకు లోపు జనాభా కలిగిన చిన్నదేశమే. ఐనప్పటికీ అరబ్ దేశాలన్నిటికీ నాయకత్వం వహించుతోంది, ప్రపంచ అగ్రనాయకులలో ఒకరుగా నాజర్ పరిగణించబడుతున్నాడు.

జీవిత సంగ్రహం

దక్షిణ ఈజిప్టుకు చెందిన బెనిమోర్ అనే ఎడారి గ్రామంలో పోస్టాఫీసు గుమాస్తాకు పదిమంది బిడ్డలుకలిగారు. అందులో పెద్దవాడు నాజర్ 1918లో జన్మించాడు. "విజయోపేతుడైన దేవుని దాసుడు" అని అర్థం వచ్చేలా పోస్టాఫీసు గుమాస్తా తన కుమారునికి నామకరణం చేశాడు.

సైన్యంలోచేరి, నాజర్ జాతీయాభిమానంగల యువకోద్యోగులను రహస్యంగా సంఘటిత పరచాడు. అవినీతికి, నిరంకుశత్వానికి ఆలవాలమైన ఫరూక్ రాజు పరిపాలనకు వ్యతిరేకంగా, ఇజ్రాయిల్‌తో యుద్ధంలో ఓటమి అనంతరం, నాజర్ తిరుగుబాటు లేవదీశాడు. తనకు చేదోడుగా వున్న యువక సైనికోద్యోగులతో విప్లవ కౌన్సిల్ ఏర్పరచాడు. ఫరూక్ రాజును దేశాన్నుంచి పారద్రోలి జనరల్ నజీబ్ ఆధ్వర్యాన నూతన ప్రభుత్వాన్ని స్థాపించారు. కాని తదనంతరం ఆంగ్లో అమెరికన్ సామ్రాజ్యవాదుల తంపులకు ఒత్తిడికి జనరల్ నజీబ్ తలవొంచడంతో విప్లవ కౌన్సిల్ అతడిని తొలగించి, నాజర్‌నే రాజ్యాధినేతగా ప్రకటించింది,

నాటినుండి ఈజిప్టు ప్రభుత్వం ఖచ్చితమైన సామ్రాజ్య వ్యతిరేక పంథాను అనుసరించుతూ వచ్చింది, సూయజ్ కాలువను జాతీయం చేయడంతో పాటు ఆంగ్లో-ఫ్రెంచి దురాక్రమణను త్రిప్పికొట్టడంలో దానికీర్తి ఇనుమడించింది,

స్వతంత్ర, లౌకికరాజ్యాంగాన్ని ఏర్పరచుకున్నది, సోవియట్ యూనియన్ సాంకేతిక, ఆర్థిక సాయంతో నైలునదిపై బ్రహ్మాండమైన అశ్వాన్‌డామ్ నిర్మాణానికి పూనుకొని మొదటిదశను పూర్తిచేసింది. ఇది పూర్తయితే లక్షలకొలదీ ఎకరాలభూమికి నీరు అందడమేగాక, విద్యుచ్ఛక్తి సరఫరా రెండు రెట్లు పెరుగుతుంది.

అరబ్ దేశాలన్నిటిలో వలే ముస్లిం ఛాందసులు నాజర్ అధికారానికి రాగానే స్త్రీలకు పరదాను ఏర్పరచాలని, సినిమాలు, నాటకాలను నిషేధించాలని, మతరాజ్యాన్ని ఏర్పరచాలని. చచ్చిపోయిన ఫ్యూడల్ అవశేషాలన్నిటినీ కాపాడాలనీ ప్రయత్నించారు. ఆధునిక ప్రపంచంలో వాటికి తావులేదని నాజర్ గ్రహించి. మహిళలకు పౌరహక్కులిచ్చి, విద్యావిజ్ఞానాలకు అవకాశాలు కలిగించారు,

భూసంస్కరణలను ప్రవేశపెట్టి వంద ఎకరాలకు మించిన కమతమేదీ వుండరాదని నిషేధించి ఖచ్చితంగా అమలుజరిపారు. గతంలో రాజు అధీనంలోవున్న వేలకొలదీ ఎకరాల భూములను, బంజర్లను స్వంతభూమిలేని రైతాంగానికి పంచారు, తద్వారా వేలాదియేండ్లుగా సాగుతున్న దాసికత్వానికి స్వస్తి చెప్పారు.

దీనితో కినుకచెందిన మతమరహంకారుల సంస్థ "ముస్లిం బ్రదర్‌హుడ్" కుట్రపన్ని నాజర్‌ను చంపడానికి ప్రయత్నాలు చేసింది. ఆ పన్నీ విఫలమయ్యాయి. ఆ సంస్థను ప్రభుత్వం నిషేధించి, నేరస్థులకు మరణశిక్ష విధించింది.

నాజర్ తనను వ్యక్తిగతంగా మతవిశ్వాసముందని అంగీకరించుతాడు. కాని మతం పేరుతో చెలామణీవుతున్న మూఢ విశ్వాసాలకు, ఆడంబరాలకు వ్యతిరేకినని అనేకసార్లు స్పష్టపరచాడు, రాజ్యాంగాన్ని మతరాజ్యంగా చేసేందుకు నిరాకరించి, లౌకిక రాజ్యాంగా రూపొందించారు.

సైప్రస్ జాతీయ విముక్తి విప్లవపోరాటం సాగుతున్న రోజుల్లో క్రిస్టియన్లు ఐనప్పటికీ స్వాతంత్ర్యయోధులనే నాజర్ బలపరచారు, సామ్రాజ్యవాదులకు తాబేదార్లుగా వ్యవహరించిన టర్కీల వ్యూహాన్ని వ్యతిరేకించారు.

అలాగే భారత - పాకిస్తాన్ యుద్ధ సమయంలో నాజర్ నిజాయితీ మరొకసారి అగ్ని పరీక్షకు గురయింది. సామ్రాజ్యవాదుల తాబేదార్లగా వ్యవహరించే పాక్ నాయకులరాజకీయాలు నాజర్ వ్యతిరేకించారు. తద్వారా నాజర్ తన మత విశ్వాసాలు అంతరాత్మకు సంబంధించినవే నని, లౌకికంగా నిజాయితీని బలపరచే అభ్యుదయగామి అని నిరూపించుకున్నారు.

అధికారంలోకి రాగానే అన్ని రాజకీయ పార్టీలను నిషేధించినందున నాజర్‌ను, విప్లవ కౌన్సిల్‌ను కూడ మిలిటరీ నియంతగా - కమ్యూనిస్టులతో సహా-అనుమానించిన వారు అనేకమంది వున్నారు. ఆ దేశంలోని కమ్యూనిస్టులు కూడా ప్రారంభంలో ఈ చర్యలను వ్యతిరేకించారు. నాజర్ ప్రభుత్వం వారిని అరెస్టుచేసి జైళ్ళలో నిర్బంధించింది. కాని కాలక్రమేణ విప్లవ కౌన్సిల్ యొక్క నాజర్ యొక్క ఖచ్చితమైన సామ్రాజ్య వ్యతిరేకత నిరూపితమయింది.

ప్రస్తుతం యునైటెడ్ అరబ్ రాజ్యాంగానికి అధ్యక్షులుగా నాజర్ వుంటున్నారు. ఆయన నాయకత్వంలో ఈజిప్టు ఆర్థికంగా యెంతో పురోగమించింది.

ఆ దేశంలో ప్రస్తుతం భారీ ఉత్పత్తి సాధనాలన్నీ యావత్తు జాతీయ సంపదగా ప్రభుత్వంచే నిర్వహించబడుతున్నాయి, భూకమతాలకు 100 ఎకరాల సీలింగు వున్నట్లుగానే జాతీయం చేయబడిన సంస్థలలో వ్యక్తులకుండే వాటాలకు సైతం పరిమితులున్నాయి. ఎగుమతి దిగుమతి వ్యాపారమంతా ప్రభుత్వాధీనంలో వుంది.

రవాణా సౌకర్యాలు, సినిమాలు, హోటళ్లు ట్రావెలింగ్ ఏజెన్సీలు. టోకు వ్యాపారం ప్రభుత్వంచే కంట్రోలు చేయబడుతున్నవి. వార్తాపత్రికలన్నీ అరబ్ సోషలిస్టు యూనియన్ అధ్వర్యంలో నడుపబడుతున్నాయి.

అరబ్ సోషలిస్టు యూనియన్ ఒకటే ప్రస్తుతం ఈజిప్టులో వున్న ఒకేఒక రాజకీయ సంస్థ. సోషలిజం ఆశయాలను, ఆసంస్థ నిబంధనావళిని, అంగీకరించే వారందరూ అరబ్ సోషలిస్టు యూనియన్‌లో సభ్యులుగా చేరవచ్చు.

సోవియట్ యూనియన్, తదితర సోషలిస్టు దేశాల సహకారంతో ఈ పదునాలుగు సంవత్సరాలలో ఈజిప్టుదేశం పారిశ్రామికంగా ఎంతో ముందంజ వేసింది. నౌకా నిర్మాణ పరిశ్రమకు, విమాన నిర్మాణానికి పునాదు లేర్పడ్డాయి. మోటార్‌కార్లు చౌకగా తయారౌతున్నాయి. టెలివిజన్‌సెట్లు, రేడియోలు సామాన్య కుటుంబాలకు అందుబాటులో వున్నాయి.

ఇప్పటికీ పారిశ్రామిక దేశాలతో పోల్చితే ఈజిప్టు వెనుకబడిన దేశమేఐనప్పటికీ భారత దేశంతో పోల్చితే అభివృద్ధి రేటు చాల హెచ్చుగా వుంది. సగటు పౌరులకు లభ్యమయ్యే సౌకర్యాలు భారతదేశంలో కంటే ఈజిప్టులో చాల హెచ్చుగా వున్నాయి.

ఈజిప్టు - భారతదేశాలు రెండూ అలీన విదేశాంగ విధానాన్నే ప్రధానంగా అనుసరించుతున్నాయి. కాని ఖచ్చితమైన సామ్రాజ్య వ్యతిరేక పంథాను అనుసరించుతూ, పెట్టుబడిదారేతర ఆర్థిక విధానం అనుసరించుచూ సోషలిస్టు దేశాల సహకారంతో ఈజిప్టు పురోగమించుతోంది.

భారతదేశంకూడ అలీనవిధానమే అనుసరించుతున్నా, అనేక సందర్భాలలో సామ్రాజ్యవాదుల ఒత్తిడికి లొంగుతూ, పెట్టుబడిదారీ ఆర్థిక విధానాన్నే కొనసాగించుతూంది. అందుచేత పారిశ్రామికీకరణలో సోషలిస్టుదేశాల సహకారం తీసుకుంటున్నప్పటికీ పెరుగుతున్న జాతీయ సంపదలో న్యాయమైనభాగం ప్రజానీకానికి అందడంలేదు. కొలదిమంది గుత్త పెట్టుబడిదారులు విపరీత లాభాలు గడించుతున్నారు.

అక్టోబరు 21 వ తేదీన ప్రారంభం కాబోతున్న అలీనరాజ్యాధినేతలసమావేశానికిఅధ్యక్షులునాజర్, యుగోస్లావియాఅధ్యక్షులుటిటోలు వస్తున్నారు, భారతప్రధాని ఇందిరా గాంధీతో సంప్రదింపులు జరుపుతారు. విదేశాంగ విధానంతోపాటు ఆయా దేశాలలో జరుగుతున్న ఆర్థిక పునర్నిర్మాణ కార్యకలాపాలలో పరస్పరానుభవాలను ఈ సభలో కూడ చర్చించుకుంటే భారత దేశానికి ఎంతో ఉపయుక్తంగా వుంటుంది.

నానాటికీ దిగజారుతూన్న ప్రభుత్వ పారిశ్రామిక విధానం

కీలకపరిశ్రమలు విదేశీ గుత్తపెట్టుబడిదార్లకు దఖలు పడుతున్నస్థితి

1956 నాటి భారత పారిశ్రామిక విధానప్రకటనపరిశ్రమల్ని కొన్ని షెడ్యూళ్ళ (జాబితాల క్రింద) విడదీసి, బి షెడ్యూల్ క్రిందకి వచ్చే పరిశ్రమల రంగంలో ప్రభుత్వమే చొరవ దీసుకోవాలనీ, ఆ రంగంలో కొత్త పరిశ్రమల్ని స్థాపించే దాధ్యత స్వీకరించాలని నిర్దేశించడం జరిగింది,

ప్రయివేటు రంగంపట్ల దేశ, విదేశ గుత్త పెట్టుబడులపట్ల అభిమానం కలిగిన పాలకులు యీ విధానానికి అడుగడుగునా తూట్లు పొడుస్తూనేవున్నారు.

ప్రైవేటు రంగానికి దఖలు

* మొదటి అల్యూమినం పరిశ్రమ. 1958 మార్చిలోనే భారత ప్రభుత్వం ఒక ప్రయివేటు కంపెనీకి. కేరళలో అల్యూమినం పరిశ్రమ స్థాపనకు లైసెన్సు యిచ్చింది, అయితే ఆ పరిశ్రమ యేర్పడలేదు. తిరిగి అక్టోబర్‌లో బిర్లాలకు రేణుకూట్ సమీపంలో మరో అల్యూమినం ఫ్యాక్టరీ నిర్మించేందుకు అనుమతి లభించింది. అమెరికాకు చెందిన కైసర్స్ కంపెనీ భాగస్వామ్యంతో బిర్లాలు యీ పరిశ్రమ స్థాపన తలపెట్టారు.

కెనడాకు చెందిన అల్యూమినం కంపెనీ అనే ఒక గుత్త సంస్థకు అనుబంధంగావున్న ఇండియన్ అల్యూమినం కార్పొరేషన్‌కు భవిష్యత్తులో ఉత్పత్తి పెంచేందుకు మరో దీర్ఘకాలిక లైసెన్సు లభించింది,

తెండూల్కర్ ఇండస్ట్రీస్ అనే ఒక పారిశ్రామిక సంస్థను కోయనాలో నూ, జె. కె. ఇండస్ట్రీస్ అనే మరో సంస్థకు మధ్యప్రదేశ్‌లోని అన్నూపూర్ వద్ద అల్యూమినం పరిశ్రమలు స్థాపించేందుకు లైసెన్సు లిచ్చారు. అమెరికన్ భాగస్వామ్యంతో పనిచేస్తున్న భరత్ రెనాల్డ్స్ అల్యూమినం కంపెనీకికూడా ఇలాంటి లైసెన్సులే లభించాయి,

యాతావాతా యావత్తు అల్యూమినం పరిశ్రమ ప్రయివేటు రంగానికి దత్తమైంది, మధ్యప్రదేశ్‌లోని కోర్బావద్దప్రభుత్వరంగంలో స్థాపించాలనుకున్న ఫ్యాక్టరీమాత్రం యీనాటికీ యేర్పడనేలేదు.

* యంత్ర పరికరాల పరిశ్రమ విషయంలో యీ దిగజారుడు 1956 నుండీ కొనసాగుతూనేవుంది, భాకర్ కమిటీ సిఫారసు మేరకు కొత్తగా వుత్పత్తి చేయ తలపెట్టిన ఆయిరకాల యంత్రాల్లో మూడు ప్రయివేటు రంగానికే దఖలుపడ్డవి.

మూడో ప్రణాళికలో గూడా యీ రంగంలో సగంవాటా ప్రయివేటు రంగానికే కట్టబెట్టారు. మూడో ప్రణాళికలో యంత్ర పరికరాల వుత్పత్తి లక్ష్యం మొత్తం 30 కోట్ల రూపాయల్లో సగం మాత్రమే ప్రభుత్వరంగానికి దక్కింది.

ఎరువుల రంగంలో కుంభకోణం

* ఎరువుల రంగంలో జరిగిన కుంభకోణం అంతా ఎరిగిందే. తిండిగింజల కొరత, అధికాహారోత్పత్తి ఆవశ్యకత అనే సాకులు లభించకముందే ఈ రంగంలో దిగజారుడు ఆరంభమైంది.

ఎరువుల పరిశ్రమ గురించి, భవిష్యత్తులో మన అవసరాల గురించి దర్యాప్తు చేసేటందుకు 1959 లో ప్రభుత్వం జి. పి. కానే అనే ఆయన అధ్యక్షతన ఒక కమిషన్‌ను నియమించింది.

1960 లో అప్పటి వాణిజ్యమంత్రి శ్రీ సతీశ్‌చంద్ర యీ రంగంలోకి ప్రవేశించండంటూ, అమెరికన్ ఎరువుల పరిశ్రమదారులకు బాహాటంగానే ఆహ్వానం అందజేశాడు. 1962 నాటికి దేశంలోవున్న ఎరువుల పరిశ్రమ వుత్పత్తిశక్తికీ, మూడో ప్రణాళికలో పెట్టుకున్న లక్ష్యానికీ మధ్య యేర్పడే వ్యత్యాసాన్ని పూడ్చవలసింది వారేనని ఆయన దేవురించారు.

గత రెండు సంవత్సరాల్లో యీరంగంలో పరిణామాలు మరింత నాటకీయ ఫక్కీలో జరిగాయి, అమెరికా, మరి యితరదేశాల గుత్త పరిశ్రమాధిపతులను యీ రంగంలోకి ఆకర్షించేందుకు అనేక రాయితీ లిచ్చారు,

ధరల నిర్ణయానికి సంబంధించిన నిబంధనలను మార్చివేశారు, భాగస్వామ్యం విషయంలో వాటానిష్పత్తి రూల్సునుకూడా ఎత్తివేశారు; మార్కెట్ హామీలు కల్పించారు,

అయినా ఆ విదేశ ఎరువుల ప్రభువులు ప్రసన్నులు కాలేదు, విధిలేక కొచ్చిన్ లోనూ, దుర్గాపూర్‌లోనూ ప్రభుత్వ రంగంలోనే రెండు పరిశ్రమలు పెట్టడానికి ప్రభుత్వం నిశ్చయించింది.

యాతావాతా నేటికి ప్రయివేటు రంగానికే యీ పరిశ్రమలో పైచేయి అయింది ఆ రంగానికి 9,43750 టన్నుల మేరకు ఉత్పత్తి లైసెన్సులు లభించాయి దుర్గాపూర్, కొచ్చిన్ ఫ్యాక్టరీలనుకూడా కలుపుకుంచే ప్రభుత్వ రంగానికి దక్కింది, 6,92,000 టన్నులు మాత్రం

మిశ్రమ లోహం

* మిశ్రమలోహాలు, యంత్ర పనిముట్లకు పనికివచ్చే ఉక్కు వీటి విషయంలో ప్రభుత్వ విధానం క్షణ క్షణమూ మారుతూ వుంది, వీటి విషయంలో ప్రభుత్వానికి అసలు విధానమంటూ వుందా అనే అనుమానం కలుగుతూవుంది.

మూడో ప్రణాళిక ముసాయిదా వెలువడే నాటికి యీ పరిశ్రమలో ప్రయివేటురంగానికి కేటాయించింది. కై వంతు తీరా ప్రణాళిక సిద్ధమయ్యేనాటికే నూటికి 50 వంతులకు పెరిగింది.

ఇదీ సమగ్రమైన అంచనాకాదు. అప్పటికి యీ పరిశ్రమ కిచ్చిన లైసెన్సుల మొత్తం 261,000 టన్నుల్లో 160,000 టన్నులవాటా ప్రయివేటు రంగానికి లభించింది.

మిశ్రమ లోహాల పరిశ్రమ స్థాపనకోసం టాటా కంపెనీకి మొదట ఒక భారీ లైసెన్సు యిచ్చారు. ఐదేండ్లయినా ఆ పరిశ్రమకు అలీమాలూ లేకపోయింది. కాగా ఆ లైసెన్సును రద్దు చేశారు. ఇప్పుడు ప్రభుత్వ రంగంలోని భద్రావతి పరిశ్రమ విస్తరణకు స్వస్తి చెప్పి, బిర్లాల లైసెన్సును పునరుద్ధరించారు.

రసాయనిక పరిశ్రమ

1956లో సోవియట్ సాయంతో, ప్రభుత్వ రంగంలోనే సమగ్రమైన ఔషధ పరిశ్రమను యేర్పాటు చేయడానికి ప్రభుత్వం సంకల్పించింది ఒక లక్షటన్నుల రసాయనాలను తయారుచేసే ఫ్యాక్టరీ నిర్మిదామనుకున్నారు. అది జరిగివుంటే యీ పరిశ్రమ ప్రగతికి ఎంతో దోహదమై వుండేది.

దేశీయ ప్రయివేటు రంగం అధిపతులూ, విదేశ గుత్తపెట్టుబడుల వారూ యీ పథకాన్ని ఆదినుండే గట్టిగా ప్రతిఘటించారు, వీరిప్రతిఘటనకు ప్రభుత్వం తలవంచి, 1958 లో సోవియట్ నిపుణుల అధ్యయన బృందం రెండవసారి మనదేశానికి వచ్చేసరికి ఆ బృందం పరిశీలనాంశాలను బాగా కుదించివేసి, యీ లక్షటన్నుల రసాయన పరిశ్రమ ప్రాజెక్టుకు స్వస్తి చెప్పేసింది.

పశ్చిమ జర్మనీ సహాయంతో పాన్వెల్ అనే చోట యేర్పాటు చేయాలనుకున్న మరో కొత్త పథకాన్ని కూడా ప్రభుత్వం వదిలివేసింది

మౌలిక రసాయనాల పరిశ్రమ రంగాన్ని మొత్తంగా ఇంపీరియల్ కెమికల్స్ యిండస్ట్రీస్ అనే విదేశ బడా గుత్తాధిపత్య సంస్థకూ, దేశీయ ప్రయివేటు రంగానికీ అప్పజెప్పేశారు.

యాంటిబయొటిక్స్, (క్రిమి సంహారక) ఔషధాలు, మందుల పరిశ్రమ విషయంలోను యిలానే జరిగింది

సోవియట్ సాయంతో రిషికేశ్‌లో నిర్మిస్తున్న యాంటిబయాటిక్ ఔషధాల ఫాక్టరీ ఉత్పత్తి లక్ష్యాన్ని పాశ్చాత్య ఔషధకంపెనీల మెప్పుకోసం కుదించివేశారు. సింథెటిక్ డ్రగ్స్ (మిశ్రమ ఔషధాలు) కర్మాగారం ఉత్పత్తి లక్ష్యాన్ని నాలుగోవంతుకు తగ్గించారు. ఫైటో కెమికల్స్ (సముద్ర గర్భంలో వుండే మొక్కల నుండి రసాయనాలు తయారుచేసే పరిశ్రమ) పరిశ్రమకు సమూలంగానే స్వస్తిచెప్పారు.

ఔషధ పరిశ్రమ యావత్తు మెర్క్స్. డోమ్. జాన్సన్ అండ్ జాన్సన్. మే అండ్ బేకర్. బూట్స్ ప్యూర్ డ్రగ్స్. గ్లాక్సో బ్రిటిష్ డ్రగ్ హౌసెస్. ఫైజర్స్ సైనామిడ్ మొదలయిన విదేశీ గుత్తకంపెనీలకు వాటి భారతీయ భాగస్వామ్య కంపెనీలకు అప్పగింత పెట్టబడింది.

* సింథెటిక్ రబ్బరు పరిశ్రమ విషయంలో ప్రభుత్వం మరింత ఘోరంగా ప్రవర్తించింది. ఈ రంగంలో ప్రభుత్వానికి ఒక్క ఫ్యాక్టరీకూడా లేదు. అంతా ప్రయివేటు రంగానికి స్వంతజాగీరే. ఇందులోకి ప్రవేశించాలనే యోచన ప్రభుత్వానికి యీషణ్మాత్రంకూడా లేదు.

* రోడ్డురవాణా జాతీయకరణ సూత్రాన్ని ప్రభుత్వం మొట్టమొదట 1951 లో ఆమోదించింది. మొదటి ప్రణాళికా కాలంలో యిందుకు అనుగుణంగా కొన్ని చర్యలు తీసుకున్నది. అయితే, పాలక పార్టీకి డబ్బులిచ్చే ఆసాములంతా ప్రధానంగా యీ పరిశ్రమకు చెందినవారే. వారి వత్తిడిఫలితంగానే రెండో ప్రణాళికా కాలంలో ఈ పరిశ్రమ జాతీయకరణ నిలిచిపోయింది.

1958 లో అసలుకే మోసం వచ్చింది, రోడ్డు రవాణా జాతీయకరణ సూత్రాన్నే వదులుకోవడం జరిగింది. మూడో ప్రణాళిక యీకొత్త విధానానికి ఆమోదముద్రయిచ్చింది. రవాణా పరిశ్రమలో ప్రభుత్వ రంగం వాటాపై 30 శాతం మేరకు పరిమితి విధింపు చేశారు.

ఇదైనా ప్రయాణీకుల సర్వీసు విషయంలో. సరకు రవాణా పెద్దభాగం ప్రయివేటురంగం చేతిలోనే వుంది

* ప్రభుత్వ జాతీయ షిప్పింగ్‌బోర్డుఅంటూ యేర్పాటు చేసింది, నౌకా రవాణా పరిశ్రమలోకి ప్రభుత్వ రంగాన్ని విస్తరించడం యూద్దేశం కానేకాదనీ, ప్రయివేటు సంస్థలకు తోడ్పాటుయిచ్చే కోసమేయిది అనీ ప్రభుత్వం ముందే ప్రకటించింది. అంతర్జాతీయ నౌకా వ్యాపారంలో విదేశ పెట్టుబళ్ళ పెత్తనాన్ని తొలగించే యోచనైనా ప్రభుత్వానికి లేదు.

అంతేకాదు జయంతిషిప్పింగ్‌కంపెనీలాంటి వనాకోసు నౌకా కంపెనీలకు ఓడలు కొనేటందుకు ప్రభుత్వం డబ్బిస్తున్నది ఆకంపెనీ కిచ్చిన రు 20 కోట్ల డబ్బుతో ప్రభుత్వం తానే స్వయంగా యీ రంగంలోకి ప్రవేశించి వుండగలిగేది.

ప్రభుత్వ పారిశ్రామిక విధానంలోవస్తున్న యీ దిగజారుడు భారతదేశంలో బ్రిటిష్ పెట్టుబడివారి 'కాపిటల్' లాంటి పత్రికలు హర్షించడంలోనూ ప్రభుత్వవిధానం ప్రయివేటురంగానికి ఎంతో ప్రోత్సాహం కల్గిస్తున్నదని కేంద్ర ఆర్థికమంత్రి చెప్పుకోవడంలోనూ ఆశ్చర్యమేమీలేదు

"న్యూ ఏజ్" (అక్టోబరు 16, 1966)

వైస్ ఛాన్సులర్ల సమావేశ నిర్ణయాలు

న్యూఢిల్లీ, అక్టోబరు 18

విద్యార్థులసంక్షేమం, క్రమశిక్షణ. అందుకు సంబంధించిన యితర విషయాల్లో విద్యార్థి ప్రతినిధులు పాల్గొనాలనీ, అందుకుగాను విద్యా సంఘం సిఫారసు చేసినట్లుగావిద్యార్థి ప్రతినిధులతో ఒక సమావేశం జరపాలనీ, ఇక్కడ జరిగిన వైస్ ఛాన్సలర్ల సమావేశం సిఫారసు చేసింది.

విశ్వవిద్యాలయ, కళాశాల ఉపాధ్యాయుల వేతనాల హెచ్చింపు పథకాన్ని ప్రభుత్వం యిదివరకే అంగీకరించిందనీ, దాన్ని ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా అమలు జరపాలనీ తెలియజేసింది,

జాతీయకర్తవ్యాన్ని గుర్తింపజేసేందుకు తీసుకునే చర్యలకు ఉన్నతమైన ప్రాధాన్యత యివ్వాలి. ఈసందర్భంగా పాఠ్యాంశాలలో సాంఘికసేవ, అనుభవానికి సంబంధించిన పనులను ప్రవేశపెట్టి, దేశంలోని యథార్థ జీవిత పరిస్థితులతోను, సమస్యలతోను విద్యకు మరింత సన్నిహిత సంబంధం కల్పించాలి.

విద్యార్థుల సంక్షేమాన్ని పెంపొందింపజేయడానికి వారినిజమైన అవసరాలను పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకోడానికి వీలుగా విశ్వవిద్యాలయ కమిషన్‌కు తగినన్ని నిధులు సమకూర్చవలసిందిగా ప్రభుత్వాన్ని కమిషన్ కోరాలని సమావేశం విజ్ఞప్తిచేసింది.

విద్యార్థుల అవసరాలను, కష్టాలను సానుభూతితోను, జాగ్రత్తగాను పరిశీలించడానికి ఒక యంత్రాంగాన్ని వెంటనే నియమించాలని మూడురోజులుగా జరుగుతున్న విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ల, విద్యావేత్తల సమావేశం నేడిక్కడ సిఫారసుచేసింది.

కొన్నిచోట్లప్రాణనష్టానికి, ఆస్తినష్టానికి, హింసకు దారితీసిన, విద్యార్థులలో వ్యాపించి ఉన్న అసంతృప్తిపైన విశ్వవిద్యాలయాల గ్రాంట్సు కమిషన్ ఏర్పరచిన ఆ సమావేశం వివిధ దృక్కోణాలనుండి దాపరికంలేకుండా చర్చించింది, విద్యావంతులలో ఒక భాగమైన కళాశాల విద్యార్థులు యిటువంటి ఘటనలలో పాల్గొనడం విచారకరమని కూడా ఆ సమావేశం తెలియజేసింది.

దేశంలోని 63 మంది వైస్ ఛాన్సలర్లలోను 22 మంది యీ సమావేశంలో పాల్గొన్నారు భారత ప్రధాని, హోంమంత్రి, విద్యామంత్రి. ప్రణాళికా సంఘంలోని విద్యావ్యవహారాలకు సంబంధించిన సభ్యులు కూడా యీ సమావేశంలో ప్రసంగించారు,

విద్యార్థుల నిజమైన అవసరాలను, కష్టాలను జాగ్రత్తగాను, సానుభూతితోను పరిశీలించాలనీ, అందుకు విశ్వవిద్యాలయాల, కళాశాలల ఆధ్వర్యాన ఒక యంత్రాంగాన్ని నియమించాలనీ, అధికారులు తరుచు విద్యార్థులతో వారి అవసరాలను గురించి చర్చించి, సాధ్యమైనంతవరకు వాటిని వెంటనే పరిష్కరించడానికి పూనుకోవాలనీ విశ్వవిద్యాలయ గ్రాంట్సు కమిషన్ అధ్యక్షుడు డా॥ డి.యస్. కొఠారి తెలియజేశారు,

ఈ సందర్భంలో విద్యా సంఘంచేసిన సిఫార్సులు ఉపయోగకరంగా వుంటాయని ఆయన చెప్పారు, సంప్రతింపుల యంత్రాంగం చేసిన కృషిని, వారి అనుభవాన్ని ఆధారంచేసుకుని ఒక సంవత్సరం తర్వాత సమీక్షించి, అవసరమైన మార్పులు ప్రవేశపెట్టాలని అన్నారు, అందుకు వెంటనే ప్రారంభం జరగాలని సమావేశం తెలియజేసింది.

నిజాయితీ ప్రదర్శించాలి.

ఉద్యోగుల నియామకం, ఎన్నికలు, పరీక్షలు, కళాశాలల అనుబంధ విషయాల్లో విశ్వవిద్యాలయాలు అత్యంత నిజాయితీతో వ్యవహరించాలనీ, అందువల్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజల్లో విశ్వాసం ఏర్పడుతుందని మహాసభ తెలియజేసింది. విద్యార్థులను చేర్చుకొనేటప్పుడు వారి తెలివి తేటలపైనే ఆధారపడాలి కాని, ఎట్టి పరిస్థితుల్లోను కులం, ప్రాంతీయతత్వం వగైరాలపై ఆధారపడరాదని తెలియజేసింది.

విద్యార్థులను చేర్చుకోవడం, ఉద్యోగుల నియామకాల విషయం విశ్వవిద్యాలయాలకే పూర్తిగా విడిచిపెట్టాలనీ, బయటినుండి వాటి విషయంలో కలుగజేసుకోరాదనీ తెలియజేసింది.

విద్యాసంస్థల్లో పరిస్థితుల అభివృద్ధికి ఈ క్రింది అత్యవసర చర్యలు తీసుకోవాలని సమావేశం సిఫారసు చేసింది.

విశ్వవిద్యాలయాల్లోను, కళాశాలలోను డీన్లను నియమించి, సమాలోచనలు జరపడానికి. సూచనలు యివ్వడానికి అవకాశాలు కల్పించాలి. సమాచార ఉద్యోగ బ్యూరోలను పునర్వ్యవస్థీకరణ సంస్థలను ఏర్పాటు చెయ్యాలి.

లైబ్రరీలను విస్తృతపరచి, చదువుకోడానికి సీట్లను పెంచాలి. పగటిపూట విద్యా కేంద్రాలు ఏర్పరచాలి, హాస్టళ్ళు పెంచాలి. విద్యార్థులకు వైద్య సదుపాయాలు. క్రీడా సౌకర్యాలు కలిగించాలి. పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చెయ్యాలి. విద్యార్థుల జీవన పరిస్థితులను, పని పరిస్థితులను మెరుగుపరచేందుకు, తీరిక సమయాల్లో వారికి మంచి ఉద్యోగ పరిస్థితులు కల్పించడానికి యితర చర్యలు తీసుకోవాలి.

విశ్వవిద్యాలయాల ఆవరణలో శాంతియుత పరిస్థితులను కాపాడానికి ప్రాక్టోరల్ వ్యవస్థను పటిష్ఠం చెయ్యాలి. ఆ వ్యవస్థలో [illegible]గే సంప్రతింపుల్లో విద్యార్థులకు ప్రాతినిధ్యం యివ్వాలి.

విద్యావేత్తలకు, పోలీసులకు మధ్య స్నేహసంబంధాల అభివృద్ధికి, పోలీసులకు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మధ్య సహకారం, మామూలు జీవితం కొనసాగడానికి, సాంఘిక వ్యతిరేక చర్యల నిర్మూలనకు, అవినీతి చర్యల నిర్మూలనకు తోడ్పడగలదని సిఫారసు చేసింది.

అనుమతి పైనే విశ్వవిద్యాలయాల్లో పోలీసులు ప్రవేశించాలి

ఏదైనా తీవ్రపరిస్థితిలో పోలీసులు విశ్వవిద్యాలయ ఆవరణలోకి రావలసివస్తే, విద్యాధికార్ల అంగీకారంపైనే రావాలనీ, పరిస్థితుల తీవ్రతను వారు బాగా అర్థంచేసుకోగలరనీ అభిప్రాయపడింది.

నేడు యువకుల్లో జాతీయ భావాలు లోపించినందుకు విచారం వ్యక్తంచేస్తూ, విదేశాలకు వెళ్ళే విద్యార్థులకు భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలపై తరగతులు పెట్టాలని ప్రధాని ఇందిరా గాంధీ చెప్పారు. విద్యార్థులకు మంచి అవకాశాలు, ఉపాధ్యాయులకుఎక్కువ వేతనాలు వగైరా సమస్యల పరిష్కారానికి దీర్ఘకాలం పడుతుందని ఆమె చెప్పారు.

విద్యార్థుల్ని రాజకీయ పార్టీలు తమ రాజకీయప్రయోజనాలకోసంవినియోగించుకోరాదని సమావేశం విజ్ఞప్తి చేసింది.

జాతీయాభివృద్ధికి, సంక్షేమానికి, భద్రతకు విద్యాసంస్థలు సక్రమంగా పనిచెయ్యాలని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేసింది.

సమావేశంలో వివిధ సమస్యలపై వైస్ ఛాన్సలర్లు విభిన్న దృక్పథాలు ప్రకటించడం వల్ల సమావేశం విఫలమైపోతూందని ఒక దశలో భావించబడినట్లు కూడా తెలుస్తోంది.

ఈడుపుగల్లులో ట్రాక్టరు డ్రైవరుపై హత్యాప్రయత్నం

కంకిపాడు, అక్టోబరు 18

ఆరేపల్లి తాతారావు అనే ట్రాక్టరు డ్రైవరుపై ఈ నెల 15 వ తేదీన ఈడుపుగల్లులో హత్యాప్రయత్నంజరిగింది. ప్రస్తుతం ఆ వ్యక్తి విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు

15-10-66 రాత్రి సుమారు 11½ గంటలకు సదరు తాతారావు కంకిపాడు సినిమా హాలులో సినిమా చూస్తూవుండగా, వీరమాచినేని సుబ్బారావు, రఘురామయ్యగార్లు హాలు బయట నిలుచుని లోనికి కబురంపి, తాతారావును బయటకు పిలిపించి, రిక్షా ఎక్కించుకొని, ఈడుపుగల్లు తీసుకువెళ్ళారు.

అక్కడ తమ మిల్లులోపెట్టి తాళంవేసి తెల్లవారుఝామున 4 గంటలకు పూరికి 5,6 ఫర్లాంగుల దూరంలో వున్న తమ పొలంలోని కరెంటు షెడ్ వద్దకు తీసుకుపోయి, ఆ పగలంతా అక్కడ హింసించారు. 16-10-66 రాత్రి 11 గంటల వేళ షెడ్ నుండి బయటకు తీసి, క్రూరంగా హింసించి, వీరమాచనేని సుబ్బారావుతమ్ముడు వీరభద్రరావు, సూర్యదేవర కోటేశ్వరరావు గార్ల సహాయంతో చేతులు విరగకట్టి రైవస్‌కాల్వవద్దకు తీసుకుపోయి, తిరిగి అక్కడ విపరీతంగా కర్రలతో బాది, పదమతో, మోకాళ్ళతో పొడిచి, కాళ్ళు, చేతులు కట్టి కాల్వలో పారవైచారు.

కట్టినది బందీమోయుటుక్కా కావడంవల్ల, అది సరిగా బిగపడకపోవుటవల్ల, ఎలాగో సందుచేసుకుని, కాళ్ళు బయటకులాగి, ఈది, తాతారావు అవతలి ఒడ్డుకుచేరినాడు. కొంతసేపు తమాయించుకుని తరువాత విపరీతమైన బాధతో, శరీరమంతా వాచిపోయిన స్థితిలో ఉప్పులూరులో తెలిసిన యింటికి చేరాడు.

అక్కడనుండి వారిబంధువులు కంకిపాడు పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చినారు. కంకిపాడు సబ్‌యిన్‌స్పెక్టర్ సదరు తాతారావువద్ద వాఙ్మూలము తీసుకోగా అతడు పైవిషయములన్నియూ చెప్పినట్లు తెలిసింది.

ఇన్‌స్పెక్టరుగారు మెమోవ్రాసి అతనిని విజయవాడ గవర్నమెంటు ఆస్పత్రిలో చేర్పించారు, ప్రస్తుతం అతడు అక్కడ చికిత్స పొందుతున్నాడు.

ఆసుపన్న ఆర్థికసంపత్తినివుపయోగించి, ఎలాగైనా తమపైవచ్చిన యీ హత్యా ప్రయత్న నేరాన్నుండి బయట పడడానికి వీరమాచినేని సుబ్బారావు ప్రభృతులు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు.

సామాన్య కార్మికునిపై జరిగిన యీ ఘోరహత్యా ప్రయత్నాన్ని సక్రమంగా విచారించి, నిందితులను తగు విధంగాశిక్షించడానికి అధికారులు తగుచర్యలు తీసుకోగలరని యీ ప్రాంతప్రజలు ఆశిస్తున్నారు.

అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యేక ప్రాంతాల్లో ప్రభుత్వ అధికారాలపై పరిమితులు విధిస్తూ రాజ్యాంగ చట్టంలో ప్రవేశ పెట్టిన మార్పుపైన తిరిగి ఆలోచించవలసిన అవసరం వుందని మాజీ న్యాయశాఖ మంత్రి శ్రీ ఎ. కె. సేన్ నొక్కిచెప్పారు.

డబ్బు, మందులు, రక్తనిధిరూపంలో వియత్నాం ప్రజకు విరాళాలు

సంఘీభావ చిహ్నంగా సమర్పించవలసిందిగా తోటి వైద్యులకు, మందుల కంపెనీలకు

దెందులూరు వెంకటేశ్వర విద్యానిలయ వార్షికోత్సవం

దెందులూరు, అక్టోబరు 17

పశ్చిమ గోదావరిజిల్లా దెందులూరులోని శ్రీ వెంకటేశ్వర విద్యానిలయం నాల్గవ వార్షికోత్సవం శ్రీ దేవరాజు సత్యబ్రహ్మణ్యం యం.యల్.సి. అధ్యక్షతను జరిగింది.

"గురుకుల పద్ధతిలో నిర్వహింపబడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు అన్నివేళలా పాఠశాలలోనే నివసించడంవల్ల చక్కని క్రమశిక్షణ అలవాట్లు అబ్బుతాయనడంలో సందేహంలేదు. సామాన్య జనుల అందుబాటులో ట్యూషన్ ఫీజుతోసహా 50 రూపాయల ఖర్చుతో విద్యార్థులను ఈ విద్యానిలయం విద్యాగరపుతుండటం చాల సంతోషం. మూడు సంవత్సరాలు వరుసగా నూటికి నూరుగురు ప్యాసయ్యేటట్లు కృషి చేస్తున్న యీ విద్యాలయం ప్రశంసార్హం" అని అధ్యక్షులన్నారు.

వార్షికోత్సవ సభలో పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి విమలాదేవి మిషనరీ స్కూలులో తన విద్యాభ్యాసంనాటి అనుభవాలు తెలుపుతూ, గురుశిష్యులమధ్య సత్సంబంధాలు నెలకొని విద్యార్థులను చక్కని పౌరులుగా తీర్చిదిద్దగలవన్నారు.

ఆమె బహుమతిప్రదానం కూడా చేశారు, స్థానిక శాసనసభ్యులు శ్రీ యం. రామమోహనరావు పతాకావిష్కరణ చేశారు. విద్యా నిలయం ప్రిన్సిపాలు శ్రీ పాతూరి సూర్యనారాయణ నివేదిక పఠించారు. విద్యార్థి ప్రతినిధులు జగదీశ్వరరావు, సుబ్రహ్మణ్యేశ్వరరావు, రామచంద్రరాజులు ప్రసంగించారు.

శ్రీయుతులు మొక్కపాటి రామకృష్ణ, కొండమూడి శ్రీరామచంద్రమూర్తి, గరిమెళ్ల వెంకటేశ్వరరావు, నోరి రామశర్మ (ఎడిటర్, 'ప్రారంభ విద్య') పౌర సంబంధాల అధికారి శ్రీ పి.రామకృష్ణరావు విద్యానిలయ ఆశయాలు, అభివృద్ధి గురించి ప్రసంగించారు.

శ్రీ జబ్బార్ వందన సమర్పణతో సభ ముగిసింది. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శన లిచ్చారు.

భీమవరంలో:

ఫిలింవాణిజ్యమండలి ప్రముఖులకు సన్మానం

భీమవరం, అక్టోబరు 18

పశ్చిమగోదావరిజిల్లా భీమవరంలో నూతనంగా 'సినీ ఎగ్జిబిటర్సు అసోసియేషన్' ఏర్పడిన సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఛాంబరు అధ్యక్షులు శ్రీ పి. జి. బెనర్జీ, ఉపాధ్యక్షులు; శ్రీ జి. రామరాజు, శ్రీ పి. చంద్రశేఖరరావు, శ్రీ జి. కృష్ణమూర్తి, కార్యదర్శి శ్రీ ఎం. ఎస్. రాజు, కోశాధికారి శ్రీ బలరామ్‌లను, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమి అధ్యక్షులు శ్రీ నసల సూర్యచంద్రరావును ఈమధ్య విదేశయాత్రలు జరిపివచ్చిన డా॥ ఎం. ఎస్. శాస్త్రి, డా॥ పి. చలపతిరాజు, శ్రీ ఉద్దరాజు అచ్యుతరామరాజులను 16 వ తేదీన యిక్కడ సన్మానించారు. భీమవరం మారుతీ టాకీస్‌లో జరిగిన ఈ సభకు శ్రీ జూపూడి కేశవరావు అధ్యక్షతవహించారు.

సన్మాన సభకు అనేకమంది పట్టణంలోని ప్రముఖులు అరుదెంచారు. సభకుముందు అల్పాహారవిందు జరిగింది.

శ్రీ ఒంటూరి వెంకన్న మాట్లాడుతూ సినిమా ప్రవర్తకుల్లో పితామహు డనదగిన శ్రీనివాసరావు పుత్రుడు శ్రీ బెనర్జీ ఆంధ్ర ఫిలింఛాంబరు అధ్యక్షులు గావటం హర్షణీయమన్నారు. డిస్ట్రిబ్యూటర్లు ఎగ్జిబిటర్లను ఆదరంతో చూస్తూ, మంచి నడవడికగా వెళ్ళే వారికి తగినవిధంగా వ్యాపారం ఇవ్వవలసిందిగానూ, వారికి ఒక విధమైన ప్రత్యేకత చూపించవలసిందిగానూ కోరారు.

శ్రీ పి. రామానుజరాజు, ఎగ్జిబిటర్లను ఎదుర్కొంటున్న చిక్కులు గురించి మాట్లాడినారు. తర్వాత శ్రీ నసల సూర్యచంద్రరావు, డా॥ ఎం. ఎస్. శాస్త్రి, డా॥ చలపతిరాజు, శ్రీ ఉద్దరాజు అచ్యుతరామరాజు, శ్రీ గన్నాబత్తుల వెంకటస్వామినాయుడు (భీమవరం మున్సిపల్ ఛైర్మన్) మాట్లాడారు.

శ్రీ బెనర్జీ సమాధానమిస్తూ, ఎప్పుడు చూచినా మన కోర్కెలను సమిష్టిగా ప్రభుత్వానికి విన్నవించుకుంటేనేగాని ఏ పరిస్థితుల్లో ప్రభుత్వం నేమి లేదన్నారు. థియేటర్ల యజమానులు డిస్ట్రిబ్యూటర్లు అంతా కలిసి పరిశ్రమలోయున్న కష్టాలను తొలగించుకోవాలన్నారు.

చాలా అభివృద్ధి చెందిన దేశాల్లోగూడా మన భీమవరంలోకంటె తక్కువ రకం థియేటర్లున్నాయని, సినిమాకు సహకారం ఇస్తేనే న్యాయం జరుగుతుందనే విధానంగా చెయ్యగల్గిన పనులలో అందరూ సహకరించుటయే ఉందని చెప్పాలని అన్నారు.

శ్రీ వెంకట్రాజు (మారుతీటాకీస్ మేనేజర్) వందన సమర్పణ చేశారు. (ఏ. వి.)

నెల్లూరుజిల్లా గూడూరులో అక్టోబరు 15 న మునిసిపల్ ఎలిమెంటరీ గరల్సు స్కూలులో డాక్టర్ ఎస్. రామచంద్రరావు అధ్యక్షతను జయరాం స్మారక కళాసమితి సభ జరిగింది. సభలో పురప్రముఖులు, మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ శ్రీ సిద్ధారెడ్డి వెంకట్రామారెడ్డి ఉభయులు సమితి కృషిని కొనియాడారు.

---

14 మంది ప్రముఖ వైద్యుల విజ్ఞప్తి

క్షతగాత్రుల చికిత్సకై వీర వియత్నాం వెళ్లగోరే వారు తమ పేర్లు పంపవలసిందిగా వినతి

నిడదవోలు, అక్టోబరు 17

మాతృభూమి స్వాతంత్ర్యంకోసం సర్వస్వమూవొడ్డి పోరాడుతున్న వీర వియత్నామ్ ప్రజలతో సంఘీభావ చిహ్నంగా, అఖిలభారత శాంతిసంఘం నవంబరులో ఢిల్లీలో జరుగనున్న అంతర్జాతీయ యుద్ధప్రమాద ప్రతికూల మహాసభ సందర్భంలో వియత్నామ్ ప్రజానీకానికి డబ్బు, ఔషధాలు, రక్తదాతల జాబితాలు సమర్పించనున్నదనీ, ఇందుకు యథాశక్తితో తోడ్పడి, ఈ ఉద్యమాన్ని జయప్రదం చేయవలసిందిగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖులైన 14 మంది డాక్టర్లు నేడు సంయుక్తంగా తోటి వైద్యులకు. మందుల కంపెనీలకు విజ్ఞప్తి చేశారు.

విరాళాల ద్వారానే కాక, వియత్నాం యుద్ధభూమిలో గాయపడ్డ వియత్నాం యోధులకు చికిత్స చేయడానికి వియత్నాం వెళ్ళదలచుకొన్న వైద్యులు కూడా తమ పేర్లు ఆంధ్రప్రదేశ్ శాంతి సంఘానికి పంపించవలసినదిగా కూడా వారు కోరారు.

ఈ సంయుక్త ప్రకటనపై క్రింది డాక్టర్లు సంతకాలు చేశారు.

డా. బి. వి. యస్. రాజు యం. బి. బి. యస్. (ఆంధ్రప్రదేశ్ శాంతి సంఘ ప్రధాన కార్యదర్శి), డా. ఎ. వి. జి. తిలక్ యం. డి. డా. యం. వి. కృష్ణారావు బి. ఎ. యం. బి. బి. యస్, డా. టి. కనకరాజు, యఫ్. ఆర్. సి. యస్ యఫ్.ఐ.సి.యస్.(యం,యల్.సి). డా. పి.వి. రామచంద్రారెడ్డియం.బి.బి.యస్, డా. డి. గోపాలకృష్ణమూర్తి యం. బి. బి. యస్., డా. ఇందిరాదేవి యం బి. బి. యస్., డా. జి. సోమరాజు బి.యస్‌సి. యం.బి.బి.యస్., డా. కె. యస్. యస్. రాజు యం. బి. బియస్., డా. సి. వి. సోమయాజులు యం. బి. బియస్. డా. కె. శ్రీరామమూర్తి యం. బి. బియస్. డిపో, డా. బి. బ్రహ్మానందరావు యం. బి. బియస్. టి. సి. హెచ్., డా. కె. యస్. ఆర్. టి. రాజు యం. బి. బి.యస్., డా. యం. కె. విశ్వనాథం.

ప్రకటన పూర్తి పాఠం

ఈ ప్రకటనలో ఇలా ఉంది.

"ఇండోచైనాపై జెనీవాలో 1954 జులై నెలలో ఒక ఒప్పందం కుదిరింది. ఇండోచైనాలో యుద్ధం ఆగిపోయింది. దియన్-బియన్ ఫూ పతనమై, ఫ్రెంచి సామ్రాజ్యవాదులు శరణాగతులు కావడంతో పరాకాష్ఠనందుకొన్న విముక్తి సైన్యాలవిజయ పరంపర ఫలితంగానూ, ఇండోచైనాలో యుద్ధం అంతం కావాలనే ప్రపంచ ప్రజాభిప్రాయం ఒత్తిడిఫలితంగానూ ఆ కల్లోలిత దేశంలో శాంతినెలకొన్నది. జెనీవాఒప్పందం ప్రకారం లావోస్,కాంబోడియా, వియత్నాం దేశాలు స్వతంత్ర రాజ్యాలుగా ప్రకటింపబడ్డాయి. అయితే వియత్నాం తాత్కాలికంగా రెండుగా విభజింపబడింది. 17 వ అక్షాంశరేఖ తాత్కాలిక సరిహద్దుగా నిర్ణయింపబడింది, 1956 జులై 20 లోగా సార్వత్రిక ఎన్నికలు జరపడం ద్వారా వియత్నాం ఏకీకరణ జరగాలని కూడ నిర్ణయించారు. విదేశీ సైన్యాలు కాని, ఏ విధమైన ఆయుధాలు మందుగుండు కాని వియత్నాంకు రావటానికి అనుమతించరాదనీ, అక్కడ కొత్తగా విదేశీ సైనిక స్థావరాలు నిర్మింపబడరాదనీ ఒప్పందం నిర్దేశించింది.

అమెరికా రాక్షసకృత్యాలు

అయితే, అమెరికా సెనేట్ విదేశీ సంబంధాల సభ్యుడు వేనల్ మోర్స్ అంటున్నట్లు, అమెరికా ప్రభుత్వం జెనీవా ప్రణాళికను, జెనీవా ఒప్పందాన్ని ఉల్లంఘించి వియత్నాంలో అక్రమమైన భయంకర యుద్ధాన్ని ప్రారంభించింది. ఇది అంతర్జాతీయ న్యాయసూత్రాలకు, ఒప్పందం అమెరికాపై పెడుతున్న బాధ్యతలకు పూర్తిగా విరుద్ధం.

ఈయుద్ధంలో అమెరికా విషవాయువు రసాయనిక పదార్థాలను నాపాం బాంబులను, పాటవ పరిశీలనార్థం ఉపయోగిస్తున్న ముక్కల బాంబులను, తదితర బాంబులను ప్రయోగిస్తున్నారు. ఆసుపత్రుల పైన,పాఠశాలలపైన క్షయాసుపత్రుల పైన విమానాలనుండి బాంబువర్షం కురిపిస్తున్నారు. ఇవి అంతర్జాతీయ ఒప్పందాలకు విరుద్ధమేకాదు; ఇవి తీవ్రమైన యుద్ధనేరాలు. ఏనాగరికదేశానికైనా ఇవి సిగ్గు చేటయిన పనులు. ప్రపంచశాంతికే మానవజాతికే మహాపచారం.

వియత్నాంలో అమెరికా దుర్మార్గపు విస్తరణలో మానవజాతి అణుయుద్ధ మారణహోమగుండానికి ఎంత దగ్గరగా వచ్చిందంటే, ప్రపంచంలోని శాంతికాముక ప్రభుత్వాలూ, సమస్తప్రజలు వియత్నాంలో అమెరికారాక్షసత్వానికి స్వస్తిచెప్పించాలని ఆతురపడుతున్నారు, ఈప్రపంచప్రజాభిప్రాయాన్ని సవాలు చేస్తున్నదా అన్నట్లు, అమెరికా ప్రభుత్వం హనోయ్‌పైన, హైఫాంగ్‌పైన విమానదాడుల్ని తీవ్రతరం చేసింది. నిస్సైనిక మండలాలపై సైతం విమానదాడుల్ని సాగిస్తున్నది

తృతీయ ప్రపంచ యుద్ధమే వస్తే అది అణుయుద్ధంగా సాగుతుంది. అప్పుడు మానవజాతి భవిష్యత్తుకు, నాగరికతకు ముప్పు సంభవిస్తుంది.

అందువల్ల ప్రస్తుత అమెరికా దురాక్రమణను అంతం చేయడానికి, అమెరికా యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని, ఉద్యమాలను బలవత్తరం చేయడానికి నవంబరు 13 నుండి 16 వరకు ఢిల్లీలో శాంతికాముక ప్రజానీకం "అంతర్జాతీయ యుద్ధప్రమాద ప్రతికూల మహాసభను" ఏర్పాటు చేసింది.

వైద్యుల కర్తవ్యం

మానవశ్రేయస్సుకోసం యుద్ధాలకుస్వస్తి చెప్పించడం, ప్రపంచశాంతికోసం ప్రజలు చేస్తున్న కృషిలో భాగస్వాములు కావడం వైద్యులమయిన మనందరి పవిత్ర కర్తవ్యం.

అందువల్ల మీరు ప్రతినిధులుగా ఢిల్లీ మహాసభలో పాల్గొని మానవతావాదిగా మీపాత్ర నిర్వహించండి.

అమానుషమైన అమెరికా నగ్న దురాక్రమణను వీరోచితంగా ఎదుర్కొని పోరాడుతున్న వియత్నాం సోదరీ సోదరులతో మన సంఘీభావానికి చిహ్నంగా వారికి డబ్బును, మందుల్ని, రక్తదాతల జాబితాను మహాసభ సందర్భంలో సమర్పించాలని అఖిలభారత శాంతి సమితి నిర్ణయించింది.

ఆంధ్రప్రదేశ్‌లోని వైద్యులం వెనుకబడి వుండరాదు. డబ్బు, మందులు ఉదారంగా ఇవ్వటంలోను, సాధ్యమయినంత ఎక్కువగా రక్తదాతల పేర్లను నమోదు చేయించడంలోను, మనం సముచితమైన పాత్ర నిర్వహించాలి, గాయపడ్డ వియత్నాం స్వాతంత్ర్యయోధులకు చికిత్స చేయడానికై వియత్నాం వెళ్ళటానికి ఎవరైనా సిద్ధంగా వుంటే, వారు దయచేసి తమ పేర్లను పంపించవలసిందిగా కోరుతున్నాం.

వసూలయిన విరాళాలను, రక్తదాతల జాబితాలను క్రింది అడ్రసుకు పంపించాలని మా సోదరులకు విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ శాంతి సంఘ శాంతిసదన్, నిడదవోలు, పశ్చిమ గోదావరిజిల్లా.

శాంతికోసం మానవజాతి శ్రేయస్సుకోసం మందుల్ని ఉదారంగా ఇచ్చి మా ఈ ఉద్యమాన్ని జయప్రదం చేయవలసిందిగా రాష్ట్రంలోని అన్ని మందుల కంపెనీలకు విక్రేతలకు విజ్ఞప్తి చేస్తున్నాం."

విస్సన్నపేటసమితిచే కుటుంబ నియంత్రణ కేంద్ర నిర్వహణ

విస్సన్నపేట, అక్టోబరు 18

కృష్ణాజిల్లా విస్సన్నపేట పంచాయతీ సమితి అధ్వర్యమున అక్టోబరు 14, 15 తేదీలలో జిల్లా మెడికల్‌ఆఫీసరు శ్రీ శర్మ జిల్లా హెల్తుఆఫీసరు శ్రీ జి. వెంకటేశ్వరరావు సంప్రదింపులపై పంచాయతీ సమితి అధ్యక్షులైన శ్రీ బి. వెంకట్రావు, బ్లాకు డెవలప్‌మెంటు ఆఫీసరు ,శ్రీ జె. ఎలీషారావు, తెల్లదేవరపల్లి డాక్టరు యస్. శామ్యూల్ విస్సన్నపేటలో కుటుంబ నియంత్రణ కేంద్రమును ఏర్పాటుచేశారు.

డాక్టరు యం. వి. సీత బందరునుండి వచ్చి 200 మంది స్త్రీలకు లూప్ అమర్చినారు. స్త్రీలకులూపులను అమర్చుటలో తెల్లదేవరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది శ్రీమతులు జి. సరోజిని, డి. జానకి దేవి, సి. హెచ్. సువర్ణాబాయి, టి. సుబ్బమ్మ, యం. కనకరత్నంగార్లు డాక్టరు సీతకు తోడ్పడింది.

డాక్టరు చలపతిరావు. డాక్టరు కోటేశ్వరరావు, డాక్టరు రామానుజయ్య, డాక్టరు శామ్యూల్ 25 మందికి వ్యాసక్టమి అపరేషనులు చేసినారు. వ్యాసక్టమి అపరేషన్లుచేయు సందర్భమున శ్రీ కోటేశ్వరరావు హెల్తు ఇన్‌స్పెక్టరు, శ్రీ కె. ధర్మరాజు హెల్తు అసిస్టెంటు, శ్రీ రత్నమాచార్యులు కాంపౌండర్లు తోడ్పడ్డారు.

చనుబండ సర్పంచ్ శ్రీమతి కోటేశ్వరమ్మ ఆమె భర్త కోటిలింగము వారి గ్రామమునుండి ఎక్కువమంది స్త్రీలను ఈ కేంద్రమునకు తీసికొనివచ్చి క్యాంపును జయప్రదముచేశారు.

ప్రధాని రేడియో ప్రసంగం

న్యూఢిల్లీ, అక్టోబరు 18

ప్రధానమంత్రి శ్రీమతి గాంధీ రేపు రాత్రి 8-30 గంటలకు రేడియోలో ప్రసంగిస్తారు.

జి. ఓ. ప్రకారం జీతాలు చెల్లించకుంటే సమ్మె జరపక తప్పదు

సాలూరు మోటార్ వర్కర్సు యూనియన్ తీర్మానం

సాలూరు, అక్టోబరు 18

1961 లో జారీ చేయబడిన జి ఓ. ననుసరించి తమకు జీతాలను చెల్లించకుంటే, నవంబరు 1 నుండి సమ్మె జరపాలని శ్రీకాకుళం జిల్లా, సాలూరు మోటారు వర్కర్సు యూనియన్ తీర్మానించింది.

ఆంధ్ర ప్రభుత్వపు 16-8-61 తేదీ గల జి. వో. ఎం ఎస్. నెం 1607 ప్రకారం మోటారు కార్మికులకు జీతాలను అమలు చేయమని సాలూరు మోటారు కార్మికులు చిరకాలం నుంచీ కోరుతున్నారు. యజమానులు ఎందుకు అంగీకరించడంలేదు. ఆఖరు సారిగా సాలూరులోగల రెండు యజమానుల యూనియన్‌లతోను కార్మిక సంఘం వారు ఈ నెల 11న సంప్రదింపులు జరిపారు, యజమానులు జి. ఓ. ప్రకారం కనీస వేతనములు అమలు జరుపుటను నిరాకరించారు. దీనిని అమలు చేయవలసిన బాధ్యత అసిస్టెంటు లేబరు యిన్‌స్పెక్టరుపై వున్నప్పటికీ యజమానులకు పక్షపాతంగా యజమానుల వకీలువలె ఆయన వ్యవహరించుచున్నారు.

ఈ విషయాలన్నిటిపైనా 300 మంది మోటారు డ్రైవర్లు ఊరేగింపుగావెళ్ళి తహశీల్దారుకు ఒక మెమొరాండం సమర్పించారు.

12 వ తేదీన 100 లారీల వర్కర్సు మూడుచక్కిపి శాలలు పెట్టి జనరల్‌బాడీ జరుపుకొన్నారు. నవంబరు 1 నుండి జి. వో. ప్రకారం జీతాలు చెల్లించకుంటే మొత్తం పని మానివేసి సమ్మె చేయ నిర్ణయించారు.

బీరుహూరు పరపతి సంఘాధ్యక్షునిచే ద్రవ్యాపహరణ

డిచ్‌పల్లి, అక్టోబరు 18

నిజామాబాదుజిల్లా దిచ్‌పల్లి తాలూకా బీరుహూరు గ్రామపంచాయతీవద్ద అధ్యక్షుడు పరపతి సంఘాధ్యక్షుడూ అయిన నాగనాథరావు, పరపతి సంఘం తాలూకా 37 వేల రూపాయలను స్వాహా చేశారు.

ఈ విషయాన్ని బట్టబయలు చేస్తూ వృద్ధ కాంగ్రెసువాది రామినేని వెంకటప్పయ్య ప్రభుత్వానికి ఫిర్యాదుచేయగా విచారణ జరిగింది. 37 వేలకు పైగా ఆయన అపహరించినట్లు రుజువు అయినది.

అపహరణకు పాల్పడిన నాగనాథరావు మీద క్రిమినల్‌కేసు బనాయించమని ప్రభుత్వం పోలీసు శాఖకు ఆదేశాలు పంపినట్లు తెలుస్తున్నది. నాగనాథరావు మీద కేసు బనాయించటానికి పోలీసు శాఖ వెనకాడుతున్నది అలాగాకుండా వెంటనే ప్రాసిక్యూషను వర్తించుకోవాలని ప్రజలు కోరుతున్నారు. (వి. వి.)

సౌఖ్యప్రద జీవితం వైపు సాగిపోతున్న తూర్పు జర్మనీ

భీమవరం సన్మాన సభలో డా॥ ఎం. ఎస్. శాస్త్రి వివరణ

భీమవరం, అక్టోబరు 18

మనిషి మనిషిగా బ్రతుకగలిగే కనీసఅవసరాలనుతీర్చుతూ, సోషలిస్టు పథంలో సౌఖ్యప్రద జీవితం వైపుగా సాగిపోతున్న తూర్పు జర్మన్ ప్రజల కృషిని గురించి, యిటీవల ఆదేశం పర్యటించి వచ్చిన, డా॥ ఎం. ఎస్. శాస్త్రి, భీమవరం సన్మానసభలో వివరించారు.

భీమవరం వాణిజ్య మండలి భవనంలో శ్రీ బొండాడ బంగార్రాజు అధ్యక్షతను శ్రీ ఉద్దరాజు అచ్యుత రామరాజుగార్ని విదేశాలకు వెళ్ళివచ్చిన సందర్భంలోనూ, డాక్టరు ఎం. ఎస్. శాస్త్రి "భారత కృషక్ సమాజ్" అనే సంస్థ తరఫున మన దేశంనుండి తూర్పు జర్మనీ వెళ్ళివచ్చిన సందర్భంలోనూ ఈ నెల 16 న ఉదయం మండలి సభ్యులచే వారికి సన్మానసభ ఏర్పాటు చేయబడింది,

సన్మానసభకు అనేకమంది పురప్రముఖులు వచ్చారు.

అధ్యక్షులు శ్రీ బంగార్రాజు మాట్లాడుతూ ఇతర దేశాల్లోని మంచిని గ్రహించడానికి ఈలాంటి యాత్రలు ఉపయోగపడటానికి తోడ్పడతా యన్నారు. తరువాత శ్రీతటవర్తి నర్సింహారావు, శ్రీ కలిగొట్ల నర్సింహమూర్తి మాట్లాడినారు.

తమకు చేసిన సన్మానానికి శ్రీ శాస్త్రిసమాధానం చెప్పుతూ యిలా అన్నారు.

తూర్పుజర్మనీప్రజలు ప్రపంచయుద్ధం రాకుండా తోడ్పడుతున్నారు. బెర్లిన్ 1948 నుండి అనేక ఒప్పందాలు, షరతులకు కట్టుబడియున్నప్పటికీ, ఒకప్రణాళికప్రకారం తూర్పు జర్మనీని అభివృద్ధి చేసినారు. ఒక మూల అక్కడి మేధావుల్ని, శాస్త్రజ్ఞుల్ని పశ్చిమజర్మనీ ప్రభుత్వమూ అమెరికా కలిసి డబ్బుతో కొనివేయుటకు ప్రయత్నించినా ధైర్యంతో ఆవరోధాలను నిరోధించగల్గినారు. తూర్పు జర్మనీని సర్వనాశనం చేయుటకు పూనుకొన్న వారి చర్యలను ప్రజలు సాగనివ్వలేదు.

సోషలిస్టు సమాజం స్థాపించాలనే దీక్షలో భాగంగానే వారు బెర్లిన్‌లో గోడను నిర్మించారు. దానివల్ల కొన్ని చిక్కులు ఎదురయ్యాయి.

భూమి సమస్య

వాళ్ళ దేశంలో కో ఆపరేటివ్ సొసైటీల ద్వారా భూమినంతా తీసుకొన్నారు. 250 ఎకరాలు పైబడ్డ భూస్వాముల్ని తొలగించినారు. 5 ఎకరాలు, 10, 100 ఎకరాలుగల వారితో సొసైటీలు స్థాపించినారు. కోళ్ళు, పందులు, మేకలు, గొర్రెలు పెంచడం మున్నగు కార్యక్రమాలను చేపట్టినారు. వారు మొదటగా నిర్బంధం లేకుండా స్వచ్ఛందంగా ప్రజలను సమీకరించినారు. ఆప్లావారు ఉత్పత్తి అయ్యేవాటిని సక్రమంగా, న్యాయంగా అందరికి సమానంగా పంపిణీ జరిగేటట్లు కృషిచేసినారు.

మన దేశంలో లాగున పేదవర్గాలకు ఏదో కొంత పడేసి వాళ్ళ కన్నీళ్ళు తుడిచే విధంగా అచ్చట సోషలిజం వ్యవస్థ లేదు. అందరికీ సమానంగా లాభాల పంపిణీ జరుగుతున్నది.

వ్యక్తిగత చర్యలవల్ల మన దేశంలో సోషలిస్టువ్యవస్థను స్థాపించలేం.అచ్చటఏపల్లెటూరు వెళ్ళినా శుభ్రమైన రోడ్లు; ప్రతీవారికి మంచిఇండ్లు; ప్రతీ రైతు ఇంట్లో టెలివిజన్ సెట్లు. శానిటరీ సౌకర్యాలు వున్నవి, మన దేశంలో నాల్గవ ప్రణాళికలోగూడా సామాన్య మానవునికి కనీసం ఏ విధమైన సౌకర్యాలు కల్గుటలేదు,

అచ్చట ప్రభుత్వంజీవనాన్ని యూపుమూపా అనే లక్ష్యసాధనతో అచ్చట సామాన్యరైతుల క్షేమాన్ని గురించి గట్టిగా, కృషి చేస్తున్నారు. నేడు తూర్పుజర్మనీ నుండి పశ్చిమ జర్మనీలోకి పారిపోయే వారు కన్పించడంలేదు. ఇంకా పశ్చిమ జర్మనీ నుండే తూర్పు జర్మనీలోకి పారిపోయే పరిస్థితులు నేడు అచ్చట కన్పించాయి.

ఒక్క పది సంవత్సరాల్లోనే వ్యవసాయంలో యంత్ర పరిశ్రమలో గూడా విప్లవం తీసుకొని రావడానికికృషి చేస్తున్నారు, అచ్చటప్రతిగ్రామంలో కోఆపరేటివ్ సొసైటీల ద్వారా చౌకగా వస్తువులను ప్రభుత్వం అమ్ముతున్నది. 3 వందలు తక్కువ జీతం సంపాదించేవారు లేరు. అచ్చట మహిళలకు సమానఅవకాశాలు ఇచ్చినారు. స్త్రీలు బలహీనులుగా కన్పించడంలేదు. చాలా ధైర్యంగా బలంగా పనిచేస్తున్నారు. స్త్రీలకు పురుషుని కంటే ఎక్కువవేతనం ఇస్తున్నారు. ఆఫీసుల్లో పని చేసే గుమాస్తాల కంటే కష్టపడే రైతులకు, కార్మికులకి అధికవేతనాలు అచ్చట ఇస్తున్నారు. అచ్చట కార్మికులకు పనుల సమయంలో యూనిఫారమ్ చేతులకు గ్లౌస్ కాళ్ళకు బూట్లు మొదలగునవి ఇచ్చినారి ఆరోగ్యం కాపాడుతున్నారు

అవసరమును చేసేవారికి అదనంగా వేతనం ఇస్తున్నారు. శాస్త్రజ్ఞులకు యూనివర్శిటీ ప్రొఫెసర్లకు విద్యావేత్తలకు అచ్చట మంచి గౌరవం చూపుతున్నారు,

విద్యార్థులు, ఉపాధ్యాయులు కలసిమెలసి వ్యవహరించుచున్నారు. మనదేశంలో కలిసినంత మాత్రాన గౌరవమర్యాదలు పోతాయి. అంటున్నాం.కానీవారిపద్ధతిచాలాఆశ్చర్యంగా యుంటున్నది. మనం తోటిమానవున్ని సమానంగా గౌరవించుకోవడం లేదు. పతనం ప్రమాదమైన స్థితికి దిగజారుతున్నాం. అచ్చట కొంచెం స్వంత ఆస్తి యుంచుకోవచ్చును.

అచ్చట ప్రతీ పౌరునినుండి అతని జీతంలో 60 మార్కులు వసూలుచేసిదానితో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలిచ్చివిద్యను గరపుతారు, అచ్చటనున్న ప్రతీ పౌరుడు సంఘానికి సేవచెయ్యాలి, అనే కాంక్షతో 5 వందలు జీతం తీసుకొంటే 6 వందలు విలువ గల్గిన పనిని చేస్తున్నారు.మనదేశంలో 5 వందలు సంపాదించే ఉద్యోగి ఒక వంద రూపాయల పనిని గూడా చెయ్యడంలేదు. అచ్చట వ్యవసాయంలో 4 ఏండ్లు శిక్షణ పొందిన విద్యార్థులే వ్యవసాయ కళాశాలల్లోపని చేయడానికివస్తున్నారు.వృద్ధాప్యపు పింఛన్లుమున్నగు సౌకర్యాలుకల్గియున్నారు.

అచ్చట దేవుడులేడనేవాదం యదార్థం కాదు. అచ్చట గూడా ప్రజలు చర్చీలకు గుడులకు వెళ్ళుతున్నారు. బౌద్ధంపై వైన ఎక్కువభక్తి కల్గియున్నారు,

తరువాత శ్రీ ఉద్దరాజు అచ్యుతరామరాజు దివ్యజ్ఞాన మహాసభల సందర్భంలో తాను ఆస్ట్రియాలోని "శాలిస్‌బర్గు"కు వెళ్ళిన సందర్భంగా తమ అనుభవాలను వివరించినారు.

సన్మాన సభకు ముందు శ్రీ అచ్యుతరామరాజును డా॥ శాస్త్రిని పుష్పమాలాంకృతులను చేశారు. (ఎ. వి.)

నవంబరు 13 నుండి 16 వరకు

ఢిల్లీలో జరుగబోవు

అంతర్జాతీయ యుద్ధ ప్రమాద ప్రతికూల మహాసభకు

ఆంధ్రప్రదేశ్ శాంతిసంఘ సన్నాహక మహాసభ

పశ్చిమ గోదావరిజిల్లా

నిడదవోలు

పరిషత్ హయ్యర్ సెకండరీ పాఠశాల ఆవరణలో

అక్టోబరు 23న ఆదివారం జరుగుతుంది

కార్యక్రమం

23-10-66 తేదీ ఉదయం

శ్రీ టి. లక్ష్మీనారాయణరెడ్డిగారు

11-00 గంటలకు : శాంతి పతాక నెగురవేయుట

అధ్యక్షులు : శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారు

ప్రారంభకులు : శ్రీ వి అనంతరామయ్యగారు

యితర ఉపన్యాసకులు

మధ్యాహ్నం 2-00 గంటలకు తీర్మానములు - చర్చలు

చర్చనీయాంశములు :

1. వియత్నాంలో శాంతి
2. సైనిక స్థావరాలు, సైనిక కూటముల మూలంగా శాంతికి ప్రమాదము
3. సామ్రాజ్యవాదం, వలసవిధానం, నయావలస విధానాలకు వ్యతిరేకంగా ఆసియా - ఆఫ్రికా - లాటిన్ అమెరికా దేశాల ప్రజల పోరాటం
4. అణ్వాయుధాల విస్తరణ నివారణ, అణ్వస్త్ర పాటవ పరీక్షల నిషేధం, సంపూర్ణ నిరాయుధీకరణ
5. ఢిల్లీలో జరుగు "అంతర్జాతీయ యుద్ధ ప్రమాద ప్రతికూల మహాసభ"కు ప్రతినిధుల ఎన్నిక.

*

అక్టోబరు 22 వ తేదీ శనివారం రాత్రి 8 గంటలకు నిడదవోలు "శాంతి సదన్"లో ప్రదేశ్ శాంతిసంఘ సమావేశం జరుగుతుంది

ఎజండా

1. సన్నాహక సభకు సమర్పించుటకు ముసాయిదా తీర్మానములు తయారు చేయుట
2. గతంలో చేసిన కృషి సమీక్ష, శాంతి ఉద్యమం విస్తృత పరచుటకు చేయవలసినది.
3. వియత్నాం ప్రజల సహాయార్థం నిధి, మందుల సేకరణను గురించి.
4. అధ్యక్షునిచే ప్రవేశపెట్టబడు యితర విషయములు.

విజయనగరం మునిసిపల్ అధికారుల అశ్రద్ధ, అలక్ష్యం

ప్రజావసరాలపై శ్రద్ధలేనిస్థితి; బస్టాండ్‌లో షెడ్‌కూలిపోయి రెండేళ్ళయి అక్కడే పడివున్నా తమదికాదంటూ నిర్లిప్తం

విజయనగరం, అక్టోబరు 18

విజయనగరం మున్సిపల్ పాలనలో అధికారులు ప్రజావసరాలపై ఏ మాత్రం శ్రద్ధ తీసుకొనటంలేదు కొళాయిలపై భాగాలు పోయినా, మురుగుదొడ్ల విషయం అధ్వాన్నమైపోయినా పట్టించుకోవటంలేదు. రెండేళ్ళనాడు ఆర్. టి. సి. బస్సు స్టాండులోని ప్రయాణీకుల షెడ్‌కూలిపోయి శిథిలాలు ఇప్పటికీ అక్కడే పడివున్నా, నిర్లిప్తంగా వుంటున్నారు. అటు ఆర్. టి సి. వారూ దానిని పట్టించుకోవడంలేదు. ఇలా విజయనగర పౌరుల అవసరాలు నిర్లక్ష్యం కాబడుతున్నాయి.

ఈ విషయం గురించి విజయనగరం తాలూకా కమ్యూనిస్టు సమితి సభ్యుడు శ్రీ మొకర అప్పారావు యిలా వ్రాస్తున్నారు:

విజయనగరం బస్సు స్టాండుకు వచ్చే బస్సుల సంఖ్య నిత్యం పెరుగుతున్నది అదేవిధంగా యిక్కడ నుండి అనేక వందలమంది ప్రయాణీకులు యితర ప్రాంతాలకు వెళ్లేవారు వచ్చేవారు వుంటారు. ఈ లాంటి పరిస్థితులలో విజయనగరం బస్సు స్టాండు పెద్ద కేంద్రంగా వున్నది. అయితే యీ కేంద్రంలో ప్రయాణీకులకు, వర్షాకాలంగాని ఎండా కాలంగాని వసతిలేదు. మునిసిపాలిటీవారు నిర్మించిన ప్రయాణీకుల విశ్రాంతి హాలు ఒకనాటి రాత్రి కూలిపోవడం, కొన్ని ప్రాణాలు బలి కావడం జరిగింది. ఈ ఘటన జరిగి సుమారు రెండు సంవత్సరములు పూర్తి కావస్తున్నది. ఆ కూలిపోయిన షెడ్డు కూలిపోయి నష్టే వున్నవిగాని ఇంతవరకు ఆ సామగ్రిని కూడా తీయలేదు. ఈ దృశ్యం ప్రతిరోజు అనేకమంది అధికారులు చూస్తూనే వుంటారు గాని దానినిగూర్చి ఏమాత్రంపట్టించుకోవడం లేదు.

మున్సిపల్ అధికారి మాకిది సంబంధం లేదు అది, ఆర్. టి. సి వారికి ఇచ్చివేసినా మరి అంటున్నారు, ఇదేపరిస్థితి ఏ ఆసామి యింటివిషయంలో జరిగినచో, మున్సిపల్ అధికారులుగాని, శాంతిభద్రతల విషయంలో పోలీసువారు గాని ఆయింటి యజమానిపైన కేసులు పెట్టి కోర్టులకు యీడ్చడమో వారి నిర్బంధంతో దానిని తొలగింపజేయడమో చేసేవారు. అయితే యీ విషయంలో యీఅధికారులు అంతా ఏమైనారు? జిల్లా పోలీసు సూపరింటెండెంటు, సబ్ కలెక్టరు యిప్పటికైనా దాని విషయంలో శ్రద్ధతీసుకొని పడిపోయిన షెడ్డును పూర్తిగా తొలగించి కొత్త షెడ్డును నిర్మించుటకు కృషి చేయవలెనని కోరుతున్నాను. అదేవిధంగా నరగరంలో మంచినీటి కొళాయిలు బుర్రలు వుండవు.

అధ్వాన్నంగావున్న మురుగుదొడ్ల పరిస్థితి

మురుగుదొడ్ల విషయం ఎంతో అధ్వాన్నంగావుంది. ముఖ్యంగా శివ వారలో వున్న మురుగుదొడ్డికి ఆనుకొని అనేక కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ దొడ్డినుండి వచ్చే దుర్గంధం వారి ఇళ్ళకు వ్యాపిస్తున్నది. వర్షాకాలం అక్కడిప్రజలు ఎంతో నరకంగా బ్రతుకుతున్నారు. ఈ విషయంలో అనేక సంవత్సరాలు నుండి అక్కడి ప్రజలు సంతకాలుచేసి మున్సిపల్ అధికారులకువిన్నపముల ద్వారా తెలియచేస్తూ యీ మురుగు దొడ్డిని ఆధునికంగా నిర్మింప (సెప్టిక్ లెట్రిన్) వలసినదిగాకోరియున్నారు. అయినా ఆరోగ్యశాఖవారు నిర్లక్ష్యంచేస్తుయున్నారు అలాంటి అధికారులు మున్సిపల్ ఆఫీసులో యింజనీయరు హెల్తు ఆఫీసరు పాత వాటిని అనేక వందల రూపాయిల ధనం వ్యయంచేసి బాగు చేసినారు.

ఇంకొక విచిత్రం ఏమనగా యింత వరకు యీ మున్సిపాలిటీ చరిత్రలో జరుగని పని. ఏ కమిషనరు చేయని పని శ్రీ రామిరెడ్డి అనే కమిషనరు (యీయన ప్రస్తుతం రాజమండ్రిలో వున్నారు) మాత్రం చేసినారు. అదేమనగా కమిషనరు రూముకు ఆనుకుని వుండే విధంగా ఆఫీసు లోపలనే ఒక ఆధునికమైన మరుగు దొడ్డిని అనేక వేలరూపాయలతో నిర్మించినారు. వీరికి ప్రజాధనంతో వారి స్వప్రయోజనాలను నెరవేర్చుకోవడం తెలిసిందిగాని, ప్రజల ధనంతో ప్రజల సమస్యలను పరిష్కరించడం అంటే మాత్రం తెలియలేదు,

ఇక మురుగు కాల్వలు ఇవి రోడ్లమీదుగానే ప్రవహిస్తువుంటవి, వీటిని అనేక సంవత్సరాల క్రితం మహారాజావారి కాలంలో నిర్మించినారు. కొన్నిచోట్ల పాడైపోయి పోవడం జరుగదు. అవి తాత్కాలికంగా బాగుచేస్తారుగాని పూర్తిగా బాగుచేసే అలవాటు మున్సిపాలిటీ వారికిలేదు,

దోమల మయంగావున్న మార్కెట్లు

మహారాజావారి పి.డబ్ల్యు. డి. మార్కెట్టు, కూరగాయల మార్కెట్టు, పశువులమార్కెట్టు. ఇవి వర్షాకాలంలో మోకాలులోతు బురదతో నిండి వుంటాయి. ఇక దోమలబాధ చెప్ప నవసరంలేదు, యీ పరిస్థితి అనేక సంవత్సరాలనుండి కొనసాగుతూ వున్ననూ, మార్కెట్టు అధికారులుగాని,మున్సిపల్ ఆరోగ్యశాఖవారుగాని ఏమీ పట్టించుకోరు. ఈలాంటి విషయాలు అనేకం విజయనగరంలో వున్నవి. జిల్లా ఉన్నతాధికారులు ముఖ్యంగా స్థానిక పోలీసు సూపరింటెండెంటు సబ్ కలెక్టర్, కమీషనరు హెల్తు ఆఫీసరు, మున్సిపల్ ఇంజనీరు లాంటి ముఖ్యులు తగు శ్రద్ధ తీసుకొని పైన పేర్కొన్న ప్రతి విషయాన్ని సానుభూతితో గమనించి శ్రద్ధగా పరిశీలించి ప్రజల ఇబ్బందులను నివారిస్తారని ఆశిస్తున్నాను."

రేడియో

శుక్రవారం అక్టోబరు 21
శక 1888 ★ ఆశ్వయుజ 29

విజయవాడ

357.1 మీ. (840 కిలోసై.)

ఉదయం: 6-00 వందేమాతరం, శుభోదయం, ప్రసారవిశేషాలు: 6-10 భక్తిరంజని: 6-40 అం. వా; 6-45 సూక్తిముక్తావళి: 6-50 బజారు ధరలు 7-00 తె. వా; 7-15 గాంధీ మార్గం: 7-40 వేణువు; 8-00 అం. వా; 8-15 హిం. వా; 8-30 హైదరాబాద్ వలె; 9-00 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 12-30 కార్మికులకు; 1-00 వనితా వాణి; 1-30 అం. వా; 1-40 హిం. వా; 1-50 తె. వా; 2-00 సమాప్తి.

సాయంత్రం: 5-30 స్థానిక ప్రకటనలు; 5-35 హై. రిలే; 6-00 అం. వా; 6-05 వాద్య బృందం; 6-15 ప్రాం. వా; 6-25 ముఖ్యప్రకటనలు; 6-30 పంటసీమలు; 7-00 తె. వా; 7-15 హై. రిలే; 7-30 సంగీత కచేరీ; 9-00 అం. వా; 9-15 వార్తలు; 9-20 విరామ సంగీతం; 9-30 సాహిత్య నందిని; 10-00 వేణువు; 10-30 అం. వా. 10-35 జన గణ మన - ప్రసార సమాప్తి.

హైదరాబాద్ - (ఎ)

405.4 మీ. (740కిలోసై.)

ఉదయం: 6-00 వందేమాతరం, కార్యక్రమ వివరణ; 6-10 భక్తిరంజని: 6-40 అం. వా; 6-45 సూక్తి ముక్తావళి: 6-50 విజయవాడవలె; 7-00 తె. వా; 7-15 గాంధీ మార్గము; 7-40 విరామ సంగీతం; 7-45 సంగీత శిక్షణ; 8-00 అం. వా; 8-15 హిం. వా: 8-30 ఖయాల్; 9-00 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 12.30 కార్మికులకు; 1-00 వి. రిలే; 1-30 అం. వా; 1-40 చిత్రపట్ సే; 1-50 తె. వా; 2-00 వాతావరణ సూచన; 2-10 ఉ. వా; 2-20 ప్రాదేశిక్ సంగీత్; 2-30 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5-30 స్థానిక ప్రకటనలు; 5-35 లలిత సంగీతం; 5-50 పద్యపఠనము; 6-00 అం. వా; 6-05 ప్రాం. వా - ఉర్దూ, (హైదరాబాద్ - కడపలు మాత్రమే) 6-15 ప్రాం. వా; 6-25 ముఖ్య ప్రకటనలు 6-30 గ్రామస్థుల రేడియో గోష్ఠి: 7-00 తె. వా; 7-15 పొదుపు - రూపకము; 7-30 నేతి శ్రీరామశర్మ; 9-00 అం.వా; 9-15 ఉ వా: 9-30 వి. రిలే; 10-00 ఖయాల్: 10.30 అం. వా; 10-30 హిం. వా; 10-40 వాతావరణ సూచన - జన గణ మన - సమాప్తి.

హైదరాబాద్ - (బి)

కడప

333.3 మీ. (900 కిలో సై.)
సాయంత్రం 5-30 నుండి రా॥ 10-40 వరకు
శనివారములు మాత్రము
(సా॥ 5-30 నుండి రాత్రి 11-10 వరకు)

విశాఖపట్నం

322.6 మీ. (930 కిలో సై.)
సా॥ 5-30 నుండి రా॥ 10-40 వరకు

89.42 మీ. (3355 కిలో సై.)
[హైదరాబాద్ మాత్రమే]

ఉదయం: 6-00 హై.ఎ.వలె; 7-45 సమాప్తి.

62.50 మీ (4800 కిలోసై)

8-00 హై. ఎ. వలె: 8-30 ఎస్. పద్మ, ఎస్. రాజకుమారి; 9.00 ప్రసార సమాప్తి.

42.02 మీ (7140 కిలోసై)
[హైదరాబాద్ మాత్రమే]

మధ్యాహ్నం: 12-30 హై. ఎ. వలె: 2-10 వాద్య సంగీతం: 2-20 హై. ఎ. వలె: 2-30 ప్రసార సమాప్తి

62.50 మీ. (4800 కిలో సై.)

సాయంత్రం: 5-30 హై. ఎ. వలె: 7-00 తె.వా; 7-15 హై. ఎ. వలె: 9-15 వార్తలు: 9-20 విరామసంగీతం; 9-30 హై. ఎ. వలె: 10-00 ఎస్. పద్మ, ఎస్. రాజకుమారి: 10-30 హై. ఎ. వలె, 10-40 వాతావరణ సూచన- జన గణ మన - ప్రసార సమాప్తి.

మద్రాసు - (బి)

211.3 మీ. (1420 కిలో సై)

ఉదయం: 6-00 వందేమాతరం, మంగళగానం: 6-40 అం. వా; 6-45 సంగీత రూపకం: 7-00 తె. వా; 7-15 సంగీత మంజరి; 7-30 నాదస్వరం; 8-00 అం. వా; 8-15 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నము: 11-55 ప్రాంతీయ తెయివిగళ్; 1-00 పాశ్చాత్యసంగీతం: 1-30 అం. వా; 1-40 హిం. వా; 1-50 తె. వా; 2-00 స్త్రీల కార్యక్రమం: 2-30 సమాప్తి.

(5-30నుండి6-40వరకు 60.93 మీ.పైగూడ)

సాయంత్రం: 5-30 పాశ్చాత్య సంగీతం: 6-00 అం.వా; 6-05 ప్రాంతీయ తెయివిగళ్: 6-20 స్థానిక ప్రకటనలు - కార్యక్రమ వివరణ; 6-45 నాదస్వరం: 7-00 తె.వా; 7-15 జయభేరి- రూపకం; 7-30 విశ్వ విద్యాలయాలకు; 8-00 ఆహార సమస్య - అభివృద్ధి కార్యక్రమం: 8-10 విరామ సంగీతం: 8-15 మధుర గీతం: 8-30 మెల్లిసై; 8-45 వాద్య సంగీతం; 9-00 అం. వా; 9-15 వార్తలు, 9-20 విరామ సంగీతం; 9-30 పాశ్చాత్య సంగీతం: 10-30 అం. వా, 10-35 జన గణ మన - ప్రసార సమాప్తి.

విశాఖజిల్లా మించింగ్‌పుట్ గిరిజన సమితిలో ఏర్పాటైన నిలువ ప్రదర్శన కేంద్రమును జాలాపుట్‌లో అతి వైభవముగా సమితి అధ్యక్షులు శ్రీమసం చిట్టిబాబ్ ఆధ్వర్యమున ప్రారంభోత్సవము జరుపబడినది. పరిసర గ్రామ గిరిజనులు, స్థానిక అధికారులు కార్యక్రమములో పాల్గొన్నారు.

బంద్ నిర్వహణకు విజయనగరంలో అఖిలపక్ష కమిటీఎన్నిక

విజయనగరం, అక్టోబరు 18

'రాష్ట్రబంద్'ను నిర్వహించేందుకు ముందు సన్నాహంగా విజయనగరంలో ఒక అఖిలపక్ష కార్యాచరణకమిటీ ఎన్నికయింది.

విజయనగరంలో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, కార్మిక సంఘములు, యువజన, తదితరములైన సుమారు 20 సంస్థలకు చెందిన ప్రతినిధులు అక్టోబరు 15న పట్టణ కార్మిక సంఘంవారి ఆఫీసులో కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి శ్రీ డి. మృత్యుంజయరావు అధ్యక్షతను సమావేశమైనారు.

దీనిలో శ్రీమృత్యుంజయరావు దేశపరిస్థితులను అధిక ధరలలో చాలీ చాలని వేతనాలతో మధ్యతరగతి ఉద్యోగులు,వృత్తిదారులు,చిన్న వ్యాపారులు కార్మికులుయావన్మందిఏవిధంగా బాధలు అనుభవిస్తున్నారో తెలిపారు. దీని నివారణకు చేయవలసిన కృషిని, కార్యక్రమాన్ని వివరించి విజ్ఞప్తి చేసినారు.

రాష్ట్ర కార్యాచరణ సమితి పంపిన 20 కోర్కెలుగల తీర్మానాన్ని వివరించిన అనంతరం శ్రీ యస్. నారాయణరావు (మార్క్సిస్టు కమ్యూనిస్టుపార్టీ), శ్రీ వెలగాడ ఆదినారాయణ (తాలూకా యువజనసంఘం) శ్రీ కెల్ల సూర్యనారాయణ. శ్రీమొకర అప్పారావు (మున్సిపల్ వర్కర్సుయూనియన్) శ్రీ సి. వి. సత్యనారాయణ (అరుణా జూట్ మిల్లు) శ్రీ కె. శంకరరావు (యువజన యూనియన్) గార్లు బంద్‌ను అన్ని సంస్థలు, జయప్రదం చేయాలని కోరారు.

అనంతరం యీ దిగువ వారితో కార్యాచరణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

(1) శ్రీ డి. వి. సత్యనారాయణ (కన్వీనరు), (2) శ్రీ మొకర అప్పారావు, (3) శ్రీ డి. మృత్యుంజయరావు (కమ్యూనిస్టు పార్టీ). (4) శ్రీ యస్. నారాయణరావు (మార్క్సిస్టు కమ్యూనిస్టుపార్టీ), (5) వెలగాడ ఆదినారాయణ (6) శ్రీ కె. శంకరరావు. (7) శ్రీ గండు రామారావు.

ఈ సమావేశమునకు శ్రీ డి. మృత్యుంజయరావు (కమ్యూనిస్టుపార్టీ), శ్రీ యస్. నారాయణరావు (మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ) శ్రీ మొకర అప్పారావు (మున్సిపల్ వర్కర్సు యూనియన్), శ్రీ డి. వి. సత్యనారాయణ (అరుణా జూట్‌యూనియన్), శ్రీ కర్రోతు నారాయణ (ప్రెస్ అండ్ మిల్సు వర్కర్సు యూనియన్), శ్రీ గండు రామారావు (సిగర్ వర్కర్స్ యూనియన్), శ్రీ డి. గురుమూర్తి (అల్యూమినియం వర్కర్స్ యూనియన్), శ్రీ తావాడ అప్పన్న (బిస్కట్టు అండ్ పిప్పరమెంటు వర్కర్సు యూనియన్), శ్రీ యడ్ల అప్పారావు (సైకిల్ రిపేరర్సు అసోసియేషన్) శ్రీ కె. యస్. యన్. నాయుడు, (టీ దుకాణదారుల సంఘం) శ్రీ వెలగాడ ఆదినారాయణ (తాలూకా యువజన సంఘం) శ్రీ మూర్ల రామకృష్ణ (పట్టణ యువజన సంఘం), శ్రీ లంక సీతారాం (వ్యా॥ కా॥ సంఘం) శ్రీ కోళాతాల శంకరరావు (యువజన యూనియన్) శ్రీ యడ్ల సూరి అప్పారావు (విజయా యువజనసంఘం) శ్రీ యస్. కృష్ణారావు (ప్రజా నాట్యమండలి) శ్రీ మాంతి వెంటయ్య (గ్రామాభ్యుదయ సమితి) శ్రీ పిల్లల అప్పన్న (రవీంద్ర పఠన మందిరం)గార్లు ఆయా సంస్థల నుండి సమావేశానికి వచ్చి ఆయా సంస్థల తరపున విరాళములను వాగ్దానం చేశారు.

(వి. వి)

కొత్తూరులో 400 మంది ప్రభుత్వ ఉద్యోగుల ప్రదర్శన

కొత్తూరు, అక్టోబరు 18

శ్రీకాకుళంజిల్లా కొత్తూరులో ప్రభుత్వోద్యోగుల, ట్రేడ్‌యూనియన్ల సమన్వయ కమిటీ ఆధ్వర్యాన 400 మందితో ఊరేగింపు జరిగింది.

పిమ్మట బహిరంగసభ జరిగింది. బహిరంగసభకు స్థానిక ఎన్.జి.ఓ. సంఘ నాయకులు శ్రీ నాగమూర్తి అధ్యక్షత వహించారు.

కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరికి నిరసన తెలుపుతూ, జీతము, కరువుభత్యం, సర్వీస్ స్థితిగతులకు సంబంధించి తాము రూపొందించిన యిరవై కోర్కెలను ప్రభుత్వం ఆమోదించాలని కోరుతూ సభవారు తీర్మానించారు.

ఉప్పులూరులో బంద్‌కు యువజన సంఘ సన్నాహం

విజయవాడ, అక్టోబరు 18

విజయవాడ తాలూకా ఉప్పులూరు గ్రామ యువజనసంఘ కార్యకర్తల సమావేశం నిన్న రాత్రి 9 గంటలకు శ్రీ కోటయ్య అధ్యక్షతన జరిగింది.

సమావేశంలో కృష్ణాజిల్లా యువజన సంఘ కార్యదర్శి శ్రీ కొల్లి నాగేశ్వరరావు ఆంధ్రా బంద్ జయప్రదానికి యువజనుల తీవ్ర సమీకరణావశ్యకతనుగురించి వివరించారు.

సమావేశం ఆంధ్రా బంద్ జయప్రదానికి దోహదంగా ఆరోజు ఉప్పులూరు గ్రామంలో కూడా రైళ్లు, బస్సులు, దుకాణాలు, హోటళ్లు మూయించేందుకు, [illegible] నిలిపేందుకు అవసరమైన నిర్మాణ చర్యలు గైకొనేందుకు గ్రామంలోని యితర యువజన సంఘాలు రాజకీయ పార్టీలతో కలసి ఒక కార్యాచరణ కమిటీని వేసేందుకు పూనుకోవాలని నిర్ణయించారు అలానే ఆ రోజు అవసరమైన యితర కేంద్రాలకు కూడా ఆ గ్రామ వాలంటీరు దళాలను పంపాలని నిశ్చయించారు

ఆటల పోటీల కార్యక్రమం

ఆంధ్రలో దసరా, విద్యార్థి యువజనులకు ఒక ముఖ్య పండుగ. ఈ పండుగకు గ్రామంలో చెడుగుడు పోటీలు నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈపోటీలు 21,22,23 తేదీలలో వుంటాయి. 23వ తేదీ సాయంత్రం విజేతలకు బహుమతీ ప్రదానంతో కార్యక్రమం ముగిస్తుంది.

కర్నూలులో యల్.ఐ.సి. వారి బైఠాయింపు సమ్మె

కర్నూలు, అక్టోబరు 18

యల్. ఐ. సి ఫీల్డువర్కర్ల జాతీయ ఫెడరేషన్ నిర్ణయానుసారం కర్నూలులోని యల్.ఐ.సి. ఉద్యోగులు ఈనెల 15 న 11 గంటలనుండి 2 గంటలవరకు స్థానికబ్రాంచి కార్యాలయంముందు బైఠాయింపుసమ్మెచేశారు.

కరువుభత్యాన్ని జీవనవ్యయ సూచికతో జతపరచడం ఒకనెల జీతం బోనస్‌గా చెల్లించడం మొదలగు కోర్కెలకోసం వారు ఈ చర్య తీసుకొన్నారు.

గుడివాడలో ప్రదర్శనలు

గుడివాడ యల్.ఐ.సి. బ్రాంచి ఆఫీసుకు చెందిన డెవలప్‌మెంటుఆఫీసర్లు తమకోర్కెల కోసం ఈనెల 15వతేదీ బ్రాంచికార్యాలయం ముందు సభ జరిపి. తరువాత ప్రదర్శనలు జరిపారు,

కరువుభత్యం. బోనస్, ఉద్యోగుల పని ప్రోత్సాహక పథకం - ఈ మూడు సమస్యలపై తమ కోర్కెలను ఆమోదించేవరకు కార్యాచరణసంఘం రూపొందించిన ప్రత్యక్ష కార్యాచరణను అమలుజరుపుతూ వుంటామని ఉద్యోగులు జీవితభీమా కార్పొరేషన్ నిర్వాహకులకు హెచ్చరిక చేశారు.

విజయనగరంలో సభ

విజయనగరంలో యల్. ఐ. సి డెవలప్‌మెంటు ఆఫీసర్లు ఈనెల 12 న కోర్కెల దినం జరిపారు. ఈ సందర్భంలో శ్రీ పశుపతి సుబ్బారావు అధ్యక్షతన సభ జరిగింది. తమ కోర్కెలను వివరిస్తూ స్థానిక యల్. ఐ. సి. ఉద్యోగుల సంఘ ఉపాధ్యక్షులు శ్రీ టి. దేవిడ్ ప్రసంగించారు.

సిటీ ట్రేడ్ యూనియన్ నాయకులు, ఎన్.జి.వో సంఘఅధ్యక్షులు శ్రీ ప్రకాశరావు ఏజెంట్స్ అసోసియేషన్ డివిజనల్ కార్యదర్శి శ్రీ ఆర్. వి. సుబ్రహ్మణ్యం, శ్రీ చలపతి రావు ప్రసంగించారు,

అసోసియేషన్ కోశాధికారి శ్రీ టి. భీమారావు వందన సంమర్పణతో సభ ముగిసింది.

తునిలో

ఇన్సూరెన్స్ ఫీల్డ్ వర్కర్ల జాతీయ సమాఖ్య ఆదేశానుసారం యల్. ఐ. సి. నట్ ఆఫీసు డెవలప్‌మెంట్ ఆఫీసర్లు ఈనెల 15 న కోర్కెల దినం జరిపారు,

ఇల్లెందు గీత పనివారిపై దౌర్జన్యం

వర్ధన్నపేట, అక్టోబరు 18

వరంగల్ జిల్లా వర్ధన్నపేట బ్లాకు యిల్లెందు గీత పారిశ్రామికులపై వర్ధన్నపేట నివాశియగు తోటకూరి హనుమంతు, పునిక కొమురయ్య నాయకత్వాన 200 మంది తప్ప త్రాగి దాడిచేశారు. గ్రామశివారులో వున్న తాటిచెట్లు తమకు చెందుతాయని వాటిపై సర్వహక్కులు తమకు వుండాలని అంటూ 13 వ తేదీన కర్రలతో ఇల్లెందులో తాటిచెట్లపైవున్న లొట్టివగలదీసి నష్టంకల్గించారు కొన్ని తాటిచెట్ల గెలలుకూడ నరికారు.

తీరప్రాంత జిల్లాల యాదవసేవా సంఘం

భీమవరం, అక్టోబరు 14

కృష్ణ, పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి, విశాఖ, శ్రీకాకుళం జిలాల యాదవ సేవాసంఘ మహాజనసభ శ్రీ కటారి సత్యనారాయణరావు అధ్యక్షతను భీమవరం ఛాంబర్ ఆఫీసులో జరిగినది. సభను శ్రీ పిల్లి వెంకటావు. ప్రారంభించారు.

శేఖర్ ఫిలింస్‌వారు గొల్లభామ పేరుతో తీయుచున్న ఫిల్ము యాదవ కులాన్ని న్యూనత పరచునదై యున్నది గాన ఆ పేరుతోవిడుదల కాకుండగా నిలుపుదల చేయవలసినదిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను, సెన్సారుబోర్డు వారిని కోరుతూ తీర్మానించారు. కొన్ని పుస్తకములలో గొల్లవాడు అనుపదము వాడుచున్నారు. తిరుపతి వెంకటేశ్వర దేవస్థానము గోడలపై, గొల్లవాడు. గొల్లది అని వ్రాసియుండుటపై తమ విచారమును తెల్పుచు, అట్టి గొల్లపదమును ఉపయోగించకుండా యాదవరాజు శబ్దముతో ఉచ్చరించునటుల చేయవలసినదిగా తిరుపతి దేవాలయ ధర్మకర్తల సంఘం వారిని కూడా కోరారు,

శాఖా భేదములు లేకుండా వివాహములు జరిపించవలసినదిగా యాదవులను కోరారు.

సంఘాధ్యక్షులుగా శ్రీ కోటారి సత్యనారాయణరావును ఉపాధ్యక్షులుగా శ్రీ కందుల కృష్ణమూర్తి (పాలకొల్లు) శ్రీ సిల్లి వెంకట్రావు (కొత్తపల్లి) శ్రీ దేవనబోయిన చలపతి రావు (బందరు) శ్రీ బోడాపుల శ్రీరామమూర్తి (వేమవరప్పాడు) శ్రీ జోగా పోలయ్య (కాకినాడ) శ్రీ నైదానల అప్పన్న గార్లను ప్రధాన కార్యదర్శిగా శ్రీ కేశబోయిన భాగేశ్వరరావు (భీమవరం),సహాయ కార్యదర్శిగా శ్రీ యనమల సూర్యారావు (అలవిల్లి వెంకటనగరం) గారిని ఎన్నుకొన్నారు.

ఈ సంఘమును రాష్ట్ర యాదవ సేవా సంఘమునకు అనుబంధముగా చేర్చడమైనది.

కప్పలదొడ్డి చేనేత సొసైటీ లెక్కల్లో దిద్దుబాట్లు; నగదు పుస్తకంతో మేనేజర్ పరారీ

ఒక్కొక్కరు రు. 100లుతమవాటానుండి చెల్లించాలని చేనేత కాంగ్రెస్, సహకార శాఖాధికారులచే సభ్యులపై ఒత్తిడి

పెడన, అక్టోబరు 18

కృష్ణాజిల్లా - కప్పలదొడ్డి గ్రామ చేనేత సహకార సంఘం మేనేజరు. గ్రామ సర్పంచ్ అయిన బూసం శ్యామయ్యగారు మూడు వారాలుగా అంతులేకుండా వెళ్ళిపోయారు. చేనేత సొసైటీలో కొన్నివేల రూపాయలు తరిగినట్లుగా ప్రజలలో అలజడిగా వున్నట్లు ఇదివరకు ప్రకటించినవార్త మూలంగా 'విశాలాంధ్ర' పాఠకులకు విదితమే. క్యాష్ బుక్కులో-నిల్వ.మొత్తం దగ్గర సంతకం పెట్టుటలో మేనేజరుకు, ప్రెసిడెంట్‌కు తగాదా వచ్చినట్లుగా కూడా పాఠకులకు విదితమే. క్యాష్‌బుక్కులో సంతకం పెట్టుట దగ్గర మేనేజరూ, ప్రెసిడెంటూ కీచులాటా కొన్న తరువాత ప్రెసిడెంట్ ఆ క్యాష్ బుక్కునుతీసుకొనివెళ్ళి కో - ఆపరేటివ్ సబ్ రిజిష్ట్రారుకు అప్పగించి, తనిఖీ చేయమని కోరినట్లున్నూ, సబ్ రిజిష్ట్రారు ఆ క్యాష్ బుక్కును ఒక ఘరానా చేనేత కాంగ్రెస్ నాయకుని ద్వారా మేనేజరుకు అందజేసినట్లునూ, ఆ క్యాష్ బుక్కు తీసుకొని మేనేజరు పరారీ అయినట్లు తెలుస్తుంది.

నిల్వ మొత్తానికి ఇరవైవేల చేర్పు

సహకార సంవత్సరాంతం నాటికి అనగా యీ సంవత్సరం జూన్ ఆఖరునాటికి క్యాష్ నిల్వ మొత్తము రు. 9500 వున్నట్లుగాను, అదే మొత్తంకొత్తక్యాష్‌బుక్కులోకిప్రారంభ నిల్వగా, పెట్టినట్లున్నూ తరువాత ఆనంవత్సరాంతం నిల్వ రు. 9500 ముందున "2" అనే అంకెను చేర్చిఅక్షరాలలోకూడా రెండుచేర్చి రు 29500లు సంవత్సరాంతం నిల్వచూపుతున్నట్లు చెప్పుకొంటున్నారు. ఈమొత్తంగాక యింకావున్న క్యాష్‌తరుగును. కొనుగోలు, అడ్వాన్సు లెక్కలో వ్రాసి కమ్మిచేసుకుంటూ వస్తున్నట్లుగాకూడా చెప్పుకుంటున్నారు.

సహకార శాఖోద్యోగులు వచ్చి - తనిఖీ చేసినట్లు లెక్క పుస్తకాలు తీసుకొని వున్నట్లుగా కూడా చెప్పుతున్నారు,

చేనేత కాంగ్రెస్ నాయకుల 'సలహా'

సొసైటీలో తరుగుఎంత ? అనేది ఎవరూ చెప్పలేకుండా వున్నారు. రెండు రోజులు క్రిందట చేనేత కాంగ్రెస్ నాయకులు సొసైటీ సభ్యులను సమావేశపర్చి. "మీ సొసైటీలో జరిగిందేదో జరిగింది. ఇప్పుడు మీసొసైటీమూల పడిపోతే250 మంది సభ్యులకు పని చెప్పే దిక్కులేకుండా పోతుంది. మీరంతా చెట్టుకొకరు పుట్టకొకరు అయిపోతారు, ఇంత మందికి పని చూపించే మాస్టరు వీవరుమాత్రం ఎవరున్నారు ? మీ సొసైటీ నిలవాలంటే మీకు పని కలగాలంటే మీరు ఒక్కొక్కసభ్యుడు మీ మీ పేర ధనంనుండి రు. 100 లు త్యాగం చేయడానికి అంగీకరించాలి. అయితే అది మీ యింటినుండి తెచ్చి పెట్టనక్కరలేదు. సొసైటీలో మీ షేరుధనం ఖాతాలో ఖర్చు వ్రాస్తారు. మీకునంతకంలేక నిశానివేయాలి" అనిచెప్పారట.

అందుకు సభ్యులలో కొంతమందిసొసైటీలో తరుగు నికరం తేల్చండి. అందులో ఎవరు ఎంత వాడుకొన్నారో తేల్చండి ఎవరివల్ల యేయే ఖర్చులు చేయబడ్డాయో తేల్చండి. దానికి ఎవరు బాధ్యులో తేల్చిచెప్పితే 250 మంది సభ్యులు 25 వేలు రూపాయలు మాత్రమే కాదు..మరింత అవసరమైనా చెల్లించుతామన్నారట,అందుమీదట, అవన్నీ నిదానంగా మనమంతా కూర్చొని తేల్చుకుందాం. ముందు మీరుపై రు, 100ల ప్రతిపాదన అంగీకరించి. ఖర్చు పద్దువగ్గర సంతకాలు పెట్టండని కాంగ్రెసు నాయకులన్నారనీ. దానిమీదట సభ్యులు ఎవరివారిని వాళ్ళు వెళ్లిపోయారని తెలుస్తున్నది.

అసలు యీ సొసైటీలో యీ తరుగు యీనాటిది కాదని అనేక రూపాలలో తరుగుతూ వస్తున్నదని, ఒందరు తాలూకాలో అన్ని సొసైటీలకు లాభాలువచ్చిననాడు యీ సొసైటీ నష్టంలో నడిచింది. అప్పుడు కొంతమంది సభ్యులు పిటీషన్లు పెట్టారు. వాటన్నింటిని కో ఆపరేటివ్ అధికార్లు బుట్టదాఖలు చేశారు. పైగా పిటీషన్ దార్లను సొసైటీనుండి పంపడానికి తోడ్పడ్డారు.

చేనేతకాంగ్రెస్‌నాయకులు కో-ఆపరేటివు అధికార్లమీద వత్తిడితెచ్చి. తిమ్మిని బమ్మిని చేయాలని చూస్తున్నారని అప్పుడే కో-ఆపరేటివు అధికార్లుకూడా కొంతవరకు లొంగారని తెలుస్తున్నది.

'మీసొసైటీమీద ఒక్కసభ్యునివద్దనుండి కూడా పిటీషన్ రాలేదు. కాబట్టి, దానిమీద పెద్ద విచారణ అంటూ వుండద'ని కూడాచెప్పుతున్నట్లుగా తెలుస్తుంది. (వి. వి.)

జీపునడుపుతూ డ్రైవరు మరణం

విజయనగరం, అక్టోబరు 18

విజయనగరం గురప్ప ఆయిల్‌మిల్సుకు చెందిన జీపు డ్రైవరు. శ్రీ ముంగల ప్రసాద్ (కణపాల్) అనే ఆసామి అక్టోబరు 15 న ఉదయం ఇండియన్ బ్యాంకు ప్రక్కనందుగా జీపునడుపుతూ ఆపవేసి వెంటనే మరణించినాడు. పోలీసులు శవపరీక్షజరిపారు.

సైకిళ్ళ దొంగకు రెండునెలల జైలుశిక్ష

విజయనగరం, అక్టోబరు 18

విజయనగరం తాలూకా నెల్లిమర్ల వాస్తవ్యుడు చేపల రాములు అనే ఆసామి రాలీ సైకిల్ దొంగిలించిన నేరానికి జె. ఎస్. ఎం. కోర్టువారు రెండునెలలు కఠిన జైలుశిక్ష విధించారు. (వి. వి.)

నేటి ఆఫ్రికా

వి. కుద్రియావత్సేవ్

రకరకాల పరిణామాలు నేడు ఆఫ్రికా ఖండాన్ని కదలించివేస్తున్నాయి, మానవుడు ఇంతవరకూ అన్ని సాంఘిక - ఆర్థిక యుగాలలోనూ చవి చూచిన సంఘర్షణలన్నీ నేడు ఆఫ్రికాలో మనకు కనిపిస్తాయి. అయితే అవి ఆయా దేశాల ప్రత్యేక లక్షణాలను బట్టి మారుతూ వుంటున్నాయి. మొత్తంమీద ఆఫ్రికా జనాభాలో ఎక్కువ భాగం నేడు. పాతకాలపు సంకెళ్లను త్రెంచుకుని ఒక్కసారిగా 20 శతాబ్దంలోకి వైజ్ఞానికశాస్త్ర రంగంలోనూ, ఇంజనీరింగులోనూ, ఆర్థికసాంఘిక రంగంలోనూ ఎంతో పురోగమించిన 20 వ శతాబ్దంలోకి అడుగు పెడుతున్నారు. ఈ క్రమ విధానం కష్టభూయిష్ఠమైనదే అనుకోండి, అయినా అది సహజం, దానికి సాంఘిక తిరుగుబాట్లు త్యాగాలు అవసరం. ఏ పనీ తేలికగానూ, సాఫీగానూ జరగదు. అన్నీ చిక్కులతోనే కూడి వుంటాయి. మరో ముఖ్యవిషయం ఏమంటే ఈ మార్పులు దాదాపు ప్రతిరోజూ జరుగుతున్నాయి.

అందుచేత ప్రస్తుత దశలో ఆఫ్రికాలో జరిగే పరిణామానికి ఏదో ఒక సంఘటనయే కారణమని చెప్పజాలము. ఉదాహరణకు, నేడు ఆఫ్రికాలో జరిగే ప్రతిదానికీ నయా వలస విధానమే కారణమని చెప్పడానికి వీలులేదు. ఆయాదేశాలలోని వివిధ సాంఘిక ముఠాలకు మధ్యనుండే ఆంతరంగిక స్పర్థలు కూడా ఈ పరిణామాలకు కొంత కారణం. ఆర్థికంగా వెనుకబడి వుండడమే దానికంతకూ కారణమని చెప్పడంగూడా అసమంజసమేఅవుతుంది.ఆర్థికపురోగమనమార్గాలను నిర్ణయించడంలో రాజకీయనాయకులుకూడా ముఖ్యపాత్రను నిర్వహిస్తారు ఈ పైవిషయాలలో దేనిని ఎక్కువ అంచనావేసినా. లేక. తక్కువ అంచనావేసినా అది సమస్యలను తెచ్చిపెడుతుంది. సాధారణంగా సామ్రాజ్యవాదులు ఆ చిక్కు పరిస్థితిని తమ ప్రయోజనానికి వినియోగించుకుంటారు.

నూతన, స్వతంత్ర ఆఫ్రికా అవతరణ

ఆఫ్రికాలో జరిగే పరిణామాలు ఒక్కొక్కప్పుడు విషాదకరంగా వున్నప్పటికీ మనం నిరుత్సాహపడవలసిన పనిలేదు. ఒక నూతన స్వతంత్ర ఆఫ్రికాఉద్భవిస్తోంది అక్కడి జాతీయ విమోచనోద్యమం ఇప్పుడు ప్రథమ దశనుండి, రెండవ దశలోకి ప్రవేశిస్తోంది. మొదటి దశలో ఉద్యమ కర్తవ్యం రాజకీయ స్వాతంత్ర్యాన్ని సంపాదించడం. రెండవ దశలో, ఆర్థిక పరాధీనతనుండి ఒక్కొక్క రంగాన్నే విముక్తి గావించాలి. అయితే ఈ రెండూ వేరు వేరు విషయాలు కావు. మొదటి దశలోని కర్తవ్యాలు రెండవ దశలోని కర్తవ్యాలతో ముడిపడి వుంటాయి.

జాతీయ విమోచన విప్లవం రెండవ దశయొక్క ముఖ్యాంశం ఇదివరకు వలసలుగా వున్నవాటిలో కొత్త స్వతంత్ర ప్రభుత్వాలను నెలకొల్పడం. కొన్ని వలసలలో సామ్రాజ్య వాదులు వాటికి స్వాతంత్ర్యాన్ని యిస్తూనే, అక్కడి ప్రభుత్వ యంత్రాంగం ఎలా వుండాలో నిర్దేశిస్తున్నారు. వారి నయా వలస విధానానికి అనుకూలంగా వుండేటట్లు చూస్తున్నారు, ఉదాహరణకు, నైజీరియాలో బ్రిటిషు రాజనీతిజ్ఞులు చేసినదదే. అక్కడి నెలకొల్పబడిన నూతన స్వతంత్ర ప్రభుత్వం బ్రిటిషు ప్రభుత్వ నమూనాలోనే వుంది, కెన్యాలో న్యాయ స్థానాలు బ్రిటిషు న్యాయస్థానాలనే అనుకరిస్తున్నాయి. ఆఫ్రికన్ న్యాయ మూర్తులు బ్రిటిషు న్యాయమూర్తుల లాగనే తెల్ల విగ్గులను, నల్ల గౌనులను ధరిస్తున్నారు. విశ్వవిద్యాలయాల విషయంకూడా ఇదే. ఆఫ్రికన్ [illegible] పశ్చిమ యూరపియన్ విద్యా సంప్రదాయాలు కొనసాగింపబడుతున్నాయి. నైజీరియాలోనే బ్రిటిషువలస వాదులు తమ దేశంలో వుండే బూర్జువా డెమాక్రాటిక్ రాజకీయ పార్టీలలాంటి వాటిని ఏర్పాటు చేస్తున్నారు. వేరు వేరు ఆఫ్రికన్ జాతులమధ్యనుండే విభేదాలను, స్పర్థలను ఈ పార్టీలు మరింత ఎక్కువ చేస్తున్నాయి.

అసమానత

చాలా ఆఫ్రికన్ దేశాలలో, ప్రభుత్వాల నిర్మాణ స్వరూపలక్షణాలకూ జాతీయ ప్రజాస్వామిక విప్లవ నూతన దశయొక్క కర్తవ్యాలకూ మధ్య అసమానత బాగా కనిపిస్తోంది. సందర్భవశాత్తూ రాజ్యాంగ చట్టాలు వలసవాదులచేతనే తయారుచేయబడ్డాయి. ఆర్థికంగా వెనుకబడి వుండటం, జాతీయ భారీ పరిశ్రమలు లేకపోవడం, దేశాలు విశాలమై వుండటం, ఎక్కువ జనాభాఉండటం, విదేశీ పెట్టుబడుల పెత్తనమే ఇంకా కొనసాగుతూ వుండటం మొదలైనవన్నీ అందుకు కారణాలు కావచ్చు. అయినప్పటికీ అవి నిర్ణయాత్మకమైన అంశాలు కావు. నైజీరియానే తీసుకుంటే, దాని ఆర్థిక బలహీనతను తొలగించడానికి, ఆదేశపు ఆర్థిక వ్యవస్థ ఎవరి ప్రయోజనాలను తీర్చవలసి వుంటుందో అది ఏ మార్గంలో అభివృద్ధి చెందవలసి వుంటుందో నిర్ణయించడం అవసరం. ఇది రాజకీయ ప్రభుత్వం ఎవరి చేతుల్లో వుంది అనే దానిమీద, ఎలాంటి ప్రభుత్వం జాతీయ-ప్రజాస్వామిక విప్లవాన్ని మరింత ముందుకు తీసుకుపోగలుగుతుంది అనే దానిమీద ఆధారపడి వుంటుంది. నైజీరియా యొక్క అభివృద్ధి ఈ ప్రధాన సమస్య మీదనే ఆధారపడివుంది ఇప్పుడు నైజీరియాలో జరుగుతున్న పోరాటం, అక్కడి ప్రభుత్వ యంత్రాంగనిర్మాణ స్వరూపం ఎలా వుండాలనే విషయంకోసం, దేశపు ఆర్థికాభివృద్ధియొక్క ధోరణిని ఎవరు నిర్ణయించాలనే విషయం కోసం జరుగుతున్న పోరాటమే.

ప్రత్యేక పరిస్థితులు

వేరువేరు కొండజాతులుండటం. ఒక సమైక్యజాతి అనేది లేకపోవడంలాంటి ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో పెట్టుకోకుండా ఆఫ్రికన్ పరిస్థితులలో ఎలాంటి ప్రభుత్వ వ్యవస్థ వుండాలి అనే సమస్య పరిష్కరించబడజాలదు, ఒక జాతి ఏర్పరచే ప్రభుత్వంపై మరొక జాతివారు తిరుగుబాటులు చేయడం ఆశ్చర్యపడవలసిన సంగతేమీ కాదు

నైజీరియాలోని పరిణామాలు ఆఫ్రికన్ దేశాలలోనున్న ఈ కొండజాతి విభేదాలనే స్పష్టంగా తెల్పుతున్నాయి. నయావలస వాదులు ఈ తగాదాలను బాగా వినియోగించుకుంటున్నారు. ఆఫ్రికా దేశాలమధ్య ఐక్యత ఏర్పడకుండా చూస్తున్నారు. అయినప్పటికీ నయావలస వాదం నిర్మూలించబడినంతనే అన్నీ చక్కబడి పోతాయని అనుకోరాదు. వలసవాదులు ఆఫ్రికా ఖండంలో అడుగుపెట్టక పూర్వంనుంచే అక్కడ కొండజాతుల మధ్య స్పర్థలు, తగాదాలు వున్నాయి. వారు వచ్చిన తరువాత ఈ తగాదాలు మరింత యెక్కువ అయ్యాయి. ఎందుకంటే వారు వాటిని మరింత రెచ్చగొట్టసాగారు.

యూరోపియన్ ప్రభుత్వాలను నెలకొల్పడంతోపాటు, స్థానిక సంస్థల నిర్మాణంలోనున్న కొన్ని లక్షణాలను బాగా పరిశీలించడం అవసరం, పరిపాలక సిబ్బంది ఇతర సిబ్బందులను ఎన్నిక చేసేటప్పుడూ. వారికి శిక్షణ యివ్వడంలోనూ, జాతి సమస్యను అలక్ష్యం చేయరాదు. ప్రత్యేకించి ప్రాథమిక ప్రభుత్వ సంస్థల విషయంలో యిది గమనించడం చాలా ముఖ్యం. ఇలా చేయడం చాలా అవసరం. ఇలా చేయకపోతే ఆ జాతుల నాయకులు తమ జాతి ప్రయోజనాలకంటే దేశపు ప్రయోజనాలకే ప్రాముఖ్యత ఇవ్వవలసివుంటుందన్న మాట. నూతన పారిశ్రామిక కేంద్రాలను సహకార సంస్థలను నెలకొల్పే క్రమవిధానంలో వివిధ జాతులకు చెందిన ప్రతినిధులు ఒకరికొకరు సన్నిహితులౌతారు. సమిష్టి సాంఘిక ప్రయోజనాలను నెరవేర్చడంలో కలసి పనిచేయడం మూలంగా జాతుల మధ్యనుండే భేదాభిప్రాయాలు క్రమంగాతొలగిపోతాయి. ఈ విషయంలో జాతీయ ప్రజా సంస్థలు, సైన్యం పెద్ద పాత్రను నిర్వహిస్తాయి. సైన్యంలో కిరాయి సైనిక పద్ధతికి స్వస్తి చెప్పవలసి వుంటుంది. జాతీయ సైన్యం నిర్మింపబడాలి. సైన్యంలో చేరిపనిచేయడమనేదిస్వలాభంకోసమనేకాకుండా. ఆదిదేశానికి సేవ చేయడమని, ప్రతి పౌరునికి అది ఒక కర్తవ్యమని, గౌరవనీయమైన పని అనీ వారిలోభావం ఏర్పడాలి.

ఆర్థిక విమోచన దశ

ఫ్యూడల్ పెత్తందారుల కొండజాతి పెద్దల పద్ధతికి వ్యతిరేకంగా నిర్ణయాత్మకమైన పోరాటం సాగించకుండా, ఈ అంతరంగిక జాతి తగాదాలను నిర్మూలించడం సాధ్యం కాదు. ఆఫ్రికాలోని ప్రస్తుత జాతీయ దశలో జాతీయ ప్రజాస్వామిక విప్లవం నయావలస వాదంతో ముడిపడివుంది. ఎందుచేతనంటే హక్కులను వదులు కొనదల్చుకోలేదు.

ఈ ప్రధాన సమస్యను పరిష్కరించడానికి రాజీవిధానం అవలంబించ బడుతూ వుండటం మూలంగానే అభ్యుదయ శక్తులు ఓటమిని ఎదుర్కోవలసి వస్తోంది. దీనికి ఉదాహరణగా ఘానాను పేర్కొనవచ్చు. అక్కడ కొండజాతుల నాయకత్వ వ్యవస్థ మరొక రూపంలో తన ఉనికిని నిలబెట్టుకుంది. అక్కడ జరిగిన సైనిక తిరుగుబాటులో ఆ నాయకత్వమూ ముఖ్యమైన పాత్రవహించి తన అభివృద్ధి నిరోధక స్థానాన్ని నిలబెట్టుకుంది. అదే సమయంలో గినియాలో కొండ జాతి నాయక వ్యవస్థ స్వాతంత్ర్య ప్రకటనకు ముందే నిర్మూలించబడటంవల్ల అక్కడ సాంఘిక - ఆర్థిక సంస్కరణలను కొనసాగించడం మరింత తేలిక అయింది.

పై విషయాలన్నీ కూడా ఒక విషయాన్ని తెలియజేస్తున్నాయి, ఆఫ్రికా దేశాలలో అధిక సంఖ్యాకుల ప్రధాన ప్రయోజనాలకు అనుగుణమైన ప్రభుత్వం నెలకొల్పబడినప్పుడే, ఆ దేశాల ఆర్థిక అలసత్వాన్ని నిర్మూలించగల్గుతాము ఆఫ్రికాలో జరుగుతున్న పరిణామాల ప్రస్తుత దశ. నూతన ప్రభుత్వ వ్యవస్థను నెలకొల్పడం కోసం జరిగే పోరాటం దశ అని చెప్పవచ్చు. వివిధ కొండజాతులు వాటి మధ్య స్పర్థలున్న పరిస్థితులలోనే ఈ పోరాటం కొనసాగుతోంది. జాతీయ ప్రజాస్వామిక విప్లవపు రెండవ దశ అయిన ఆర్థిక విమోచనకోసం జరుగుతున్న పోరాటమే.

లేఖలు

ఈడూరు సర్పంచ్ హత్యాయత్నం వార్తపై 'జనశక్తి' అబద్ధాలు

మహాశయా !

30-9-66వ తేదీన "ఈడూరు సర్పంచ్‌పై "హత్యాప్రయత్నం" అనే వార్త విశాలాంధ్రలో పడింది. దానిపై తాలూకా మార్క్సిస్టు కమ్యూనిస్టుకమిటీ కార్యదర్శి శ్రీ డి. సోలమన్‌రాజు "విశాలాంధ్ర తప్పుడువార్తలు" అంటూ ఒక లేఖను 'జనశక్తి'లో వ్రాశారు. "జనశక్తి"లో అత్తిలి రివిజనిస్టు శ్రీ బోణం కృష్ణమూర్తి వగైరాలు కాకర్ల రాధాకృష్ణమూర్తిని తీసుకొని 23-9-66వ తేదీన పాలూరుగ్రామం కుంపటవారి పాలెం వచ్చి అచ్చట పెద్దలతో "మనమంతా కాపులం కాబట్టి ఈ విషయం మీకు చెబుతున్నాం. మీ వూరు సర్పంచ్ మన సర్పంచ్ కాకర్ల రాధాకృష్ణను హత్యచేయుటకు గుత్తి రాములును ప్రోత్సహించారు. కాబట్టి ఈవిషయం తెల్పమని చెప్పగా 24-9-66 తేదీన గ్రామ పంచాయతీ భవనమందు సుమారు 50 మంది గ్రామస్థులు, పెద్దలు సర్పంచ్ సమక్షములో సాక్షులను పిలిపించి యదార్థములు తెలుసుకొనగా గుత్తి రాములు, ఈడూరు సర్పంచ్ తిట్టుకొన్నమాట యదార్థమని, మిగిలిన విషయాలు అబద్ధాలని సాక్షులు చెప్పారు, ఈ యదార్థ విషయాలను శ్రీ బోణం కృష్ణమూర్తి వగైరాలకు పెద్దలు తెలియజేసి యున్నారు" అని వ్రాశారు. 'జనశక్తి' దాని వివేకి శ్రీ సోలమన్ రాజుల ప్రకటనఇది. దానిలోనే 23-10-66వ తేదీన శ్రీ బోణం కృష్ణమూర్తి వగైరాలు పెద్దల ఎదుట తగవుపెట్టినట్లుగా అంగీకరించారు. మరునాడు 24-10-66వ తేదీన పాలూరు సర్పంచ్ అల్లూరి వెంకటసుబ్బరాజు సమక్షములో సాక్షులు ఏదో చెప్పారట. తగవు పెట్టింది పెద్దలఎదుట (23 10 66) సర్పంచ్ సమక్షములో విచారణ జరిపించారట. (24-10-66) ఇది ఎలా ఉందంటే ముద్దాయే జడ్జిగా వ్యవహరించడము. పాలూరు సర్పంచ్‌పైననే నేరారోపణ. ఆయనే విచారణ జరిపించారట. విచారణలో ఫిర్యాది ఈడూరు సర్పంచ్‌గాని, అత్తిలి బోణం కృష్ణమూర్తి వగైరాలు ఎవరైనా ఉన్నారా? పైగా బోణం కృష్ణమూర్తి వగైరాలు వారు కాపు, సర్పంచ్. కాపు వగైరా కులతత్వమును రెచ్చగొట్టారని వ్రాయటం, కామెర్లరోగికి ప్రపంచమంతా పచ్చగా కనబడినట్లు, శ్రీ సోలమన్ మన సత్యమును ఇది తెలియజేస్తున్నది తప్ప మరొకటి కాదు.

1. ఏమైనప్పటికీ మార్క్సిస్టుకమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగాని మరొకరుగాని పాలూరు గ్రామ పెద్దల ఎదుటకు వచ్చి జరిగిన సంఘటనపై 'విశాలాంధ్ర' 'జనశక్తి' ప్రకటనలను చదివి వినిపిద్దాము. ఏది యదార్థము అనే విషయములో ఆ గ్రామస్థుల తీర్పుకు నిలబడతారా ?

2. అసలు రాధాకృష్ణమూర్తి సైకిలు తగిలితే గొడవ జరిగిందనే 'జనశక్తి' వ్రాతలు నిజమో లేక విశాలాంధ్రలో వ్రాసినట్లుగా చంపమని పురమాయించుటవలన అవు చేనారో తెలియాలంటే వద్దిపర్తి చెంచులు, వెలగా వెంకన్నలసాక్ష్యమునకు నిలబడతారా?

3. బోణం కృష్ణమూర్తి వగైరాలుపాలూరు వచ్చినపుడు సాక్షులు ఏమి చెప్పారో అక్కడ ఉన్న పెద్దలందరు చెప్పినదానికి అంగీకరిస్తారా? ఈ విధంగా విశాలాంధ్ర, జనశక్తి ప్రకటనలనిజానిజాలపై పాలూరు పెద్దలతీర్పుకు మార్క్సిస్టు కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి నిలబడతారా ? నిలబడితే పాలూరు పెద్దలు తేదీ నిర్ణయించి వారు ఇచ్చిన తీర్పును విశాలాంధ్ర, జనశక్తి పత్రికలలో సమిష్టి ప్రకటనను అంగీకరిస్తారా ? వారు దానికి అంగీకరించకపోతే "మొత్తం రాష్ట్రమంతా మమ్ము నమ్ముతారుగదా, పాలూరు చుట్టు ప్రక్కల గ్రామాలవారు నమ్మకపోతేనేమి ? మొత్తం మా అనుయాయులకు మూఢత్వముగా ఉండవచ్చునుకదా" అనేది వారి ఆలోచనగా అనుకోవలసి ఉంటుంది.

ఇట్లు,
భూపతిరాజు సుబ్బరాజు, కార్యదర్శి
తాలూకా కమ్యూనిస్టు సమితి, తణుకు

చెంగాళమ్మ ధర్మశాలకు కొత్త కమిటీ అవశ్యకత

మహాశయా,

నెల్లూరుజిల్లా సూళ్ళూరుపేటలో శ్రీ చెంగాళమ్మ దేవాలయమునకు సంబంధించి సత్రశాల (సత్రము) నిర్మించుటకుగాను ధర్మశాల నిర్వాహణ కమిటీ పేరుతో ఒక కమిటీ యేర్పడి యున్నది. ఈ కమిటీని శ్రీ చెంగాళమ్మ దేవస్థానము మేనేజింగుట్రస్టీ శ్రీ కాళింగి రాజగోపాలశెట్టి స్థాపించినారు. వారే ఈ కమిటీకి కార్యదర్శిగా కూడా ఉంటున్నారు. ఈ కమిటీ పేరుతో శ్రీ రాజగోపాలశెట్టి ఈ ప్రాంతములోనేగాక మద్రాసు తదితర ప్రాంతాలలోకూడ ధర్మశాలలను నిర్మించుటకు కావలసిన మొత్తమును వసూలుచేసికొనికూడ సదరు కట్టడమును పూర్తిచేయక సదరు పోనే ఆపివేసి మిగిలిన మొత్తముబ్బును తాను సొంతకాస్వాహా చేసినారని ప్రజలలో అలజడిగా వున్నది. పై ధర్మశాల కట్టడమును మధ్యలో ఆపివేసి నందున శిథిలమయ్యే ప్రమాదము యేర్పడియున్నది.

రాజగోపాలశెట్టి ఈ మధ్యకాలములో దేవాలయమునకు సంబంధించిన సూళ్ళూరుపేట బజారులోని రెండు కొట్లను (అంగళ్ళను) శ్రీ మహాలింగశేఖర్ అను వ్యక్తికి 13వేల రూపాయలకు విక్రయించి సొమ్మును స్వంతానికి వాడుకొన్నారు. కాన ప్రస్తుత ధర్మశాల కనస్ట్రక్షన్ కమిటీని వెంటనే రద్దుచేసి వీరు వసూలుచేసిన విరాళాలపై జమా-ఖర్చులపై విచారణ జరిపించి ఆగిపోయివున్న ధర్మశాల కట్టడమును పూర్తి చేయుటకు ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుతో కూడిన ఒక నూతన కనస్ట్రక్షన్ కమిటీని నియమించాలని పై రెండుకొట్లను (అంగళ్ళను) వెంటనే స్వాధీనము చేసుకొనవలెననిఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఎండోమెంటు బోర్డువారిని కోరుచున్నాము.

ఇట్లు,
డి. టి. పరమానందం, కార్యదర్శి,
సూళ్ళూరుపేట తాలూకా కార్యదర్శి,
కమ్యూనిస్టు సమితి.

వ్యవసాయ వస్తువుల ధరలు

విజయవాడ, అక్టోబరు 19

విజయవాడ రీజినల్ అసిస్టెంటు మార్కెటింగ్ డైరెక్టరు అక్టోబరు 18 వ తేదీ నాడు అందజేసిన వుత్పత్తిదారులనుండికొనుగోలు చేయబోవు ధరలు (ఒక క్వింటాల్ 100 కిలో గ్రాములు లేక 220½ పౌనులు.)

ధాన్యం		75 కి.	100 కి.
నంబర్లు	విజయవాడ రు.	35-25	47-00
,,	కాకినాడ	35-25	47-00
,,	చిత్తూరు	35-25	47-00
అక్కుళ్ళు	విజయవాడ	29-25	39-00
,,	తాడేపల్లిగూడెం	29-25	39-00
,,	కాకినాడ	29-25	39-00
,,	ఆముదాల వలస	—	—
సన్న కృష్ణకాటుకలు :			
	తాడేపల్లిగూడెం	32-25	43-00
సన్నాలు :	ఆముదాలవలస	—	—
మొలకొలుకులు	నెల్లూరు	35-25	47-00

మిల్లు బియ్యం		100 కి
నంబర్లు :	విజయవాడ	76-02
,,	కాకినాడ	76-02
అక్కుళ్ళు :	విజయవాడ	63-45
,,	తాడేపల్లి గూడెం	63-45
,,	కాకినాడ	63-45
,,	ఆముదాల వలస	—
సన్న కృష్ణకాటుకలు :		
,,	తాడేపల్లి గూడెం :	69-73
నంబర్లు :	చిత్తూరు	76-02
సన్నాలు :	ఆముదాలవలస	—
మొలకొలుకులు :	నెల్లూరు	76-02

వేరుశనగ		
కాయలు	విజయవాడ	130-43
,,	నంద్యాల	182-55
,,	ఆదోని	155-62
,,	విజయనగరం	111-10
పప్పు	విజయవాడ	200-00
,,	నంద్యాల	245-80
,,	ఆదోని	193-50
,,	విజయనగరం	198-33
నూనె	విజయవాడ	410-50
,,	నంద్యాల	405-50
,,	ఆదోని	415-00
,,	విజయనగరం	395-56

అపరాలు		పాతవి కొత్తవి
కందులు :	విజయవాడ	78-00
,,	గుంటూరు	82-00
,,	ఆముదాలవలస	100-00
మినుములు :	విజయవాడ	133-00
,,	గుంటూరు	124-00
,,	ఆముదాలవలస	107-00
పెసలు	విజయవాడ	106-00
,,	గుంటూరు	108-00
,,	ఆముదాలవలస	100-00
శనగలు :	విజయవాడ	150-00

జొన్నలు		
అనంతపురం	తెల్లవి	61-21
నంద్యాల	పచ్చవి	50-11

బెల్లం		
తాడేపల్లిగూడెం	మొదటిరకం	99-00
,,	మూడవరకం	85-00
తుని	మొదటిరకం	100-00
,,	మూడవరకం	80-00
చిత్తూరు	మొదటి రకం	88-50
హిందూపురంలో	మొదటిరకం	116-00
	మూడవరకం	95-00
అనకాపల్లి	మొదటిరకం	95 50
	మూడవరకం	81-50

జీడిపప్పు		
వేటపాలెం	అమెరికన్ రకం	1136-36
,,	దేశవాళీ	1045-45
,,	బద్దలు	938-36
,,	ముక్కలు	730-90

మిర్చి	
జి. 2. ఒకటవ రకం గుంటూరు	750-00
జి. రెండు రకం ,,	740-00
జి. వ2 రకం 2. వర్ల	500-00

నెయ్యి	వల్నాడు	దేశవాళీ
గుంటూరులో	770-00	780-00

కొబ్బరికాయలు		
(వెయ్యింటికి ధరలు)	కొత్తవి :	పాతవి
విజయవాడ :	320-00	375-00
రాజమండ్రి :	325-00	375-00
పాలకొల్లు :	265-00	340-00

పసుపు		
దుగ్గిరాలలో :	కొమ్ములు	111-50
,,	[illegible]	125-50
,,	దుంపలు	101-00

విద్యార్థుల అలజడులపై ప్రధాన మంత్రి ధోరణి

విద్యార్థులలోని అశాంతిని ప్రతిపక్షాలు వినియోగించుకొంటున్నాయని ఆరోపణ

న్యూఢిల్లీ, అక్టోబరు 18

విద్యార్థులలో అల్లకల్లోలాన్ని సృష్టించినది ప్రతిపక్షాలు కాకపోయినా, రానున్న ఎన్నికల దృష్ట్యా, విద్యార్థి లోకంలోని అలజడులను ప్రతిపక్షాలు వినియోగించుకొంటున్నవని ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధి నేడు వైస్-ఛాన్సలర్లతో జరిపిన చర్చలలో పేర్కొన్నట్టు తెలుస్తున్నది.

విద్యార్థుల సమస్యలతో సంబంధంలేని, కొన్ని హింసాచర్యలు జరిగినవనికూడా ఆమె పేర్కొన్నారట.

దేశంలోని ప్రస్తుత ఆర్థిక పరిస్థితి దృష్ట్యా విద్యార్థుల సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించడం సాధ్యంకాదని, అయితే హాస్టల్ వసతులను మెరుగు ఏర్పరచవలసిన అవసరం మాత్రం వున్నదని ఆమె అన్నారు.

విద్యార్థులకు నిర్బంధ జాతీయ సేవాపథకం

దేశార్థికాభివృద్ధి పథకంలో భాగంగా విద్యార్థులకు ఏదో ఒకరకమైన నిర్బంధ జాతీయసేవాపథకం రూపొందించి, అమలు జరపాలని ప్రధానమంత్రి సూచించారు.

విద్యాలయాలలో పోలీసు జోక్యానికి తాను వ్యతిరేకిననీ, విద్యాలయాలకు ఇవ్వబడుతున్న స్వపరిపాలనాధికారాలకంటె హెచ్చు అధికారాలు అవసరమని తాను భావిస్తున్నాననీ, అయితే హింసాచర్యలు ప్రారంభమైన సందర్భంలో పోలీసులను విద్యాలయాలకు దూరంగా వుంచడం కొంచెం కష్టం కాగలదని ఆమె అన్నారు.

విశ్వవిద్యాలయాల్లో ప్రభుత్వ జోక్యం కూడదని ప్రధాని

పోలీసు జోక్యంపై ద్వంద్వ వైఖరి

న్యూఢిల్లీ, అక్టోబరు 18

ఎలాంటి ప్రభుత్వ జోక్యం లేకుండా విశ్వ విద్యాలయాలకు పూర్తి సర్వసత్తాక ప్రతిపత్తి వుండాలనేదే తన అభిమతమని ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ నేడిక్కడ అన్నారు.

పోలీసులు విశ్వ విద్యాలయ ఆవరణలో ప్రవేశించ రాదంటూనే, శాంతి భద్రతల సమస్య ఏదైనా ఏర్పడితే దానిని శాంతి భద్రతల సమస్యగానే పరిష్కరించాలని ఆమె అన్నారు.

క్రైస్తవ మత మహాసభలకు హాజరవడానికై ఇక్కడికి వచ్చిన కాథలిక్ మత గురువుల గౌరవార్థం జరిగిన సభలో ప్రధాని ప్రసంగిస్తూ పై విధంగా అన్నారు.

దేశంలో వర్షాభావంవల్ల ఏర్పడిన ఆహార క్లిష్ట పరిస్థితిని ఆమె ప్రస్తావించి క్షామ ప్రాంతంలోని ప్రజానీకం కటువు పరిస్థితిని ఎదుర్కొనడంలో చూపుతున్న ధైర్య సాహసాలు తనను ముగ్ధురాలిని చేశాయన్నారు.

ఈ సభకు ఢిల్లీ మేయర్ నూరుద్దీన్ అహమ్మద్ అధ్యక్షత వహించారు.

కళాశాలలన్నింటిలోను 'డీన్ల'ను నియమించాలని ప్రధాని సూచన

దేశంలోని అన్ని కళాశాలలలోనూ డీన్లను నియమించాలనీ, విద్యార్థుల కష్ట సుఖాలను తెలుసుకోవడం, క్రమశిక్షణను కాపాడడం వారి ప్రధాన బాధ్యతగా వుండాలని ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి నేడిక్కడ సూచించారు.

నేటి ఉదయం తనను కలుసుకొన్న వంద మంది విద్యార్థుల బృందాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ ఆమె పై విధంగా అన్నారు.

ప్రత్యేకించి, విశ్వ విద్యాలయ స్థాయిలో విద్యార్థుల అశాంతి పరిష్కరించాలనీ, విద్యార్థులకూ, ఉపాధ్యాయులకూ మధ్య అనుసంధానం ఉండడం సైతం అవసరమని ఆమె అన్నారు.

విద్యార్థుల కష్టాలనుగురించి ప్రస్తావించి విద్యార్థులు పేర్కొన్న కొన్ని సమస్యలు వాస్తవమైనవేననీ, అయితే అవి యిటీవల ఉత్పన్నమైనవి కావని అత్యంతదీర్ఘకాలంగా ఉన్నవేననీ ఆమె అన్నారు.

ప్రభుత్వం విద్యార్థుల కష్టాలను తీరుస్తుందనీ, అయితే వారు క్రమశిక్షణతోనూ, ఓర్పుతోను వుండాలని ఆమె అన్నారు.

వీధిలో పోతున్న వ్యక్తిని టెలిఫోన్ వద్దకు తెచ్చే యంత్రం

టోకియో, అక్టోబరు 18

అగ్గిపెట్టె ప్రమాణంలో కొత్త రకం జేబు కమ్యూనికేషన్ యంత్రాన్ని ఉత్పత్తి చేయుడానికి జపాను ప్రభుత్వం నిప్పన్ టెలిగ్రాఫ్, టెలిఫోన్ పబ్లిక్ కార్పొరేషన్‌కు లైసెన్సు మంజూరు చేసింది.

ఈ కొత్తరకం యంత్రాన్ని జేబులో పెట్టుకొని, ప్రయాణం చేస్తున్న వ్యక్తిని టెలిఫోన్ వద్దకు పిలవవచ్చు. ఈ యంత్రంలో గంటను ఏర్పాటుచేశారు. ఈ యంత్రాన్ని జేబులో కలిగివున్న వ్యక్తితో మాట్లాడదలచుకొంటే, ఈ గంట గణగణ మోగుతుంది. అప్పుడు ఆ వ్యక్తి టెలిఫోన్ దగ్గరకు వెళ్ళవచ్చునట.

పది కిలోమీటర్ల దూరంలోవున్న వ్యక్తిని ఈయంత్రం సహాయంతో ఎవరైనా టెలిఫోన్ దగ్గరకు పిలువ[illegible]

'సరిహద్దు సమస్యను తిరగతోడడం అనుచితం'

కేరళకు చెందిన పార్లమెంటు సభ్యుల విమర్శ

తిరువనంతపురం, అక్టోబరు 18

కేరళ-మైసూరు సరిహద్దు సమస్యను తిరగతోడడంపట్ల పార్లమెంటులో కేరళకు చెందిన అన్ని పక్షాల సభ్యులు నేడు తమ ప్రాతికూల్యాన్ని ప్రకటించారు.

ఈ పార్లమెంటు సభ్యుల సమావేశాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

కేరళలో ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వం లేని సమయంలో ఈ సమస్య తిరగతోడడం మరింత ఆక్షేపణీయకరమని ఈ సమావేశం అభిప్రాయపడింది.

ఏకవ్యక్తి కమిషన్ నియామకం పట్ల విద్యార్థుల నిరసన

కేరళ - మైసూరు సరిహద్దు సమస్యపై

అలెప్పీ, అక్టోబరు 18

కేరళ - మైసూరు సరిహద్దు సమస్యను ఏకవ్యక్తి కమిషన్‌కు ఒప్పగించాలని కాంగ్రెసు కార్యవర్గం నిర్ణయించినందుకు నిరసనగా తిరువల్ల కళాశాలలోని సుమారు 1000 మంది విద్యార్థులు నేడు కళాశాలకు వెళ్ళడం మానివేసి ప్రదర్శన జరిపారు.

సుమారు 200 మంది తరవూరు హైస్కూలు విద్యార్థులుకూడా ఆ ప్రదర్శనలో పాల్గొన్నారు.

సీట్ల పంపకంపై శ్రీ నంబూద్రిపాద్ ప్రకటన

శ్రీ అచ్యుతమీనన్ విమర్శ

తిరువనంతపురం, అక్టోబరు 18

కేరళలో ఐక్య సంఘటనలోని వివిధ పక్షాలమధ్య సీట్ల పంపిణీ ఒప్పందం విషయంలో మార్క్సిస్టు కమ్యూనిస్టుపార్టీ ఐక్య సంఘటనలోని ఇతరపక్షాలకు కొన్ని సీట్లను త్యాగం చేసినట్టు శ్రీ నంబూద్రిపాద్ ప్రకటించడం అసందర్భం. అనుచితం అని విమర్శిస్తూ కేరళ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ అచ్యుతమీనన్ నేడొక ప్రకటన చేశారు.

శ్రీ నంబూద్రిపాద్ ప్రకటన ఐక్యతా సాధనకు దోహద మిచ్చేదిగాలేదని ఆయన విమర్శించారు.

ఎర్నాకుళంలో జరిగిన ఐక్యసంఘటన సమావేశంలో అగ్రవాది అయిన తన పార్టీ చిన్న పార్టీలకు కొన్నిసీట్లు దానం చేసినట్లుగా శ్రీ నంబూద్రిపాద్ చిత్రించడం అనుచితమని శ్రీ అచ్యుతమీనన్ ఆక్షేపించారు.

శ్రీ నంబూద్రిపాద్ ప్రకటనను సంయుక్త సోషలిస్టుపార్టీ నాయకులు శ్రీ దామోదరన్ పొట్టి, లీగ్ నాయకులు మహమ్మద్ కోయా ఇంతకు మునుపే విమర్శించారు.

శ్రీ అచ్యుతమీనన్ తమ ప్రకటనలో ఇంకా ఇలా అన్నారు:

"శ్రీ నంబూద్రిపాద్ ధోరణి అహంభావంతో తమ పార్టీ ఆధిక్య ధోరణితో కూడుకొని ఉన్నది.

తమ పార్టీ ఎంతో ఉదారంగా ఉన్నదని శ్రీ నంబూద్రిపాద్ అన్నప్పటికీ, తమ పార్టీకి సంబంధించినంతవరకు వారు అటువంటి ధోరణి ఏమీ చూపలేదని అన్నారు.

సంభాషణల సందర్భంలో అన్ని పార్టీలు యిచ్చిపుచ్చుకొనే సహకార ధోరణితోనే వ్యవహరించుచున్నాయనీ, కాంగ్రెసును ఓడించి ప్రతిపక్షప్రభుత్వాన్ని ఏర్పరచాలనే ఉమ్మడి ప్రయోజనం దృష్ట్యా త్యాగాలు చేయడానికి సంసిద్ధపడినాయనీ అన్నారు.

శ్రీ నంబూద్రిపాద్ ప్రకటన యితర పార్టీలపట్ల తృణీకార భావంతో ఉన్నదని అన్నారు.

క్విలన్‌జిల్లాలో మార్క్సిస్టులకు ఒక్కసీటు యివ్వడానికి అంగీకరించేవరకు మలబారులో తమ పార్టీకి (కమ్యూనిస్టు పార్టీకి) ఒక్క సీటు కూడా కేటాయించడానికి మార్క్సిస్టులు వ్యతిరేకించారనీ, త్రిచూర్‌నుండి మంజేశ్వర్ వరకుగల రాష్ట్రంలోని సగభాగంలో తమకు ఒక్క సీటుకూడా యివ్వడానికి మార్క్సిస్టులు సంసిద్ధం కాలేదన్నారు.

తాము క్రితంసారి గెల్చిన అన్నిసీట్లేగాక, తాము రెండవ వారుగా వచ్చిన సీట్లు కూడా తమకు ఇవ్వాలని మార్క్సిస్టులుకోరారు, కాని గత ఎన్నికలలో తాము గెల్చొందినవి తమ ఓట్లతో మాత్రమే కాక, ఎస్.ఎస్.పి, ముస్లింలీగ్ ఓట్లు కూడా తమకు వచ్చిపడినవన్న సంగతిని వారు మరచిపోతున్నారు. తమ స్వంత బలిమివల్లనే నిలబడి గతంలో సీటన్నీ తాము గెల్చినట్లు భావించితే, ఈసారి ఎవరి తోడూ లేకుండా, సర్దుబాట్లు చేసుకోకుండా వారు తామొక్కరే ఎన్నికల రంగంలో ఎందుకు దిగరాదు?

పార్టీలమధ్య సమావేశాలు ఎన్నిటున్నప్పటికీ, వాటిని బహిరంగంగా చర్చించ రాదన్నదే తమ అభిమతమనీ, కాని శ్రీ నంబూద్రిపాద్ అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు.

సీట్లపంపకంపై ప్రస్తుతం రేగుతున్న వాగ్వాదానికి శ్రీ నంబూద్రిపాద్ బాధ్యుడని శ్రీ అచ్యుతమీనన్ విమర్శించారు.

కేరళ ముస్లింలీగ్ కార్యదర్శి కోయా ప్రకటన

తిరువనంతపురం, అక్టోబరు 18

కేరళలో కాంగ్రెసు వ్యతిరేక ఐక్య సంఘటనలోని ఏడు పార్టీల మధ్య యింకా 8 స్థానాల పంపకంవిషయం తేలవలసి ఉందనీ, అప్పుడే పూర్తి పరిస్థితి తెలియగలదనీ కేరళ ముస్లింలీగ్ ప్రధాన కార్యదర్శి శ్రీ సి. హెచ్. మహమ్మద్ కోయా నేడు ఇక్కడ పత్రికలవారితో చెప్పారు,

ఇంతవరకూ 125 సీట్ల పంపకం విషయంలో జరిగిన ఒప్పందంలో ఎట్టి మార్పు ఉండబోదని ఆయన చెప్పారు.

పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వ గుత్త ధాన్య సేకరణకు స్వస్తి

కలకత్తా, అక్టోబరు 18

పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్ర ప్రభుత్వమే గుత్త ధాన్య సేకరణ జరుపుతున్న ప్రస్తుత విధానానికి స్వస్తిచెప్పి, ఆహార కార్పొరేషను అనుమతిస్తూ రాష్ట్ర మంత్రివర్గం నేడు తీర్మానించింది.

గుత్త ధాన్యసేకరణకు అవసరమైన ద్రవ్యం సమకూర్చడానికి రాష్ట్ర ప్రభుత్వానికిగల పరిమితమైన వనరుల దృష్ట్యానే ఈనిర్ణయం తీసికొనవలసి వచ్చినదని అధికార ప్రతినిధి నేడిక్కడ చెప్పారు.

బహిరంగ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు చేయడం ద్వారానూ, బియ్యం మిల్లులపై నూటికి 50 వంతులు లెవీ విధించడం ద్వారానూ ఆహార కార్పొరేషన్ ధాన్య సేకరణ జరుపుతుందని చెప్పారు.

ప్రభుత్వానికి కొనుగోలు ఏజెంట్లుగా గత సంవత్సరం పనిచేసిన సహకార సంస్థలు సైతం ఈ ధాన్య సేకరణకు తోడ్పడతాయన్నారు,

దీని విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఆహార కార్పొరేషన్‌కూమధ్య త్వరలో వివరమైన ఒప్పందం జరగగలదని అన్నారు.

చట్టబద్ధరేషనింగ్ అమలులోలేని ప్రాంతాలల్లో ధరల కంట్రోలు ఉత్తర్వును సైతం రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది.

'విశాల నేత్రాల'కు అకాడమీ బహుమతి

హైదరాబాద్, అక్టోబరు 18

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఆధునిక సాహిత్య బహుమతుల పథకం క్రింద 1966 సంవత్సరానికి ఈ క్రింది రెండు గ్రంథాలకు రు. 1116 చొప్పున నేడు బహుమతులు ప్రకటించారు.

ఆధునిక కవిత; ఆంధ్రపురాణం రెండవ సంపుటి-రచన : మధునా పంతుల సత్యనారాయణ శాస్త్రి, నవల: విశాలనేత్రాలు-రచన; పిలకా గణపతిశాస్త్రి.

చిన్న కథకు బహుమతిని త్వరలో ప్రకటిస్తారు.

కృష్ణమీనన్ పోటీచేసే నియోజకవర్గం గురించిన వదంతుల ఖండన

అలహాబాద్, అక్టోబరు 18

మద్రాసునుంచి తాను లోకసభకు పోటీ చేయవచ్చునని కొన్ని పత్రికలలో పడిన వార్తను మాజీ రక్షణమంత్రి శ్రీ కృష్ణమీనన్ నేడిక్కడ ఖండించారు.

కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ కామరాజ్ తనను మద్రాసు నుంచి పోటీ చేయమని సలహా చెప్పినట్టు వెలువడిన వార్తలు కూడా నిజం కాదని ఆయన అన్నారు,

ఉత్తర బొంబాయి నియోజక వర్గం నుంచే తాను పోటీ చేయదలచానని శ్రీ మీనన్ వక్కాణించారు,

అలీన రాజ్యత్రయ సమావేశ సన్నాహం

ఈ సభ అంతర్జాతీయ సంబంధాలను సైతం మెరుగుపరచగలదని ఢిల్లీవర్గాల ఆశాభావం

న్యూఢిల్లీ, అక్టోబరు 18

ఢిల్లీలో 21వతేదీన జరిగే తటస్థరాజ్యత్రయశిఖరాగ్ర సభవల్ల సత్ఫలితాలు ఒనగూడగలవనీ అంతర్జాతీయ సంబంధాలు మెరుగు కావటానికి, ఈమహాసభ దోహదం చేయగలదని భారత ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. ఈ మహాసభవల్ల ఇందులో పాల్గొంటున్న భారత్, ఈజిప్టు, యుగోస్లావియాలకేగాక, మిగతా తటస్థ దేశాలకుకూడా మంచి ప్రయోజనం వుంటుందని వీరంటున్నారు.

చాలా కాలం తర్వాత అంతర్జాతీయ ప్రాముఖ్యతగల ఇటువంటి సమావేశం ఢిల్లీలో జరగటంపట్ల రాజధాని వర్గాలలో ఒక రకమయిన సంతృప్తి వ్యక్తమవుతున్నది.

అంతర్జాతీయ వ్యవహారాలలో తటస్థ దేశాల వైఖరి, తటస్థ దేశాలపై ప్రత్యక్షప్రభావం కల్గిస్తున్న ఆసియా, ఆఫ్రికా సమస్యలు శిఖరాగ్ర సభలో పరిశీలనకు వస్తాయని తెలుస్తున్నది.

ముగ్గురు నాయకులు మనస్సుల్లోవున్న ప్రతి సమస్యా-తటస్థ దేశాల సమస్యలు, వియత్నాం, రొడీషియా, నైరుతి ఆఫ్రికా, నిరాయుధీకరణ, అణ్వాయుధ వ్యాప్తి నిరోధక సమస్య, వర్ధమాన దేశాల మధ్య ఆర్థిక సహకారం, తదితర సమస్యలు శిఖరాగ్ర సభలో చర్చకు వస్తాయి

ఆగ్నేయాసియా సమస్య ఈ సమావేశంలో ప్రధాన పాత్ర వహించుతుంది.

టిటోకు రాష్ట్రపతి రాధాకృష్ణ సందేశం

శిఖరాగ్ర సమావేశానికి రానున్న యుగోస్లావియా అధ్యక్షులు మార్షల్ టిటోకు రాష్ట్రపతి రాధాకృష్ణన్ సందేశం పంపుతూ "భారతదేశానికి ఆయననమ్మదగినమిత్రుడు"ని అభివర్ణించారు.

పండిత నెహ్రూకు, తర్వాత భారత ప్రధాని శాస్త్రికి కూడా టిటో పరిచితుడని పేర్కొన్నారు.

టిటోతో తనకు చిరకాల పరిచయం వున్నదని, ఆయన నిజాయితీ, శాంతివాంఛ, యుగోస్లావియా అభివృద్ధికి ఆయన చేస్తున్న ప్రయత్నంపట్ల తనకు అపార గౌరవం, విశ్వాసం వున్నవని చెప్పారు.

తటస్థ విదేశాంగ విధానం విశిష్టత

తటస్థ విదేశాంగ విధానం విశిష్టత గురించి జరిగిన గోష్ఠిలో అల్లాహాబాద్ వైస్-ఛాన్సలర్ విదేశాంగశాఖ మాజీ కార్యదర్శి అయిన ఆర్. కె. నెహ్రూ, ప్రస్తుత కార్యదర్శిఅయిన టి. యన్. కౌల్, అరబ్‌లీగ్ ప్రతినిధి డాక్టర్ క్లోవిస్ మక్సౌద్‌లు ఈరోజు యిక్కడ వివరించారు.

దినదినం ప్రపంచ పరిస్థితిలో వస్తున్న మార్పుల దృష్ట్యా స్వతంత్రంగా వ్యవహరించే హక్కును కోల్పోకుండా వుండటానికి అనువైన విధానం యిదని వారన్నారు.

తటస్థ విదేశాంగ విధానం అన్నది కేవలం ఒకవిధానంకాదని, కార్యాచరణపథకమని ఆర్‌కె నెహ్రూచెప్పారు. ప్రపంచసమస్యలపట్ల విస్పష్ట వైఖరిని అవలంబించడానికి అనువైన పంథా యిదని స్పష్టం చేశారు.

ప్రపంచం రెండు శిబిరాలుగా చీలిపోయి వున్న పరిస్థితిలో తటస్థ విధానం ఆవిర్భవించిందని శ్రీ టి. యన్. కౌల్ అన్నారు. బడుగుదేశాలు స్వతంత్రంగా అభివృద్ధి చెందడానికి ఈ విధానంవీలుకలిగిస్తుందని చెప్పారు.

అరబ్‌లీగ్ ప్రతినిధి మాట్లాడుతూ పాలస్తీనా, వియత్నాం సంక్షోభాన్ని పరిష్కరించవలసిన బాధ్యత తటస్థ దేశాలమీద వున్నదన్నారు

సమావేశ కార్యక్రమం

న్యూఢిల్లీ, అక్టోబరు 18

శుక్రవారంనాడు ఢిల్లీలో ప్రారంభమయ్యే అలీన రాజ్యత్రయ సభ నాలుగు సార్లు సమావేశం జరుపుతుంది. రాష్ట్రపతి భవనంలోని అశోకహాలులో ప్రారంభోత్సవం జరుగుతుంది. ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి, ఐక్య అరబ్ రిపబ్లిక్ అధ్యక్షులు నాజర్, యుగోస్లావియా అధ్యక్షులు టిటోలు ఈ సందర్భంగా ప్రసంగిస్తారు. తదనంతరం శుక్రవారం సాయంత్రం పానెల్ హాలులో మొదటి సమావేశం జరుగుతుంది.

అక్టోబరు 24 వ తేదీన ఈ మూడు దేశాల నాయకులు సంయుక్తంగా పత్రికా సమావేశం జరపడంతో ఈ సభ ముగుస్తుంది.

అధ్యక్షులు టిటో గురువారం ఉదయం, నాజర్ అదేరోజు సాయంత్రం ఢిల్లీకి చేరతారు, ఈ ఉభయ నాయకులకు పాలం విమానాశ్రయంలో ఘన స్వాగత మివ్వడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. అక్టోబరు 25 వ తేదీ ఉదయం మార్షల్ టిటో తిరిగి తమ స్వదేశానికి బయలుదేరి వెడతారు. అటు పిమ్మట నాజర్ భారతదేశంలో అధికార హోదాలో పర్యటన జరుపుతారు.

బెల్‌గ్రేడ్ నుండి టిటో పయనం

అలీనరాజ్యత్రయ సభకు హాజరయ్యేందుకు

బెల్‌గ్రేడ్, అక్టోబరు 19

యుగోస్లావియా అధ్యక్షులు మార్షల్ టిటో ఈరోజు బెల్‌గ్రేడ్ నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలుదేరారు.

టిటో వెంట వస్తున్న బృందంలో 23 గురు సభ్యులు వున్నారు.

ఎజెండా అంటూ ఏమీ లేకుండానే ఇందిరాగాంధి, నాజర్‌లతో చర్చలు జరపడానికి టిటో సుముఖంగా వున్నారని పి.టి.ఐ విలేకరి శ్రీ ఆర్. వరదాచారి వ్రాస్తున్నారు.

సైనిక కూటముల సిద్ధాంతప్రాతిపదికపై ఏర్పడిన గ్రూపులు అంతర్జాతీయ పరిస్థితుల ఒత్తిడివల్ల బ్రద్దలుకాక తప్పదని టిటో విశ్వసిస్తున్నారని వరదాచారి వ్రాస్తున్నారు.

ఆయన యింకా యిలా వ్రాస్తున్నారు.

"తటస్థ దేశాలు తన వైఖరిని మార్చుకొని తమ కార్యకలాపాలను ఇంకా విస్తృతం చేయాల్సిన అవసరం వుందని టిటో అనుకుంటున్నారు

శాంతియుత సహజీవనం, అనుసరిస్తూ ప్రపంచ శాంతి రక్షణకు పూనుకొంటున్న సామ్యవాద ప్రగతిశీల శక్తులతో, తటస్థదేశాలు మరింత సన్నిహిత సంబంధాలు పెట్టుకోవాలనేది ఆయన అభిప్రాయం.

శాంతియుత సహజీవనం, వివిధదేశాల ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యంకల్గించుకోరాదనే సూత్రాలను, అంతర్జాతీయ వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలనే వైఖరిని రానురాను అనేక దేశాలు బలపరుస్తున్న దృష్ట్యా, తటస్థవిధానం పరిధివిస్తృతమయిందని ఇటీవలే టిటో పేర్కొన్నారు.

ఈ సందర్భంగా యుగోస్లావియా వర్గాలు స్వీడన్, రుమేనియా, కెనడా, ఫ్రాన్స్‌దేశాల పేర్లను పేర్కొంటున్నాయి. పాకిస్తాన్, ఇరాక్ పేర్లుకూడా వినవస్తున్నాయి.

ఈదేశాల వెనుకటి సిద్ధాంత-అభిప్రాయాలు ఏమయినా, ప్రపంచ దేశాల రక్షణ విషయంలో ఈ దేశాల సహకారాన్నికూడా పెంపొందడానికి, వాటినికూడా తమతో కలుపుకు పోవడానికి తటస్థదేశాలు యత్నించాలని యుగోస్లావియా భావిస్తున్నది.

తటస్థదేశాల ప్రోత్సాహంవుంటే, పైన పేర్కొన్న దేశాలు స్వతంత్ర విదేశాంగ విధానాన్ని చేబట్టడానికి వెనుకంజ వేయవని టిటో విశ్వాసం.

ఈవిధంగా తటస్థ దేశాల పలుకుబడి, ప్రపంచ రాజకీయాల్లో వాటి పాత్ర పెరిగి, శాంతి ఏర్పడటానికి దోహదకారి అవుతుంది.

ఆఫ్రికా, మధ్యాసియా, ఆసియాలలో వలస వాదులు, నయావలసవాదులు తెస్తున్న వత్తిడుల విషయమై జాగ్రత్తగా పరిశీలించాలని యుగోస్లావియా అధ్యక్షులు టిటో, నాజర్, ఇందిరాగాంధీలను కోరగలరు,

తటస్థ విధానాన్ని బలహీనపర్చి, నూతనంగా స్వాతంత్ర్యం పొందిన దేశాల ప్రజలను ఆయా దేశాలలో రాజకీయ సుస్థిరత లేకుండా చేయడానికి అమెరికా, బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఆఫ్రికాలోనూ, అరబ్ దేశాలలోనూ తమ మిత్రులకు సైనిక తిరుగుబాట్లకు ప్రోత్సహిస్తున్నారని యుగోస్లావియా భావిస్తున్నది.

వియత్నాంలో ప్రస్తుత పరిస్థితికి బాధ్యత అంతా అమెరికాదేనని టిటో అభిప్రాయపడుతున్నారు. యీ విషయంలోనే గాక, నిరాయుధీకరణ, నయావలస విధానం వగైరా సమస్యల విషయంలో టిటో వైఖరిని నాజర్ పూర్తిగా బలపర్చగలరని యుగోస్లావియా వర్గాలవారి ద్వారా తెలుస్తున్నది.

తటస్థ రాజ్యత్రయ సమావేశ లక్ష్యం

భారత విదేశాంగశాఖ కార్యదర్శి వివరణ

న్యూఢిల్లీ, అక్టోబరు 19

టిటో, నాజర్, ఇందిరాగాంధీలతో జరిగే శిఖరాగ్ర సభ ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాన్ని నిర్ణయించబోదనీ, అయితే ప్రపంచ సమస్యల పరిష్కారం అనే లక్ష్య సాధనకు మాత్రం ఈ సమావేశం ఉపయోగపడగలదని భారత విదేశాంగశాఖ కార్యదర్శి శ్రీ సి ఎస్ ఝా అన్నారు.

ఈ సమావేశం ఎవరికీ వ్యతిరేకంగా జరుగుతున్నది కాదని, లేక ఒక కూటమి సమావేశం కాదని అన్నారు. తటస్థ దేశాల మహాసభకు మారుగా జరుగుతున్న సమావేశమూ ఇది కాదని చెప్పారు.

"ఇది మూడు దేశాల అధిపతుల సమావేశం. అంతర్జాతీయ పరిస్థితిని గురించి ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి మనం ఎంతవరకు తోడ్పడగలం అన్న విషయాల గురించి మూడు దేశాల అధికారులు సంప్రదింపులు జరుపుతారు" అని శ్రీ ఝా అన్నారు.

ఈ సమావేశం చర్చలవల్ల ప్రపంచంలో శాంతిని గురించిన ఆలోచనకు ప్రోత్సాహం లభించి, శాంతి, సుహృద్భావ వాతావరణం ఏర్పడటానికి దోహదకారి కాగలదని తెలిపారు. అయితే ఒక నిర్దిష్ట లక్ష్యంతో ఈ శిఖరాగ్రసభను ఏర్పాటుచేయలేదని చెప్పారు.

1956 లో బ్రియోని, 1961లో కైరోలో జరిగిన సమావేశాల పర్యవసానంగానే యిది జరుగుతున్నదనీ, పరస్పరం ఆసక్తిదాయకమయిన విషయాలపై, మూడు దేశాల నాయకులు నిర్మొహమాటంగా ఒకరి అభిప్రాయాలు మరొకరు ఈ సమావేశంలో తెల్పుకుంటారని అన్నారు,

'పరస్పరం ఆసక్తిదాయకమైన' అన్న మాటను సంకుచిత అర్థంతో వాడలేదని ప్రపంచంలో ఏమిజరిగినా యుద్ధం, శాంతి నిరాయుధీకరణ-అంశాలు అందరికీ సంబంధించిన వని చెప్పారు.

మూడుదేశాల నాయకులు తటస్థ దేశాలన్నింటి తరఫునా మాట్లాడబోరనీ, కాని వారు చెప్పే అంశాలకు, వర్తమాన పరిస్థితుల దృష్ట్యా తప్పనిసరిగా కొంత ప్రాముఖ్యత వుంటుందని తెలిపారు.

ఏ సమస్యనైనా చర్చించవచ్చు

ఈ నాయకత్రయం ఏ సమస్యనైనా స్వేచ్ఛగా చర్చించవచ్చునని, ఏ ఒక్క చర్చనీయాంశానికినాయకులు ముందుగానే బంధింపబడలేదని శ్రీ ఝా అన్నారు. అయితే అలీన దేశాలు, ఆసియా ఆఫ్రికాల్లోని వర్ధమాన దేశాలకు సంబంధించిన సమస్యలను మాత్రమే వారు సహజంగా చర్చించగలరన్నారు. ఐ.రా.స. ముందున్న నిరాయుధీకరణ, అణ్వస్త్ర వ్యాప్తి నిరోధం లాంటి తక్షణ సమస్యలు చర్చించ బడవచ్చునన్నారు. వారు ఏమి చర్చిస్తారన్న దానిమీద పరిమితి ఏమీ లేదు.

ఆగ్నేయాసియా, వియత్నాం పరిస్థితి అలీన దేశాల వైఖరి, వివిధ తరహాల [illegible]లను అనుభవిస్తున్న వర్ధమాన దేశాల ఇబ్బందులు మున్నగు విషయాలు చర్చకు రాగలవన్నారు.

వియత్నాం సమస్యలో నేటి ప్రధానమైన సమస్యపై మూడు ప్రభుత్వాల వైఖరిలో అత్యంత సాన్నిహిత్యం వున్నదని చెప్పారు.

మనీలా సభపై ఆశలు వద్దని జాన్సన్ ప్రకటన

హోనులులూ, అక్టోబరు 18

వచ్చే వారం మనీలాలో జరిగే ఏడు (అమెరికా ఉపగ్రహ) దేశాల సభపై ఎక్కువ ఆశలు పెట్టుకోవద్దని అమెరికా అధ్యక్షుడు జాన్సన్ తన దేశ ప్రజలకు చెప్పారు.

హోనులులూ నుండి న్యూజిలాండ్‌కు బయలుదేరేముందు జాన్సన్ ఈ ప్రకటన చేశారు.

"మనీలాసభలో యింద్రజాల, మహేంద్రజాలం చేస్తామని ఆశలుపెట్టుకోవద్దు. వియత్నాం విషయంలో అన్నిటికంటె ముఖ్యమైన ఆయుధం ఓర్పు. పట్టుదల. దానినే మన ప్రజలు అలవర్చుకోవాలి" అని అన్నారు.

వియత్నాంలో దురాక్రమణను అరికట్టడమే మన సైనిక కార్యకలాపాల లక్ష్యమని చెప్పారు.

వియత్నాంలో శాంతి ఏర్పడాలంటే అమెరికా ఒక్కదానివల్లకాదు. హనోయ్‌పాలకులు కూడా అందుకు పూనుకోవాలి. అప్పుడే మన ప్రయత్నమైనా జయప్రదం అవుతుంది" అని చెప్పారు.

హైఫాంగ్ రేవుపై అమెరికా అగ్నివర్షం

సైగాన్, అక్టోబరు 18

ఉత్తర వియత్నాంలోని హైఫాంగ్‌రేవు ప్రాంతంపై అమెరికా యుద్ధవిమానాలు నిన్న అగ్నివర్షం కురిపించి, సుమారు 20 నావలను నీట ముంచినట్లు నేడిక్కడ అమెరికన్ సైనిక ప్రతినిధి ప్రకటించారు.

ఉత్తర వియత్నాంపై బాంబులు వేయడంలో మూడు అమెరికన్ విమానవాహక నౌకలు నిమగ్నమై వున్నట్టు ఆప్రతినిధి తెలిపారు.

7 గురు సైగాన్ మంత్రుల రాజీనామా

సైగాన్, అక్టోబరు 19

'కీ' నాయకత్వానగల దక్షిణ వియత్నాం మంత్రివర్గంలో నుండి 7 గురు మంత్రులు ఈ రోజు రాజీనామా చేశారు.

మంత్రివర్గంలో ఏర్పడిన చీలికల్ని సర్దుబాటుచేయటం ఎవరికయినాఅలవిగానిపనిఅని' రాజీనామా చేసిన వారిలోవున్న ఆర్థిక వ్యవహారాల మంత్రి యెత్రుంగ్‌ద్వాక్ తన రాజీనామా పత్రంలో పేర్కొన్నారు.

వియత్నాంపై దాడులు ఆపుచేయుటానికి అమెరికా షరతులు

న్యూయార్క్, అక్టోబరు 19

ఉత్తర వియత్నాం శాంతి చర్చలకు ముందు సమ్మతించితేనే అమెరికా తన విమాన దాడుల్ని నిలుపుచేయుందని ఐ. రా. స జనరల్ అసెంబ్లీలో గోల్డుబర్గ్ స్పష్టంగా అన్నారు.

తమ వైఖరి సమస్యా పరిష్కారానికి అనువైనదిగానే వున్నదని చెప్పుచున్నారు.

సైనిక పద్ధతులద్వారా గాక, వియత్నాం సమస్య పరిష్కారానికి రాజకీయ మార్గం ఆలోచించాలనే సూచన అందరూ చేశారని అందుకు అమెరికా సిద్ధమేనని అన్నారు,

జమ్మూలో హర్తాళ్

(1 వ పేజీ తరువాయి)

హర్తాళ్ జరిగింది. అత్యధికసంఖ్య ప్రజలు, విద్యార్థుల అంత్యక్రియలకు హాజరయ్యారు.

నేడు కాల్పుల్లో చనిపోయిన వ్యక్తిని ప్రజలు ఊరేగింపుగా పోలీసు యిన్స్పెక్టర్ జనరల్ కార్యాలయానికి తీసుకవెళ్ళారు. ఆ సందర్భంలో పోలీసులకు, ప్రజలకు మధ్య ఘర్షణలు జరిగాయి. పోలీసుల రక్షణకు సైనికులను తీసుకు వచ్చారు. దానితో ప్రజలకు, పోలీసులకు మధ్య ఘర్షణ జరిగింది.

పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చినట్లు పోలీసు ఇన్స్పెక్టర్ జనరల్ ప్రకటించారు.

పట్టణంలో కొంతప్రాంతాన్ని మాత్రమే సైనికులకు వప్పగించినట్లు డివిజనల్ కమాండర్ సర్దార్ అమర్‌సింగ్ తెలియజేశారు.

పాత సెక్రటేరియట్‌లోని ఆహార సప్లయి శాఖ కార్యాలయానికి సాంఘిక విద్రోహ శక్తులు నేడు నిప్పంటించాయని ఆయన ఆరోపించారు.

డెమాక్రటిక్ కాన్ఫరెన్సు కార్యకర్త శ్రీ దేవపాల్‌దీప్ కాన్ఫరెన్సు కార్యాలయంలో నిద్రిస్తుండగా యీ రోజు ఉదయం పోలీసులు అరెస్టుచేసి తీసుకువెళ్లారు. నిన్న జరిగిన సంఘటనల సందర్భంగానే యీ అరెస్టు జరిగినట్లు తెలుస్తోంది.

రేపు ఉదయం 7 గంటలకు పట్టణంలో కర్ఫ్యూ రద్దు చెయ్యబడుతుందని అధికార సమాచారం ద్వారా తెలుస్తోంది.

రైల్వే కార్మికులకు ప్రత్యేక వేజ్ బోర్డు

శ్రీ ఎ. పి. శర్మ డిమాండ్

ఖర్దారోడ్, అక్టోబర్ 19

రైల్వే ఉద్యోగుల వేతనాలను ప్రత్యేకంగా పునర్నిర్ణయించడానికి, లేదా ప్రభుత్వ ఉద్యోగులందరి వేతనాలను పునః పరిశీలించడానికిగాని వెంటనే ప్రత్యేకబోర్డును నియమించాలని రైల్వే మెన్ నేషనల్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎ. పి శర్మ నేడిక్కడ డిమాండ్ చేశారు.

ధరల పెరుగుదల, ఆర్థిక వ్యవస్థలో మార్పులు, కార్మికులపై పెరిగిన బాధ్యతల దృష్ట్యా న్యాయమూర్తి జగన్నాథ్ దాస్ అధ్యక్షతన ఏర్పాటు చేయబడిన కమిషన్ జేసిన సిఫారసులకు కాలం తీరిపోయిందని చెప్పారు.

ఆగ్నేయ రైల్వేమెన్ ఫెడరేషన్ మహాసభను శ్రీ శర్మ ప్రారంభిస్తూ, ఏదో దయాదాక్షిణ్యంగా యిచ్చే కొద్దిపాటి కరువుభత్యం ఇస్తే పెరిగే ధరలవల్ల సతమతమవుతున్న కార్మికుల జీతాలు బాగుపడవని అన్నారు.

అందువల్ల కార్మికుల ఇబ్బందులపరిష్కారానికి మరో మార్గాన్ని ప్రభుత్వం చూడాలని కోరారు. గజేంద్రగడ్కర్ కమిషన్ సిఫారసులవల్ల ఉద్యోగులకు కొద్ది ప్రయోజనం వుండవచ్చునని చెప్పారు.

ఆహార ధాన్యాలను, నిత్యావసర సరుకుల్ని, సబ్సిడీ ధరలకు కార్మికులకు ప్రభుత్వం స్వయంగా సప్లయి చేయాలని ఆయన సూచించారు. దీనివల్ల కార్మికులకు కొంత ప్రయోజనం కలుగుతుందని చెప్పారు.

కేంద్ర ప్రభుత్వ కార్మిక విధానాన్ని విమర్శించుచూ మెల్లగా మాటలతో చెబితే వినని కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూనుకోవటం లేదని, ఫలితంగా తీవ్ర ఆందోళనకు పూనుకోవలసి వస్తున్నదని చెప్పారు. దీనివల్ల తీవ్ర రూపంలో పోరాటాలకు కార్మికుల్ని ఉసికొల్పటమే అవుతుందని అన్నారు. 14 లక్షల మంది రైల్వే కార్మికులు తమ న్యాయమైన కోర్కెల సాధనకు తీవ్రమైన, పోరాట పద్ధతుల్లో ఆందోళనకు పూనుకుంటే దేశం ఏమవుతుందని ప్రశ్నించారు.

పొదుపు పేర రైల్వేలో సాగుతున్న రిట్రెంచ్‌మెంటు విధానాన్ని తీవ్రంగా ఖండించారు.

మనదేశంలో 1,4 లక్షలమంది చేసే పనిని చేయటానికి విదేశాలలో 15 వేల మందినే వినియోగిస్తున్నారని కేంద్రమంత్రి పాటిల్ ఇటీవల చేసిన ప్రకటనను ప్రస్తావించి, ఈ ప్రకటన రైల్వే అధికారులు నిరంకుశంగా వ్యవహరించడానికే దోహదం చేస్తుందని చెప్పారు,

ఏదో ఒక కాలపరిమితిపెట్టి చేసే బదిలీలు మంచివికావని, పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా మాత్రమే బదిలీలు జరగాలని చెప్పారు,

న్యూయార్క్‌లో 12 మంది సజీవ దహనం

న్యూయార్క్, అక్టోబరు 18

దిగువ మన్‌హాటన్ ప్రాంతంలో మూడు వాణిజ్య భవనాలు అగ్ని ప్రమాదానికి లోనుకాగా, మంటలను ఆర్పుతున్న అగ్ని మాపక దళ సభ్యులు 12 మంది సజీవ దహనమైనట్టు తెలుస్తున్నది.

కృష్ణాజిల్లా కమ్యూనిస్టు సమితి సమావేశం

విజయవాడ, అక్టోబరు 22

అక్టోబరు 22 వ తేదీ సాయంకాలం 3 గంటలనుండి విజయవాడ జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సమావేశం జరుగును. 23వ తేదీ సాయంకాలం 3 గంటలనుండి 24 వ తేదీ సాయంత్రంవరకు జిల్లా కమ్యూనిస్టుసమితి సమావేశం జరుగును. ఎజెండా (1) ఆంధ్ర ప్రదేశ్ బంద్ (2) జనరల్ ఎన్నికలు- అభ్యర్థుల నిర్ణయం (3)పార్టీ సభ్యత్వం.

ఆంధ్రలో 25 సీట్లకు పి.యస్.పి. పోటీ

విజయవాడ, అక్టోబరు 19

ప్రజా సోషలిస్టు పార్టీ ఆంధ్ర ప్రదేశ్‌లో 25 శాసనసభాస్థానాలకు, మూడులోకసభ స్థానాలకు పోటీ చేస్తుందని, ఆంధ్రప్రదేశ్ ప్రజా సోషలిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం. రామచంద్రరావు నేడు ప్రకటించారు. అభ్యర్థులను నిర్ణయించడానికై పార్టీ రాష్ట్ర కార్యవర్గము, పార్లమెంటరీ బోర్డు నవంబరులో హైదరాబాద్‌లో సమావేశమవుతాయి

గుంటూరు హోటల్ కార్మిక విజయం

(1 వ పేజీ తరువాయి)

బంగళాలో లేబర్‌ఆఫీసరు సమక్షానహోటల్ కార్మిక సంఘ ప్రతినిధులకు, యజమానుల ప్రతినిధులకు మధ్య చర్చలు ప్రారంభమయినాయి.

కార్మిక ప్రతినిధులుగా గుంటూరు పట్టణ ట్రేడ్ యూనియన్ నాయకులు శ్రీ మల్లయ్యలింగం, ఆర్. టి. సి. ఉద్యోగుల సంఘం కార్యదర్శి శ్రీ సుధాకర్‌లు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు, శాసన సభ్యులు శ్రీ కె. నాగయ్య అందించిన నిమ్మరసం సేవించి రామారావు తన దీక్షనువిరమించారు.

తిరువనంతపురం, అక్టోబరు 18

స్థానిక శాసనసభా భవనంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యాన కేరళ పార్లమెంటు సభ్యుల సమావేశం జరుగుతున్న దృష్ట్యా పతనమతిట్ట తాలూకా కొండ ప్రాంతాల్లో వ్యవసాయం చేస్తున్న సుమారు 100 మంది రైతులు నిరాహారవ్రతం ప్రారంభించారు.

తాము సాగు చేస్తున్న భూములకు శాశ్వత పట్టాలు యివ్వాలనీ, దీర్ఘకాల కౌలుపద్ధతిని రద్దుచెయ్యాలనీ వారు కోరుతున్నారు.

టెన్సి పైలట్
స్విచ్
మరియు ఉపసాధనములు
క్వాలిటీ, సర్వీసు మరియు
పనివిధానమునకు యోగ్యమైనది,

BOOKS & PERIODICALS

"Account Test (Andhra Pradesh) Questions / Answers & Summaries are available for Subordinate Officers Parts: I, II Executive Officers; P.W.D.& Zilla Parishad Tests. Apply •

Account Test Institute,
MADRAS—8.

కావలెను
మా తివాచీలు మరియు దుప్పట్లకు
కమీషన్ ఏజెంట్లు కావలెను
ఇంగ్లీషులో వ్రాయండి.
M/s. The Merina Textiles,
JAMBAI P. O.
Via Erode S. India.

పి & టి డిపార్టుమెంటు

డిస్ట్రిక్ట్ మేనేజరు, టెలిఫోన్సు, హైదరాబాద్ - 33 వారి ఆఫీసులో పనిచేయుటకు ఇద్దరు స్టెనోగ్రాఫర్లు కావలెను. ఉద్యోగములు తాత్కాలికము అయితే పర్మనెంటు కావచ్చును. 8-1-1967న హైదరాబాద్‌లో జరుగు కాంపిటీటివ్ పరీక్ష అయిన తర్వాత (వివరములు దరఖాస్తు ఫారములో లభించును.) సెలక్షను జరుగును.

విద్యార్హతలు : కాలేజీ కోర్సునకు అర్హత లేదా రాష్ట్రప్రభుత్వములో క్లరికల్ సర్వీసుకు అర్హతతో గుర్తింపబడిన ఇండియన్ యూనివర్సిటీ లేదా బోర్డు నిర్వహించిన మెట్రిక్యులేషన్ లేదా దానికి సమానమైన పరీక్ష పాసైవుండాలి.

వయస్సు : 1-7-1966 నాటికి 18 సంవత్సరాలలోపు 24 సం॥ పైబడి వుండరాదు. షెడ్యూల్డు కులములు లేదా షెడ్యూల్డు జాతులఅభ్యర్థులకు వయోపరిమితిలో 5 సంవత్సరములు సడలింపులుండును. ఆ సంబంధమైన దరఖాస్తుదారులపట్ల గరిష్ఠ వయోపరిమితిలోకూడ సడలింపులుండును.

జీతం : 130 - 5 - 160 - 8 - 200 EB - 8 - 256 - EB - 8 - 280 - 10 - 300 మరియు మామూలు అలవెన్సులు.

నిర్ణీత ఫారములోవున్న దరఖాస్తుఫారములు నిర్ణయించబడిన ఫీజు రు. 4/- (రు. 1/- షెడ్యూలు, కులము, జాతి అభ్యర్థులకు)తో డిస్ట్రిక్టు మేనేజరు, టెలిఫోన్స్, హైదరాబాద్-33 వారికి పంపుకోవలయును. ఏ పోస్టాఫీసు నుండి అయినా రు 1/- కు పొందిన నగదు రశీదు డిస్ట్రిక్టు మేనేజరుకు పంపి, దరఖాస్తుఫారము సూచనలు వారి నుండి పొందవచ్చును. మనిఆర్డర్లు లేదా ఇండియన్ పోస్టల్‌ఆర్డర్లు అంగీకరించబడవు. దరఖాస్తురుసుము తిరిగి యివ్వబడదు. దరఖాస్తుఫారము సప్లయిచేయుటకు తుదిగడువు 1-11-1966. పూర్తిచేసిన దరఖాస్తు ఫారము, పరీక్షకు [illegible] మరియు కోరిన డాక్యుమెంట్లు దగ్గరవున్న ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజివారిగాని లేదా వ్యక్తిగతముగా గాని 15-11-1966 నాటికి అందజేయవలయును. ప్రచారము లేదా రికమెండేషన్లు అభ్యర్థుల అనర్హతగా చూడబడును.

DA-6 (352)/66

ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ స్త్రీల పోటీలు

హైద్రాబాద్, అక్టోబరు 18

అఖిల భారత ఇంటర్‌యూనివర్సిటీ వాలీబాల్ స్త్రీల ఛాంపియన్‌షిప్ పోటీలు నవంబరు 8 - 11 తేదీలలో స్థానిక లాల్‌బహదూర్ స్టేడియమ్‌లో జరుగుతాయని నేడిక్కడ ప్రకటించారు.

15 యూనివర్సిటీల నుండి వచ్చే జట్లు ఈ పోటీలలో పాల్గొంటాయి. పంజాబ్ యూనివర్సిటీ గతసారి ఛాంపియన్స్‌గా గెల్చింది. జబల్‌పూర్ యూనివర్సిటీ ద్వితీయ స్థానాన్ని పొందింది.

బేస్కెట్ బాల్ పురుషుల ఛాంపియన్ షిప్ పోటీలు

అఖిలభారత ఇంటర్ యూనివర్సిటీ బేస్కెట్ బాల్ పురుషుల ఛాంపియన్ షిప్ పోటీలుకూడా ఇక్కడనవంబరు 19నుండి 21 వరకు జరుగుతాయి.

బెంగుళూరు, వెంకటేశ్వర, కేరళ, ఉస్మానియా, మదురై (వ్యవసాయ), నాగపూర్ (వ్యవసాయ), బెంగుళూరు (సైన్సు), ఆంధ్ర, మైసూరు, మద్రాసు మొదలగు యూనివర్సిటీల నుండి ఈ జట్లు పాల్గొంటాయి.

నేషనల్ ఫుట్‌బాల్ జూనియర్ ఛాంపియన్ షిప్

బెంగుళూరు, అక్టోబరు 19

నేషనల్ ఫుట్‌బాల్ జూనియర్ ఛాంపియన్ షిప్ పోటీలలో మహారాష్ట్ర జట్టు, ఉత్తరప్రదేశ్‌ను 4-1 గోల్సుతో ఓడించింది. క్వార్టర్ ఫైనల్స్‌లో మహారాష్ట్ర-ఢిల్లీ (హోల్డర్స్) జట్లమధ్య పోటీలు జరుగుతాయి.

పెరూలో భూకంపం వివరాలు

117 గురు మృతి

లిమా, అక్టోబరు 19

మధ్య పెరూలోని భయంకరమయిన భూకంపంలో అనేక గ్రామాలకు గ్రామాలు ధ్వంసమయినట్లు వార్త లందుతున్నాయి. ఇప్పటికి 117 గురు మృతదేహాలు దొరికాయని, మృతుల సంఖ్య అపారంగా వుందని అధికారవర్గాల వారన్నారు. గాయపడినవారి సంఖ్య అపారం.

భూకంపం మూలంగా పెరూ రాజధానిలో దృశ్యాలు అతిభయంకరంగా వున్నాయని రాయిటర్ వార్తాసంస్థ తెలుపుతోంది.

భూకంపం సంభవించటంతోటే పెద్ద పెద్ద భవనాలు కూలిపోవటం మొదలు పెట్టాయి.

భయకంపితులయిన ప్రజలు ప్రాణాలు అరచేత బెట్టుకొని, వీధుల్లోకి ఆక్రందనలతో పరుగులు తీశారు.

కల్లోయి రేవు వద్ద ఒక చర్చిలో ప్రార్థనలు జరుగుతున్న సమయంలో ఈ దుర్ఘటన సంభవించటంతో, కప్పుకూలి చర్చిలోవున్న వారంతా శిధిలాలక్రింద కప్పబడిపోయారు.

గ్రామీణ ప్రాంతాలలో పెద్ద పెద్ద చెట్లు కూలి తద్వారా సంభవించిన నష్టం అపారంగా వుంది.

ఆఫీసు భవనాలు కూలిపోగా, బ్రతికి బయటపడ్డ ఉద్యోగులు, విలపిస్తూ యింటివద్ద తమ పిల్లలు ఏ మయ్యారోనని ఆతురతతో పరుగులు తీశారు. భవనాలు కూలిపడటంతో రహదార్లు కొన్ని నడవటానికి వీలుగాకుండా పోయాయి.

సరైన తిండిలేక ఏటా 30 లక్షల ప్రజల మృతి

న్యూఢిల్లీ, అక్టోబరు 18

కడుపునిండా తిండిలేక ప్రపంచంలో ఏటా 30 లక్షల మంది మరణిస్తున్నారని, ఐ రా. స. ఆహార సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ బి. సేన్ నేడిక్కడ అన్నారు.

రానున్న 25 సంవత్సరాలలో ప్రపంచంలో ఆహార ఉత్పత్తి గనుక గణనీయంగా పెరగకపోతే, అత్యంత భయానక పరిస్థితి ఎదురుకావచ్చునని సేన్ అన్నారు.

ప్రపంచ జనాభాలో సుమారు సగం మందికి పౌష్టికాహారం యిప్పుడు దొరకటం లేదని చెప్పారు.

ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలో ఆహారకొరత తీవ్రంగా వున్నదన్నారు.

ఆహార ఉత్పత్తి తక్కువగావుండటంతో పాటు యీ ప్రాంతంలో జనభా పెరుగుదల రేటు అధికమని అన్నారు.

ఈ ప్రాంతాల జనాభాలో 40 శాతం 15 ఏండ్లలోపు వయస్కులని చెప్పారు.



దేశ సమైక్యతా దినము

> "మాతృదేశ స్వాతంత్ర్యాన్ని, దేశ సమైక్యతను కాపాడటానికి సంఘర్షణ ఎన్నాళ్ళు కొనసాగినా, ఎన్ని కష్టాలను ఎదుర్కొనవలసి వచ్చినా, ఎన్ని త్యాగాలను చేయవలసి వచ్చినా, దీక్షతో కృషి చేసి తీరుతామనే మన దేశ ప్రజల దృఢ నిశ్చయాన్ని నేను పునరుద్ఘాటిస్తున్నాను.
>
> దేశ పటిష్ఠతకూ, దేశ సమైక్యానికీ స్థిర నిశ్చయముతో కృషి చేస్తానని ప్రతిజ్ఞ తీసుకొంటున్నాను."

(దేశ సమైక్యతా దినమైన అక్టోబరు 20 వ తేదీన తీసుకోవలసిన ప్రతిజ్ఞ)

మనదంతా ఒకటే దేశం

మనమంతా ఒకటే ప్రజ

DA 66/365

ఉస్మానియా అధ్యాపకుల ఆందోళన

విశ్వవిద్యాలయ స్వయం ప్రతిపత్తి కోసం

హైద్రాబాద్, అక్టోబరు 18

విశ్వవిద్యాలయ స్వయం ప్రతిపత్తిని సాధించడానికి అవసరమయిన కార్యాచరణకు ఉపక్రమించాలని ఉస్మానియా విశ్వవిద్యాలయ అధ్యాపకుల అసోసియేషన్ నిర్ణయించింది.

ఈ కార్యాచరణకు విద్యార్థుల్ని దూరంగా వుంచుతామని అధ్యాపకుల అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఆర్. సత్యనారాయణరావు పత్రికలవారితో అన్నారు.

మూడు అంశాలుగల కోర్కెల పత్రాన్ని కవానికి అసోసియేషన్ రూపొందించింది.

తమ ఆందోళన హుందాగా, విశ్వవిద్యాలయ గౌరవ ప్రతిపత్తికి తగిన రీతిలో వుంటుందని శ్రీ సత్యనారాయణరావు అన్నారు.

యూనివర్సిటీ స్వయం ప్రతిపత్తికి విఘాతం కల్పించే అంశాలను, గత సమావేశంలో శాసన సభ ఆమోదించిన చట్టం నుండి తొలగించాలనేది, అసోసియేషన్ కోర్కెల పత్రంలో ఒక అంశం.

వైస్-ఛాన్సలర్ నియామకం విషయంలో యూనివర్సిటీ అధ్యాపకుల మాటకు విలువ వుంటుందని ప్రభుత్వం హామీ యివ్వాలనేది రెండో కోర్కె.

యూనివర్సిటీ సవరణ చట్టం విషయంలో సుప్రీంకోర్టు అభిప్రాయం తెలుసుకునేవరకు ఆ చట్టాన్ని అమలు జరపరాదని అసోసియేషన్ కోరింది.

సుప్రీం కోర్టు అభిప్రాయం తెలుసుకొనే వరకు తాత్కాలికంగా వైస్ - ఛాన్సలర్ నియామకానికి ప్రభుత్వం పూనుకోరాదని, విజ్ఞప్తి చేసింది.

సుప్రీం కోర్టు తీర్పు వెలువడేవరకు తమలో ఎవరినైనా వైస్ - ఛాన్సలర్‌గా ప్రభుత్వం నియమించ దలిస్తే ఆ బాధ్యతల నిర్వహణకు ఎవరూ పూనుకోరాదని అధ్యాపకులు నిర్ణయించుకున్నారని శ్రీ సత్యనారాయణరావు చెప్పారు.

తాత్కాలిక వైస్-ఛాన్సలర్‌ను నియమించటం వల్ల వాతావరణం మరింత కలుషితం కాగలదని, అధ్యాపకుల ఏకాభిమతాన్నికాదని, స్వేచ్ఛాస్వామిక ప్రభుత్వం బలవంతంగా వైస్-ఛాన్సలర్‌నుతెచ్చి అధ్యాపకులనెత్తిన కూర్చోబెట్టదనీ అన్నారు.

రాష్ట్ర నాన్ గెజిటెడ్ పోలీసు ఉద్యోగుల సంఘం ఏర్పాటు

అలవెన్సుల జీతాలు పెంపుదలకై ఆందోళన

(విశాలాంధ్ర విలేకరి)

హైద్రాబాద్, అక్టోబరు 19

శ్రీ భుజంగరెడ్డి అధ్యక్షులుగానూ, శ్రీ పి. రాములు కన్వీనర్‌గానూ ఆంధ్రప్రదేశ్ నాన్‌గెజిటెడ్ పోలీసు ఆఫీసర్ల అసోసియేషన్ ఏర్పడింది.

తాత్కాలిక కమిటీ సభ్యత్వం చేర్పించటం మొదలు పెట్టింది. యిప్పటికి 700 మంది సభ్యులుగా చేరారు.

సభ్యత్వం చేర్పించటం పూర్తి కాగానే అసోసియేషన్ జనరల్‌బాడీ సమావేశం జరుగుతుంది.

నాన్ గెజిటెడ్ పోలీసు ఆఫీసర్ల ఇబ్బందులను, కోర్కెలను వివరించుతూ పోలీస్ యిన్‌స్పెక్టర్ జనరల్‌కు ఒక మెమోరాండం అందచేయటం జరిగింది.

తమ మూలవేతనాలను, ప్రయాణపు అలవెన్సులను, కరువు భత్యాన్ని పెంచాలని, తమ అసోసియేషన్‌ను గుర్తించాలని ఆ మెమోరాండంలో నాన్‌గెజిటెడ్ పోలీస్ ఉద్యోగులు కోరారు.

సర్వీస్ అసోసియేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించిన మీదటనే అసోసియేషన్ ఏర్పడిందని, యూనియన్ ప్రతినిధి ఒకరన్నారు. బెంగాల్, బీహార్, ఒరిస్సా, ఢిల్లీలలో యిటువంటి అసోసియేషన్లు వున్నవన్నారు.

తమ మెమోరాండానికి యింత వరకు పైనుండి జవాబు రాలేదని ఆ ప్రతినిధి చెప్పారు.

సాహిత్యగోష్ఠి

విజయవాడ, అక్టోబరు 17

గురువారం, అక్టోబరు 20 వ తేదీ సాయంత్రం 6-30 గంటలకు విజయవాడ పున్నమ్మతోటలో కల్చరల్ క్లబ్‌లో సాహిత్య గోష్ఠి జరుగుతుంది. శ్రీ అవంట జానకిరామ్ పాల్గొంటారు.

సైనిక కోర్టులో ఇండొనీషియా విదేశాంగ మంత్రి సుబాండ్రియోపై విచారణ పూర్తయ్యింది. ప్రాసిక్యూటర్ వాదన కూడా పూర్తయ్యింది.

◆ ◆ ◆

గమనిక

విశాలాంధ్ర 17వ తేదీ సంచిక 6 వ పేజీ 6 వ కాలంలో శ్రీ కె. ఎల్. నరసింహంగారికి శ్రీ మల్లయ్యలింగం విజ్ఞప్తి అనే వార్తలో "విధినం ప్రకారం జరగలేదా? అనుటకు బదులు "జరగలేదు కదా" అని ఉండాలి.

"తమ వాదనలు సమర్పించుకోవడానికి అనుటకు బదులు "సమర్థించుకోవడానికి" అని ఉండాలి.

"చీరాల యూనియన్ పునరుద్ధరణ కమిటీ సభలలో ఉపన్యసించినట్లు తానే అంగీకరించారు కూడా అని ఉండాలి" పాఠకులు గమనించ కోర్తాము. సం॥

◆ ◆ ◆

ఉత్తరప్రదేశ్‌లో తీవ్ర అనావృష్టి

కొన్నిచోట్ల గడ్డి, గాదం తింటున్న దుర్భరస్థితి

అలహాబాద్, అక్టోబరు 18

అలహాబాద్ జిల్లా మెజా తహసిల్‌లోని కొన్ని ప్రాంతాలలో తీవ్ర అనావృష్టివలన ప్రజలు గడ్డివిత్తనాలు రొట్టెలుగా చేసి తింటున్నారని సుంజినమూలో పంచాయతీ అధ్యక్షుడు శ్రీ జగత్‌పాల్‌సింగ్ ప్రకటించారు.

కరీఫ్‌పంట అంతా నాశనమైంది. రాబీ పంట పండే అవకాశం ఏమీకనబడటంలేదు. ప్రజలు డబ్బులేక జొన్నలుగాని మొక్కజొన్నగాని కొనలేక పోతున్నారు.

ఈప్రాంతాలలోని గ్రామాలకు ప్రభుత్వం నీటి సరఫరా చేయకపోతే అనేక గ్రామాలలో పశువులు, మనుషులు కూడా చనిపోయే ప్రమాదం ఏర్పడిందని శ్రీ సింగ్ హెచ్చరించారు.

బీహారు రాష్ట్రాన్ని క్షామప్రాంతంగా ప్రకటించ కోరటు

మంత్రి సుబ్రహ్మణ్యం మొండివైఖరి

పాట్నా, అక్టోబరు 18

బీహారును క్షామప్రాంతంగా ప్రకటించాలన్న ప్రతిపక్షాల వాదనను కేంద్ర ఆహార మంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం నేడు నిరాకరించారు.

ఫామిన్‌కోడ్‌లో చెప్పిన క్షామనివారణ చర్యలకంటే ఎక్కువ చర్యలనే కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు తీసుకుంటాయని శ్రీ సుబ్రహ్మణ్యం అన్నారు.

బీహారులోని తీవ్ర పరిస్థితి తనకు తెలుసుననీ అయితే ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కోవడమన్నదే ప్రశ్న అనీ అన్నారు.

శ్రీ సుబ్రహ్మణ్యం నేడిక్కడ కొంతమంది ప్రతిపక్ష సభ్యులలో మాట్లాడుతూ ఈ సంక్షోభాన్ని దాటడానికి వారు సహకరించాలని అన్నారు.

అయితే ప్రతిపక్ష సభ్యులు సూటిగా "బీహారుకు నెలకు 4 లక్షల టన్నుల ఆహార ధాన్యాలను కేంద్రం పంపుతుందా?" అని అడిగిన ప్రశ్నకు "అది అసాధ్యమైన విషయమని" జవాబు యిచ్చారు. పరిస్థితుల వీలును బట్టి ఎంత పంపడానికి వీలైతే అంతా పంపించగలమని అన్నారు.

విమానం పైనుండి అనావృష్టి పరిస్థితి పరిశీలన

బీహారులో కేంద్ర మంత్రులు

పాట్నా, అక్టోబరు 19

బీహార్‌లోని అనావృష్టి ప్రాంతాలను పరిశీలించడానికి ఇక్కడకువచ్చిన కేంద్రఆహార మంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం, ప్రణాళికమంత్రి శ్రీ అశోక మెహతాగార్లు నేడు విమానంపై పాట్నా, గయ, సహబాద్, మాంఘీర్ జిల్లాలపై పర్యటించారు.

ఈ క్షామ ప్రాంతాలకు ఢిల్లీనుండి ఏమి తీసుకొని వచ్చారు? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు శ్రీ సుబ్రహ్మణ్యం సమాధానంగా తనచేతిలో ఉన్న పూలగుత్తిని చూపుతూ "ప్రకృతి వైపరీత్యంతో పోరాడుతున్న బీహారు ప్రజలకు నేను తీసుకొని వచ్చింది ఇంతమాత్రమేనని అన్నారు.

భారతీయులతో విదేశీ విద్యార్థుల సంబంధాలు పెంపొందించుకోవాలని

జగ్‌జీవన్‌రాం సలహా

న్యూఢిల్లీ, అక్టోబరు 18

భారతదేశంలో చదువుకొంటున్న విదేశీ విద్యార్థులకు, భారతీయులకు మధ్య సాంఘిక సంబంధాలు ఏర్పడాలనీ, ఆ విధంగా వారు భారతీయసాంఘిక జీవితాన్ని లోతుగా తెలుసుకోగలుగుతారని కేంద్ర కార్మిక, ఉద్యోగకల్పనమంత్రి శ్రీ జగ్‌జీవన్‌రాం చెప్పారు.

విదేశాలనుంచి వచ్చే విద్యార్థులు తమ విద్యాభ్యాసంగంలో మాత్రమే కాక, విద్యార్థులతోబాటు, భారతీయ కుటుంబాలతోకూడా సంబంధాలు పెట్టుకోవాలని విదేశీ విద్యార్థుల బృందంతో మాట్లాడుతూ ఆయన చెప్పారు.

భారతదేశం తన ఆర్థిక వ్యవస్థను పెంపొందించుకోడానికి కృషి చేయడంతో బాటు, యితర దేశాలతో తన సంబంధాలను పెంపొందించుకోవడానికి ప్రయత్నిస్తోందనీ, అందువల్ల వివిధ దేశాల ప్రజలు సన్నిహితం కావాలని అన్నారు. ఈస్నేహ విధానాన్ని పెంపొందించుకోవడం కోసమే భారతదేశం విదేశ విద్యార్థులు చదువుకోడానికి అవకాశాలు కల్పిస్తోందని కూడా చెప్పారు.

భారతదేశం ఎప్పుడూ తన సరిహద్దులను దాటి ఇతర దేశాలపై దురాక్రమణ చెయ్యలేదనీ, అటువంటి కోర్కెకూడా దానికిలేదనీ అన్నారు.

వివిధ దేశాల, వ్యక్తుల స్నేహంలో భారతీయులకు విశ్వాసం వుందనీ, భారతీయ తత్వశాస్త్ర ప్రాథమిక సూత్రం అదేననీ ఆయన చెప్పారు.

అడేనియా నింపకాల ప్రాంతం నుండి బ్రిటన్ తన సైన్యాలను వెంటనే ఉపసంహరించుకోవాలని సిరియా కోరింది.

విద్యార్థులు ఆత్మపరిశీలన చేసుకోవాలి

రాష్ట్రపతి హితవు

అహమ్మదాబాదు, అక్టోబరు 18

తాము చేసిన పనులు సరిఅయినవో కావో అవి తమకు గాని, దేశానికిగాని లాభకరమైనవో, కావో విద్యార్థులు ఆత్మవిమర్శ చేసుకోవాలని రాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణ నేడు విద్యార్థులకు ఒక విజ్ఞప్తి చేశారు.

నేడు గుజరాత్ విద్యాపీఠంలో జరిగిన స్నాతకోత్సవంలో ప్రసంగిస్తూ దేశంలోకొన్ని ప్రాంతాల్లో విద్యార్థుల్లో వ్యాపించిన అసంతృప్తిని గురించి పేర్కొని, విద్యార్థులు తమ చర్యలవల్ల దేశంలో విప్లవాన్ని తీసుకురావడానికి సహాయపడ్డారో, లేక అభివృద్ధిని అడ్డుకొన్నారో ఆలోచించుకోవాలనిచెప్పారు.

విద్యార్థులు అదృశ్యప్రాయులనీ, తెలివితేటలుగలవారనీ, బాధలకు, త్యాగాలకు వెనుతియ్యరనీ జీవితంలో చాలా కాలం ఉపాధ్యాయుడుగా పనిచేసిన తనకు తెలుసుననీ, అటువంటి విద్యార్థులు చెడుగా ప్రవర్తిస్తున్నారంటే అది విషాదకరమైన అంశమనీ ఆయన అన్నారు.

గుజరాత్ విద్యాపీఠం విద్యార్థులు శ్రమపడి విద్యా వ్యాసంగాన్ని కొనసాగిస్తున్న దృష్ట్యా అవాంఛనీయమైన చర్యల్లో పాల్గొనడానికి వారికి సమయంలేదని ఛాన్సలర్ శ్రీ మొరార్జీ దేశాయి మాట్లాడుతూ చెప్పారు.

వారు పరీక్షల్లో ఉత్తీర్ణులవాలనీ, ప్రజలకు సేవ చెయ్యాలనివాంఛిస్తున్నారని ఆయన అన్నారు.

విద్యా కమిషన్ చేసిన సిఫార్సులలో కొన్నింటిని విద్యాపీఠం యిదివరకే ఆచరణలో పెట్టిందనీ, మాతృభాషలో విద్యాబోధన కొనసాగిస్తున్నామనీ, యింత వరకు తమ విద్యాపీఠంలో 509 మందిని గ్రాడ్యుయేట్లను తయారు చేశామనీ వైస్ ఛాన్సలర్ ఠాకూర్‌భాయ్ దేశాయి చెప్పారు.

దమ్మపేట కమ్యూనిస్టు సభ వాయిదా

దమ్మపేట, అక్టోబరు 19

ఖమ్మంజిల్లా దమ్మపేటలో ఈ నెల 23 న జరుగవలసిన కమ్యూనిస్టుపార్టీ బహిరంగసభ అనివార్య కారణాలవల్ల వాయిదా వేయబడిందని ఖమ్మంజిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీ రేగళ్ళ చెన్నారెడ్డి ప్రకటిస్తున్నారు. ఈ కారణంవల్ల ఆనాడు కోనూరు పున్నయ్యగారి కార్యక్రమము రాష్ట్ర కమ్యూనిస్టు నాయకులు శ్రీ నల్లమల గిరిప్రసాద్ కార్యక్రమం రద్దుచేయ బడిందని ఆయన వ్రాస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వానికి డిప్యూటీ కలెక్టర్ల విజ్ఞప్తి

హైద్రాబాద్, అక్టోబరు 18

తమ ఉద్యోగ విరమణ వయస్సును 58 సంవత్సరాలకు పెంచాలని హైద్రాబాద్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ కలెక్టర్ల సమావేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

జంటనగరాలలో పనిచేసే డిప్యూటీ కలెక్టర్లకు ప్రత్యేక అలవెన్సు యివ్వాలని, జీవనవ్యయం, యింటి అద్దెలు మరీ ఎక్కువగా వుంటున్న దృష్ట్యా ఈ సౌకర్యం కల్గించాలని మరో తీర్మానంలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఐ. ఏ. యస్. హోదా పొందని వారిని డిప్యూటీ కలెక్టర్లుగా యింకా యెక్కువగా నియమించాలని మహాసభ కోరింది.

హైద్రాబాద్‌లో ఎగుమతి, దిగుమతి కంట్రోలరు ఆఫీసు

ఏర్పాటుచేసే సూచన

హైద్రాబాద్, అక్టోబరు 19

ఎగుమతి, దిగుమతి కంట్రోలర్ ఆఫీసును హైద్రాబాదులో ఏర్పాటు చేయవచ్చునని మద్రాసు జాయింట్ ఛీఫ్ కంట్రోలర్ శ్రీ ఆర్. సి. శంకర్ నేడిక్కడ సూచనప్రాయంగా అన్నారు.

ఈ విషయమై ఆంధ్రప్రభుత్వంతో తాను చర్చలు జరిపానని ఆయన ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక వాణిజ్యమండలి ప్రతినిధుల సభలో మాట్లాడుతూ అన్నారు.

ఆంధ్రలోని పారిశ్రామిక అధిపతులు ఎగుమతుల్ని పెంచటానికి చేస్తున్న కృషిని అభినందించారు. దిగుమతుల్ని తగ్గించుకొని వాటికిబదులు స్వదేశీ వస్తువుల్ని వాడుకోటానికి యత్నించాలని కోరారు.

నందిగామ తాలూకాలో పంపింగ్ పథకం

విజయవాడ, అక్టోబరు 19

రు. 14 లక్షల వ్యయంతో 60 వేల ఎకరాల భూమికి నీరు అందించగల పంపింగ్ పథకానికి కేంద్ర ఇరిగేషన్ మంత్రి డాక్టర్ కె. యల్. రావు నందిగామ తాలూకాలోని వున్నేపల్లివద్ద నిన్న ప్రారంభోత్సవం చేశారు.

ఈ పథకం క్రింద వున్నేపల్లి, పొన్నూరు, చంద్రాలపాడు వగైరా గ్రామాలకు చెందిన భూములకు నీరు లభ్యమవుతుంది.

బెత్తాలతో పోలీసులదాడి

కాండ్వా విద్యార్థి ప్రదర్శకులపై

కాండ్వా, అక్టోబరు 18

మధ్యప్రదేశ్‌లోని కాండ్వా బజార్లలో విద్యార్థులు జరుపుతున్న ప్రదర్శనపై పోలీసులు బెత్తాలతో దాడిచేశారు. ఆ ఘటన జరిగిన మరుక్షణమే 144 వ సెక్షన్ జారీచేసి, కాండ్వా మునిసిపల్ ప్రాంతంలో వారంరోజులపాటు బహిరంగసభలను, ప్రదర్శనలను నిషేధించారు. బజార్లను పోలీసులు కావలా కాస్తున్నారు.

ఇటీవల మధ్యప్రదేశ్‌లో విద్యార్థులపై జరిపిన పోలీసు అత్యాచారాలపై న్యాయ విచారణ జరిపించవలసిందిగా కోరుతూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు కళాశాలకు హాజరు కాకుండా నేటి ఉదయం ప్రదర్శనగా, ప్రభుత్వ పోస్టు గ్రాడ్యుయేట్ కళాశాలవద్దకు వెళ్ళారు. అక్కడ ప్రదర్శనలో యింకా అనేకమంది విద్యార్థులు పాల్గొన్నారు.

తర్వాత ప్రదర్శన దాంచేబజారుకువెళ్ళి, వర్తకులను కొట్లు మూసివేయవలసిందిగా డిమాండ్ చేశారు. ఆ సందర్భంలో పోలీసులు ప్రదర్శకులపై బెత్తాలు ప్రయోగించారు.

గోవా బయటవున్న గోవన్లు గోవా భవితవ్యం విషయమై జరిగే ఎన్నికల్లో పాల్గొనడానికి నిరాకరిస్తే, తమ న్యాయమైన కోర్కెను సాధించడానికి సుప్రీంకోర్టుకు వెళ్లవలసి వస్తుందని ఐక్యగోవా శాసనసభ పార్టీ సభ్యుడు జె. యం. డి. సేజా తెలియ చేశారు.



విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరఫున ఎడిటర్, ప్రింటర్, అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్స్, విజయవాడ-1. ప్రధాన సంపాదకుడు ఏటుకూరు బలరామమూర్తి.